ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 19.03.2026 | సంపుటి :12 సంచిక : 239 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రారా?



## రాజులు పోయినా, రాజ్యాలు పోయినా వారి రాచరిక పోకడలు ఇంకా పోలేదు

## కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..సూచనలు,సలహాలు ఇవ్వాలి

**నియంత పోకడలతో బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు**

**సభాసాంప్రదాయాలను గౌరవించకపోడం తెలంగాణ సంస్కృతికి విరుద్ధం: సీఎం రేవంత్**

హైదరాబాద్(జనంసాక్షి): గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు వివరించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతే ప్రసంగాన్ని తయారు చేశామన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం మాట్లాడారు. "రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా.. రాచరికపు పోకడలు పోలేదు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి.. లేనప్పుడూ అదే ధోరణి" అని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని పేర్కొన్నారు. "కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత వస్తారనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందనుకున్నాం. గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం నుంచి కనీస స్పందన రాలేదు. కేసీఆర్ సభకు రావాలని మిగతా 2లో..

# సీఎస్ పదవీకాలం మూడు నెలలు పొడిగింపు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పదవీ కాలం పొడిగింపుపై గత కొద్దిరోజులుగా సాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఆయన సర్వీసును మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వ పర్సనల్ అండ్ ట్రైనింగ్ మిగతా 2లో..





# అకాల వర్షంతో అపారనష్టం

## దెబ్బతిన్న కూరగాయలు, మొక్కజొన్న, వరి

మెదక్,కరీంనగర్(జనంసాక్షి): మెదక్ జిల్లాలో కురిసిన అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ముఖ్యంగా జిల్లా పరిధిలోని రేగోడు, పెద్ద శంకరంపేట, నర్సాపూర్, మెదక్ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో కూరగాయలు, మొక్కజొన్న, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మెదక్ జిల్లాలో రేగోడ్‌లో 27.4 మిల్లీ మీటర్, శంకరంపేటలో 20.3 కిలోమీటర్లు, నర్సాపూర్‌లో 17.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం జరిగింది. మిగితా మండలాల్లో చినుకులతో కూడిన వర్షం పడింది.ఇటీవల సాగులో ఉన్న పంటలు కోత దశకు చేరుకున్న సమయంలో కురిసిన వర్షంతో పొలాల్లో నీరు నిలిచిపోయి పంటలు కుళ్లిపోతున్నాయి. కూరగాయల మిగతా 2లో..



# మూసీ రివర్‌ఫ్రంట్‌పై వాదోపవాదాలు



**ప్రాజెక్టుపై అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేల మాటల యుద్ధం**

- మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ వైఖరి ఎంటో స్పష్టం చేయాలి: భట్టి విక్రమార్క
- మూసీ ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదు.. ఆ పేరుతో లక్షల కోట్ల దోపిడీ సరికాదు : కేటీఆర్
శాసనసభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్
- మూసీ ప్రాజెక్టు మొదటి దశ డీపీఆర్ తయారైంది: మంత్రి శ్రీధర్‌బాబు
- ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదు, ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇళ్లు ఇస్తాం
- అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇస్తాం
- రెండు, మూడు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీని తీసుకొస్తాం : మంత్రి పొంగులేటి
- వచ్చే ఏడాది జూన్ నాటికి రాష్ట్రంలో హ్యామ్ రోడ్లు పూర్తి చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ సమర్థిస్తుందా? వ్యతిరేకిస్తుందా? అని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. మూసీ పరివాహక ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో జీవిస్తున్నారని తెలిపారు. వారి జీవనస్థితిగతులు మార్చి, మూసీని హైదరాబాద్‌కు మణిహారంగా మార్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మూసీ ప్రక్షాళన వల్ల ఇళ్లు కోల్పోయే వారికి పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ వార్త చదివారా: మూసీ ప్రాజెక్టు మొదటి దశ **డీపీఆర్ తయారైంది: మంత్రి శ్రీధర్‌బాబు**
మూసీ ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదు: కేటీఆర్
అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం సంతృప్తిగా లేదన్నారు. మిగతా 2లో..

# ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీ బిజీ



- రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంక,కేసీ వేణుగోపాల్‌లతో సీఎం భేటీ
- రాజకీయ పరిణామాలు, అసెంబ్లీలో చర్చకు వస్తున్న అంశాలపై చర్చ
- మొయినాబాద్ డ్రగ్స్ కేసులో మా ప్రమేయం లేదు
- నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్
- 2029లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు
- మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదే..
- ఢిల్లీలో పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి


న్యూఢిల్లీ(జనంసాక్షి): ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, అసెంబ్లీలో చర్చకు వస్తున్న అంశాలు, ప్రతిపక్షాల తీరు తదితర అంశాలు వారి వద్ద చర్చకు వచ్చినట్లు సమాచారం. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్‌ల నియామకంపై రేవంత్ రెడ్డి చర్చించినట్లు తెలుస్తోంది. మల్లికార్జున ఖర్గేతో సీఎం దాదాపు గంటపాటు సమావేశమైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వేణుగోపాల్‌తో భేటీ అయినప్పుడు పార్టీ, ప్రభుత్వానికి సంబంధించిన అనేక అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు అసెంబ్లీలో చర్చకు వస్తున్న అంశాలు, ప్రతిపక్షాల తీరు తదితర అంశాలు వారి వద్ద చర్చకు వచ్చినట్లు మిగతా 2లో..

# గల్ఫ్ ప్రవాస భారతీయులు ఇంటిబాట

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో 2.6లక్షల మంది భారతీయులు స్వదేశానికి
- చైనాను కాదని భారత్‌వైపు మళ్లిన చమురు ట్యాంకర్ వార్తలు..
- మాకు సమాచారం లేదు:కేంద్రం
- హర్మూజ్‌ను దాటిన 90 నౌకలు..
- గుజరాత్‌కు చేరుకున్న చమురునౌక జగ్ లాడ్కీ..

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు అక్కడ ఉన్న ప్రవాస భారతీయుల్లో 2.6లక్షల మంది స్వదేశానికి చేరుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. యూఏఈ నుంచి భారత్‌లోని వివిధ ఎయిర్‌పోర్టులకు దాదాపు 70 విమాన సర్వీసులు నడుస్తున్నట్లు పేర్కొంది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం మన పౌరులు, మిగతా 2లో..





# మీ చమురు, గ్యాస్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తాం

**పొరుగు దేశాలకు ఇరాన్ తీవ్ర హెచ్చరికలు**

**మళ్ల భగ్గుమన్న చమురు ధరలు**

టెహ్రాన్(జనంసాక్షి):తమ ఇంధన మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులకు ప్రతిగా పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలకు ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అంబ్ ఎమిరేట్స్‌లోని చమురు, గ్యాస్ మౌలిక సదుపాయాలపై మిగతా 2లో..

# హర్మూజ్ వద్ద భీకర దాడులు

## జల సంధి సమీపంలో బంకర్ బస్టర్ బాంబులతో విరుచుకుపడిన అమెరికా

- ప్రకటించిన అమెరికా సెంట్రల్ కమాండ్
- ఇరాన్‌కు శాశ్వత నష్టం తప్పదు: ట్రంప్
- ఐడీఎఫ్ దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖాతిబ్ మృతి
- ప్రకటించిన ఇజ్రాయెల్
- మొజ్తాబాను కూడా ఎక్కడున్నా వెంబడించి, అంతం చేస్తామని వెల్లడి
- ఇరాన్ డ్రోన్లను ఎదుర్కోవడానికి.. గల్ఫ్ దేశాలకు ఉక్రెయిన్ నిపుణులు

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని నియంత్రిస్తోన్న ఇరాన్‌ను అడ్డుకునేందుకు అమెరికా తాజాగా భీకర దాడులకు దిగింది. ఈ జలసంధి సమీపంలోని భూగర్భ క్షిపణి స్థావరంపై అత్యంత శక్తిమంతమైన బాంబులతో విరుచుకుపడింది. ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది."హర్మూజ్ జలసంధికి సమీపంలోని ఇరాన్ క్షిపణి స్థావరాల్లో ఉన్న యాంటీ-షిప్ క్రూజ్ క్షిపణులు.. అంతర్జాతీయ సముద్ర రవాణాకు ముప్పుగా మారాయి. అందుకే ఈ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నాం. లోతుగా చొచ్చుకుపోయే 5వేల పౌండ్ల (దాదాపు 2200 కిలోలకు పైమాటే) శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబులతో విజయవంతంగా దాడులు చేశాం" అని యూఎస్ సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది.ఇరాన్ తీర రక్షణ నెట్‌వర్క్‌లో మిగతా 2లో..

# రాష్ట్రాలకు అదనంగా మరో 10% ఎల్‌పీజీ సరఫరా

**కొరతను అధిగమించేందుకు కేంద్రం కీలక ప్రకటన**

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా దేశంలో తలెత్తిన ఎల్‌పీజీ కొరతను అధిగమించేందుకు కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా మరో 10 శాతం కమర్షియల్ ఎల్‌పీజీ అందించేందుకు అంగీకరించింది. అయితే ఎల్‌పీజీ భారాన్ని తగ్గించి పైప్డ్ నేచురల్ గ్యాస్ వాడకాన్ని పెంచే రాష్ట్రాలకు మాత్రమే ఈ అదనపు



# డిమాండ్ మేర విద్యుత్ సరఫరా

- 19 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌నూ సమర్థంగా తట్టుకునే నెట్‌వర్క్ సిద్ధం
- యాసంగి పంటలు, వేసవికాలం ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి



హైదరాబాద్(జనంసాక్షి):యాసంగి పంటల సీజన్‌తో పాటు వేసవి ప్రభావం కారణంగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ వినియోగం గణనీయంగా పెరుగుతుంది, 19 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌నూ సమర్థంగా తట్టుకునే నెట్‌వర్క్ సిద్ధంగా ఉంది ఈ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలనీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు విద్యుత్ శాఖ ఉన్న దా అధికారులను ఆదేశించారు.వేసవికాలం, యాసంగి సాగు సీజన్ నేపథ్యంలో బుధవారం సాయంత్రం అసెంబ్లీ ఆవరణలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూగత సంవత్సరం మార్చి 20న నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లు కాగా, ఈ సంవత్సరం మార్చి 2న 17,606 మెగావాట్ల డిమాండ్‌ను చేరుకుని గత రికార్డును సమం చేసింది. అనంతరం రోజురోజుకీ పెరుగుతున్న డిమాండ్, మార్చి 13న 18,228 మెగావాట్లకు చేరి, 341.08 మిలియన్ యూనిట్ల వినియోగంతో కొత్త రికార్డును సృష్టించిందనీ సమావేశంలో వివరించారు. డిమాండ్ భారీగా పెరిగినా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా, ఓవర్‌లోడింగ్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ సంస్థలు సమర్థంగా వ్యవహరించాయని పేర్కొన్నారు. ఈ కృషికి విద్యుత్ సిబ్బందిని అభినందించారు.అలాగే, విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు మించినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త సబ్‌స్టేషన్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. యాసంగి పంటల సీజన్ మరియు వేసవి కాలం ముగిసేంతవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రైతాంగానికి, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని రంగాల వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమావేశంలో మిగతా 2లో..

# మొక్కజొన్న కొనుగోలు చేయండి

## పంటకు మద్దతుధరపై గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నేతల ఆందోళన

## కేంద్రం కొనడం లేదు .. అయినా మేం కొంటున్నాం:మంత్రి తుమ్మల



హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ, రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రవణ్, ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. మార్కెట్లకు పోటెత్తిన మక్కలను కొనుగోలు చేయకపోవడంతో రైతన్నకు తిప్పలు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేశారు. మొక్కజొన్నలతో గన్‌పార్క్‌లో నినాదాలు చేసిన గులాబీ పార్టీ నేతలు.. అక్కడి నుంచి కాలి నడకన అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వరి వేయొద్దని, పంట మార్పిడి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పదేపదే చెబితే.. ఆ మాటలు నమ్మి రాష్ట్రంలో రైతులు సుమారు 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. తీరా పంట చేతికి వచ్చాక ఆ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతోందని అన్నారు. మొక్కజొన్న మార్కెట్లకు రావడం మొదలై ఇప్పటికే 15 రోజులు అవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను మిగతా 2లో..



# ఎన్ఐఏ అదుపులో అమెరికన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికా కిరాయి సైనికుడు మాథ్యూ వాన్డైక భారత్‌లో అరెస్టయ్యాడు అతడితో పాటు మరో ఆరుగురు ఉక్రెయిన్ జాతీయులు ప్రస్తుతం జాతీయ దర్యాప్తు సంస్థ అదుపులో ఉన్నారు. వీరు పర్యటక వీసాపై దేశంలోకి ప్రవేశించి, భారత్ వ్యతిరేక సంస్థలతో పని చేస్తున్నారని ఎన్ఐఏ వెల్లడించింది.మాథ్యూది అమెరికాలోని మేరీలాండ్ రాష్ట్రం. తానొక అంతర్జాతీయ వ్యాపారవేత్త, సైనికుడు, వార్ కరస్పాండెంట్, కాలమిస్ట్ అని తన వెబ్‌సైట్‌లో మిగతా 2లో..

# రాజ్యసభ ఓ ఓపెన్ యూనివర్సిటీ

- ప్రజాసేవలో పదవీ విరమణ లేదు
- సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం
- రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ
- మాతో ప్రేమాయణం..మోడీతో అనుబంధం
- దేవేగౌడపై మల్లికార్జున ఖర్గే ఛతురోక్తులు



న్యూఢిల్లీ(జనంసాక్షి):రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని అన్నారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు.రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు.ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మిగతా 2లో..

# అమెరికాను వీడండి.. 2,600 డాలర్లు అందుకోండి

**అక్రమ వలసదారులకు ట్రంప్ యంత్రాంగం ఆఫర్**

వాషింగ్టన్(జనంసాక్షి): స్వచ్ఛందంగా అమెరికాను వదిలివెళ్లే అక్రమ వలసదారులకు 2,600 డాలర్లు (రూ.2,40,329) ఎగ్జిట్ బోనస్ అందించనున్నట్లు ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. దీంతోపాటు వారి స్వదేశాలకు విమానంలో



# ఢిల్లీ, ఇండోర్‌లోని నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు

**రెండు ఘటనల్లో 17 మంది మృతి**

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఢిల్లీ, ఇండోర్‌లలోని పలు నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించడంతో 17మంది మృతి చెందారు. ఢిల్లీలోని పాలం ప్రాంతంలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో బుధవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పిల్లలతో సహా ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. మంటల నుంచి తప్పించుకోవడానికి భవనం మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
19.03.2026

# ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీ బిజీ

సమాచారం.ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వివరించినట్లు సమాచారం. సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు మంత్రులకు దిశానిర్దేశం చేశారని, అందరు కూడా అందుకు కట్టుబడి ముందుకు వెళ్లాల్సి ఉందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా వేం నరేందర్ రెడ్డి అభిషేక్ మను సింగ్వీలు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్?లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ అభినందించినట్లు తెలుస్తోంది. మంత్రి సీతక్క నిన్న రాత్రి ఢిల్లీకి వెళ్లారు. ఇవాళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అధ్యక్షతన జరగనున్న ఆదివాసీ కాంగ్రెస్ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొననున్నారు.పార్టీలో, బయట ఎలాంటి విమర్శలకు తావు లేకుండా రెండు రాజ్యసభ స్థానాలను అధికార పార్టీ చేజిక్కించుకోవడానికి అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటు పార్టీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ సీనియర్లు కలిసికట్టుగా చొరవ చూపడంతోనే సాధ్యమైనట్లు వివరించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ఎన్నికైన సందర్భంగా ఆయనను వెంటతీసుకుని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకొని నేరుగా అసెంబ్లీకి వచ్చే అవకాశాలు ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మంగళవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు ఇవాళ అక్కడ జరగనున్న ఆదివాసి కాంగ్రెస్ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొంటారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన జరగనున్న ఈ కౌన్సిల్ సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొననున్నారు. పార్లమెంట్?లో పలువురు కేంద్రమంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీలను సీఎం రేవంత్ రెడ్డి కలిసే అవకాశం ఉంది.

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో మా ప్రమేయం లేదు: సీఎం రేవంత్

మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. దీనిలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. "మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం" అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు.అంతకుముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారితో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు.

# ఢిల్లీ, ఇందౌర్‌లోని నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు

పైనుంచి దూకిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు.మరో ఘటనలో ఇందౌర్‌లోని ఓ నివాస భవనం బయట ఉన్న ఎలక్ట్రిక్ వాహనం ఛార్జింగ్ పాయింట్ పేలిపోయి మంటలు చెలరేగాయి ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మరో ముగ్గురు వ్యక్తులను మంటల నుంచి కాపాడి ఆస్పత్రికి తరలిం చామన్నారు. కారు ఛార్జ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు స్థానికులు పేర్కొన్నారు. మంటలు భవనంలోకి వ్యాపించడంతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ కూడా పేలినట్లు అధికారులు తెలిపారు. దీంతో మంటలు మరింత తీవ్రమయ్యాయన్నారు. ఈవీ ఛార్జింగ్ పాయింట్ పేలడానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇదీ చదవండి: విద్యుత్తు రైలింజిన్లతో రూ. 6వేల కోట్లు ఆదా

## అమెరికాను వీడండి.. 2,600 డాలర్లు అందుకోండి

ఉచితంగా పంపించడానికి ఏర్పాట్లు చేస్తామని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. తాము స్వదేశానికి తిరిగివెళ్లేందుకు సిద్ధమేనని 'సీబీపీ హోమ్' యాప్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసే వారి పేర్లను బలవంతంగా స్వదేశానికి తరలించాల్సిన వారి లిస్టు నుంచి తొలగిస్తామని తెలిపింది.అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపడానికి 2025 జనవరిలో అమెరికా చర్యలు ప్రారంభించినట్లు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంది. తాము ఇస్తున్న ఆఫర్‌లను వినియోగించుకొని.. అప్పటినుంచి ఇప్పటివరకు 22 లక్షలకు పైగా అక్రమ వలసదారులు తమ దేశాలకు తిరిగివెళ్లినట్లు వెల్లడించింది. స్వచ్ఛందంగా స్వదేశానికి తిరిగి వెళ్లడమే అక్రమంగా అమెరికాకు వచ్చినవారి ముందున్న అతి సురక్షితమైన, చవకైన మార్గమని తెలిపింది. అలా చేస్తే అరెస్టు కాకుండా కూడా ఉండొచ్చని సూచించింది.

# రాజ్యసభ ఓ ఓపెన్ యూనివర్సిటీ

మధ్య ఉన్న విభేదాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు.

# అకాల వర్షంతో అపారనష్టం

పంటలు పూర్తిగా నేలకూలగా, మొక్కజొన్న, వరి పంటలు కూడా తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. కరీంనగర్ జిల్లా వీణవంకలోనూ అపార పంటనష్టం జరిగింది. నర్సింగాపూర్‌లోనూ మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతింది. కొన్ని చోట్ల మామిడి పిందెలు రాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గత రాత్రి కురిసిన వడగండ్ల వానకు.. చేతికొచ్చిన పంట నేలరాలింది. భారీగా పంట నష్టం తలెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షానికి మిర్చి రైతులు విలవిలలాడారు. మిర్చి కుప్పలపై టార్పాలిన్లు కప్పి పంటను కాపాడుకుంటున్నారు రైతులు.

## రాష్ట్రాలకు అదనంగా మరో 10% ఎల్‌పీజీ సరఫరా

సరఫరా వర్తిస్తుందని తెలిపిం ది. ఆ ప్రకారం ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేలా రాష్ట్రాలు ప్రోత్సహించడం, మౌలిక సదు పాయాలు మెరుగుప రచడం చేయాల్సి ఉంటుంది. దేశీయ వంటగ్యాస్ సరఫరాకు ఆటంకం కలగకుండా చూడటం, వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ కొరత తీర్చడం ప్రభుత్వ ముఖ్యోద్దేశమని పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. సీజీడీ అప్లికేషన్ల అప్రూవల్, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లయితే 1 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని, డీమ్డ్ సీజీడీ పర్మిషన్లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేస్తే 2 శాతం, రోడ్ల తవ్వకం, మరమ్మతు పథకం ప్రవేశపెడితే 3 శాతం, వార్షిక రెంటల్/లీజ్ తగ్గిస్తే 4 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని ఆమె చెప్పారు. ఎల్‌పీజీ అంశం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ పరిస్థితి మెరుగుపడిందని సుజాత శర్మ తెలిపారు.చాలా రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాగా, ఎల్పీజీ సరఫరాలపై ఒత్తిడిని తగ్గించేందుకు హాస్పిటాలిటీ, రెస్టారెంట్లతో సహా పలు రంగాలకు కిరోసిన్, బొగ్గు సరఫరాలకు కేంద్రం ఇప్పటికే ఆదేశాలిచ్చింది.

# కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్షనేత అసెంబ్లీకి రారా?

కోరుకుంటున్నాం. ఆయన సభలో పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలి.ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విధానాలే కారణం. పీవీ, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తొలిసారి హైటెక్ సిటీకి పునాది రాయి వేశారు. అనంతరం చంద్రబాబు, వాజ్‌పేయీ హైటెక్ సిటీని పూర్తి చేశారు. ప్రస్తుతం ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంది. సవాళ్లను ఎదుర్కోవడంపై విజన్ డాక్యుమెంట్‌ను సభలో ప్రవేశపెట్టాం.ముందు చూపులో భాగంగానే హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరిస్తున్నాం. కబ్జాల చెర నుంచి విడిపించి పునరుజ్జీవం చేస్తున్నాం. నాలాల్లో ఆక్రమణలను తొలగించి.. ముంపు సమస్యను పరిష్కరిస్తున్నాం. హైదరాబాద్‌లో నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని గతంలో కేసీఆర్ అన్నారు. వాటిని నిర్దాక్షిణ్యంగా కూల్చాలని గతంలో కేటీఆర్ ఆదేశాలు ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కార్యాచరణనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది.భాజపా నేతలు సబర్మతి, గంగా, యమునా నదుల ప్రాజెక్టుల గురించి గొప్పగా చెప్తున్నారు. కానీ, మూసీ ప్రాజెక్టును మాత్రం తప్పుపడుతున్నారు. మూసీ పరివాహకంలో ఎవరి అనుచరులు క్రికెట్ మైదానాలు నిర్మించారో ప్రజలకు తెలుసు. హైదరాబాద్‌లో మూడు వేల ఎలక్ట్రికల్ బస్సులు నడిపి కాలుష్యం తగ్గిస్తాం. పెట్రోల్, డీజిల్ ఆటోలనూ ఈవీలుగా మార్చే కార్యాచరణ చేపడుతున్నాం. మెట్రోను విస్తరించేందుకు కష్టపడుతున్నాం. నగరానికి మూడు బుల్లెట్ రైళ్లు రానున్నాయి" అని సీఎం అన్నారు.

# సీఎస్ పదవీకాలం మరో మూడు నెలలు పొడిగింపు

విభా గం కీలక నిర్ణయం తీసుకుం ది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ఉత్తర్వులు అందాయి. తాజా పొడిగింపుతో రామకృష్ణారావు జూన్ నెలాఖరు వరకు తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. వాస్తవానికి రామకృష్ణారావు గతేడాది ఆగస్టు 31నే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే.. రాష్ట్రంలో పాలనాపరమైన అవసరాలు, కీలక ప్రాజెక్టుల అమలు దృష్ట్యా ఆయన సేవలు మరికొంత కాలం అవసరమని భావించిన ప్రభుత్వం, గతంలోనే ఏడు నెలల పొడిగింపు కోరింది. ఆ గడువు ఈ ఏడాది మార్చి 31తో ముగియనుంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కేంద్రానికి విన్నవించగా, సానుకూల స్పందన లభించింది.

# మూసీ రివర్‌ఫ్రంట్‌పై వాదోపవాదలు

"డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని జనవరిలో చెప్పారు. పాకిస్థాన్‌లో నిషేధించిన కంపెనీకి అవకాశం ఇచ్చారు. డీపీఆర్‌ను సభ ముందు పెట్టాలి. రుణానికి ఏడీబీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు గతంలో సభలో మంత్రి తెలిపారు. కానీ.. డీపీఆర్ ఇవ్వలేదని.. రుణం మంజూరు చేయలేదని ఏడీబీ స్పష్టం చేసింది. సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారా?రూ. 16వేల కోట్లతో అయ్యే ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రూ.లక్షన్నర కోట్లు అని చెప్పారు. మొదటి దశ రూ. 7వేల కోట్లు అంటు న్నారు.. ఇంకా ఎన్ని దశలు ఉంటాయి? ఎన్ని నివాసాలు కూలుస్తారు? మంత్రి 1,435 నిర్మాణాలు అన్నారు.. గెజిట్‌లో 10వేల నిర్మాణాలు అని పేర్కొన్నారు. వీటిలో ఏది కరెక్ట్?. మూసీ ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదు.. అందులో జరుగుతున్న దోపిడీకి మాత్రమే వ్యతిరేకం."అని కేటీఆర్ ప్రశ్నించారు.

**శాసనసభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్**

శాసనసభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కేటీఆర్ తెలిపారు. "ప్రభుత్వం దగ్గర నిధులు లేవు.. ప్రణాళికలు లేవు. ఏడీబీ రుణం ఇవ్వలేదు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి మేం వ్యతిరేకం. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వాకౌట్ చేస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

**మూసీ ప్రాజెక్టు మొదటి దశ డీపీఆర్ తయారైంది: మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్: మూసీ ప్రాజెక్టుపై తెలంగాణ శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మూడోరోజు సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. మూసీ ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్ తదితరులు మాట్లాడారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మొదటి దశ డీపీఆర్ తయారైందని చెప్పారు. అంచనా వ్యయం రూ. 6,500 కోట్ల నుంచి రూ. 7000 కోట్లుగా చెప్పారు. ఈ ప్రాజెక్టుతో 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశముందన్నారు. తుది ఎన్యుమరేషన్ కొనసాగుతోందని చెప్పారు. బఫర్ జోన్‌లో ఉన్నవారికి టీడీఆర్ ఇస్తామని.. 2013 చట్టం ప్రకారం అవసరమైన భూసేకరణ, సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపడతామని మంత్రి వివరించారు.

**ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇళ్లు ఇస్తాం : మంత్రి పొంగులేటి**



ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. శాసన మండలిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, మంజూరు సమస్యలపై ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, మధుసూధనాచారి ప్రశ్నలు అడిగారు. టాటా ఏస్ లాంటి కిరాయి వాహనం నడుపుకుంటే ఫోర్ వీల్స్ వాహనం కింద లెక్కేసి ఇందిరమ్మ పథకానికి అనర్హుడని చెబుతున్నారని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే బేస్‌మెంట్లు కట్టుకున్న ఇళ్లను అనుమతించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదని, ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటివరకు 3,24,593 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఏడాదికి 4 లక్షల 50 వేల చొప్పున నిర్మిస్తాం అని చెప్పిందని, మరి ఆ విధంగా ఆ హామీ అమలు కావడం లేదని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్పిన విధంగా దానికి బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో అవకవతవకలు జరుగుతున్నాయని కలెక్టరేట్ల ముందు అర్హులు ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమాధానమిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదని, ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3,24,593 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రింట్ మీడియాను చదివేవారు, ఎలక్ట్రానిక్ మీడియాను చూసే వాళ్లు చాలా తగ్గిపోయారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా డిజిటల్ మీడియా వైపు వెళుతున్నారు అని అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా? అని ఆయన ప్రశ్నించారు. వచ్చే రెండు, మూడు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీని తీసుకు రానున్నామని పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులను వేరు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. నిజమైన జర్నలిస్టులకే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నది తమ లక్ష్యం అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. న్యాయపరమైన వివాదాలు లేకుండా పాత్రికేయులకు ఇళ్ల స్థలాల పంపిణీకి యోచిస్తున్నట్లు చెప్పారు. వర్కింగ్ మరణించిన వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం లక్ష రూపాయలు అందిస్తుందని వివరించారు.

**వచ్చే ఏడాది జూన్ నాటికి రాష్ట్రంలో హ్యామ్ రోడ్లు పూర్తి చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి**

2028 జూన్ నాటికి దేశంలో తెలంగాణ మోడల్‌గా నిలిచేలా హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) పద్ధతిలో రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్?రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు రూ. 30 వేల కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. దాదాపు రూ. 17 వేల కోట్ల విలువైన రోడ్ల నిర్మాణానికి ఇంకా టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఏప్రిల్ 10 నాటికి అగ్రిమెంట్లు పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి రాష్ట్రంలో హ్యామ్ రోడ్లు పూర్తి చేస్తామన్నారు. రహదారులు రాష్ట్ర అభివృద్ధికి సూచికలన్న మంత్రి వెంకటరెడ్డి, పేదల ఇంటి ముందు రోడ్డు ఉంటేనే నిజమైన డెవలప్?మెంట్ అన్నారు.

# ఎన్ఐఏ అదుపులో అమెరికన్

పేర్కొన్నాడు. ది బాల్టిమోర్ ఎగ్జామినర్ మీడియా సంస్థకు వార్ కరస్పాండెంట్ (యుద్ధవార్తలను కవర్ చేసే జర్నలిస్ట్)గా పనిచేసినప్పుడు.. ఇరాక్‌లో అమెరికా దళాలతో కలిసి ఉన్నాడు. తాను లిబియా విప్లవంలో పాల్గొన్నానని, అప్పుడు పట్టుబడి జైలు శిక్ష అనుభవించానని చెప్తుంటాడు. ఒక మిలిటరీ కాంట్రాక్ట్ కంపెనీ సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్‌ని స్థాపించాడు. "ఉగ్రవాదం, అణచివేత పాలనకు వ్యతిరేకంగా పోరాతున్నవారికి ఉచిత భద్రత, శిక్షణ అందించే లాభాపేక్ష లేని సంస్థ" గురించి పేర్కొన్నాడు. డ్రోన్ వార్‌ఫేర్ ట్రైనింగ్, అక్రమంగా సరిహద్దు దాటడానికి ప్రయత్నించడం, ఈశాన్య భారత్‌కు సమీపంలో చురుగ్గా ఉన్న సాయుధ గ్రూపులతో సంబంధాల కింద ఎన్ఐఏ అతడిపై చట్టవిరుద్ధ కార్యకలాపాల కింద కేసు నమోదు చేసింది. ఉగ్రవాద చర్యలకు ప్రేరేపించడం, కుట్రపన్నడం వంటి అభియోగాలు నమోదైనట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. "నిందితులు వేర్వేరు తేదీల్లో సరైన పత్రాలు లేకుండానే భారత్‌లోని మిజోరం రాష్ట్రానికి చేరుకున్నారు. అక్కడి నుంచి మయన్మార్‌లోని సైనిక పాలనకు వ్యతిరేకంగా పోరాడుతోన్న గ్రూప్‌లకు డ్రోన్ వార్‌ఫేర్ ట్రైనింగ్ ఇవ్వాలన్నది వీరి లక్ష్యం" అని ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. అలాగే డ్రోన్ల కన్‌సైన్‌మెంట్ ఒకటి ఐరోపా నుంచి మయన్మార్‌కు భారత్ మీదుగా వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. అది కూడా మయన్మార్‌లోని తిరుగుబాటు గ్రూప్‌ల కోసమేనని అనుమానిస్తున్నారు. మయన్మార్‌లో చురుగ్గా ఉన్న గ్రూప్‌లకు భారత్‌లో నిషేధం ఎదుర్కొంటున్న సంస్థలతో సంబంధాలున్నాయని భావిస్తున్నారు.

# డిమాండ్ మేర విద్యుత్ సరఫరా

ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, తెలంగాణ డిస్కమ్‌ల సీఎండీలు ముషారఫ్ ఫరూఖీ, జితేష్ వి. పాటిల్, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజోన్న కొనుగోలు చేయండి

ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ. 2400 ఉంటే.. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు బయట మార్కెట్లో దళారులకు రూ. 1600 నుంచి 1700లకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పదిహేను రోజులుగా కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం చూస్తుంటే ప్రభుత్వ ఆంతర్యం ఏమిటో అర్థమవుతోందని అన్నారు. పంట అంతా దళారుల పాలైన తర్వాత, ఆ దళారుల దగ్గర ఎక్కువ ధరకు కొని వాళ్లకు మేలు చేయాలని ప్రభుత్వం చూస్తోందా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందా? దళారులకు మేలు చేస్తుందా? అనేది స్పష్టం చేయాలన్నారు. ఒకవైపు మద్దతు ధర లేక నష్టపోతుంటే, మరోవైపు అకాల వర్షాలకు మార్కెట్ యార్డుల్లో, కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న తడిచిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. గత రెండు రోజులుగా కురిసిన వడగండ్ల వానలకు మొక్కజొన్న, మామిడి సహా ఇతర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని పేర్కొన్నారు. బ్జడెట్‌లో పంటల బీమా గురించి గొప్పగా ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం అటు పంటల బీమా అమలు చేయదు, ఇటు ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వదని మండిపడ్డారు.



# హర్మ్యూజ్ వద్ద భీకర దాడులు

భాగమైన ఆయుధ నిల్వలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా తెలిపింది. హర్మ్యూజ్‌లో చమురు రవాణా నిరంతరాయంగా కొనసాగాలంటే ఈ నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయాల్సిన అవసరం ఉందని అగ్రరాజ్యం భావిస్తోంది. తద్వారా ఈ జలసంధి మార్గంలో వెళ్లే నౌకలపై ఇరాన్ దాడులు చేయకుండా అడ్డుకుంటామని తాజా చర్యతో అమెరికా సంకేతాలిచ్చినట్లయ్యింది.

**ఇరాన్‌కు శాశ్వత నష్టం తప్పదు: ట్రంప్**

ఇజ్రాయెల్–అమెరికా సంయుక్త దాడుల వల్ల ఇప్పటికే ఇరాన్ భారీగా నష్టపోయింది. ఓవైపు కీలక నేతలు వరుసగా ప్రాణాలు కోల్పోతుండగా.. మరోవైపు అణు స్థావరాలు, పౌర నివాసాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడులు ఇంకా ముగియలేదని.. ఆ దేశానికి శాశ్వత నష్టం కలిగించడానికి అగ్రరాజ్యం చర్యలు తీసుకుంటుం దన్నారు. ఇప్పుడే యుద్ధాన్ని ఆపేసినా ఆ దేశాన్ని పునర్నిర్మించుకోవడానికి అక్కడి పాలకులకు 10 ఏళ్ల సమయం పడుతుందని అన్నారు. కానీ మళ్లీ కోలుకోలేనివిధంగా ఇరాన్‌కు నష్టం కలిగించాలన్నదే తమ లక్ష్యమని వెల్లడించారు. మరో అధ్యక్షుడు ఇటువంటి తప్పు చేయకుండా ఇరాన్‌కు తగిన బుద్ధి చెబుతామని ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశంపై తాము చేపట్టిన ఆపరేషన్ సరైన దిశలోనే వెళుతోందన్నారు. భవిష్యత్తులో ఇరాన్ నుంచి ఎవరికీ అణుముప్పు కలగకుండా చూడటమే తమ లక్ష్యమన్నారు. మరో రెండు వారాల పాటు ఈ యుద్ధం కొనసాగే అవకాశం ఉందన్నారు. తాము ముందస్తు దాడులను ప్రారం భించకపోయి ఉంటే ఇరాన్ ఇప్పటికే పలు అణ్వాయు ధాలను అభివృద్ధి చేసేదని పేర్కొన్నారు. హర్మ్యూజ్ జలసంధికి యుద్ధ నౌకలను పంపడానికి నాటోతో పాటు మిత్రదేశాలు నిరాకరించడంపై ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయంలో నాటో తెలివితక్కువగా ప్రవర్తిస్తోందన్నారు. హర్మ్యూజ్ జలసంధిని తెరిపిం చాల్సిన అవసరం ఉన్నప్పటికీ తమ మిత్రదేశాలు ముందుకురావట్లేదన్నారు. అయినప్పటికీ వెనక్కి తగ్గే ప్రసక్తి లేదన్నారు. తమది ప్రపంచంలోనే అత్యంత బలమైన దేశమని..అత్యంత శక్తిమంతమైన సైన్యం తమకు ఉందని పునరుద్ఘాటించారు.

**ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖాతిబ్ మృతి**

ఇరాన్ కీలక నేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ దాడులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఐడీఎఫ్ చేపట్టిన వైమానిక దాడుల్లో ఇరాన్ నిఘా వ్యవహారాల మంత్రి ఇస్మాయిల్ ఖాతిబ్ హతమైనట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. ఇటీవల ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీకి ఇస్మాయిల్ అత్యంత సన్నిహితుడిగా చెబుతుంటారు. అయితే, ఖాతిబ్ మరణాన్ని ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు.ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సాల్మనీలు మృతి చెందిన మరుసటి రోజే మరో కీలక నేతను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దాడులు జరిపింది.

**మొజ్తాబా ఎక్కడున్నా వెంబడించి, అంతం చేస్తాం: ఇజ్రాయెల్**

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ ఎక్కడ ఉన్నా వెంబడించి అంతం చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. తమ దేశానికి ముప్పుగా ఉన్నవారు ఎప్పుడూ తమ టార్గెట్‌లోనే ఉంటారని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించింది. అయితే ప్రస్తుతం ఖమేనీ ఎక్కడున్నారనే దానిపై తమ వద్ద సమాచారం లేదని మీడియా అడిగిన ప్రశ్నకు ఐడీఎఫ్ ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ సమాధానం ఇచ్చారు. "ఆయన ఎక్కడున్నారన్న దానిపై మావద్ద ప్రస్తుతం సమాచారం లేదు. కానీ మా దేశానికి ముప్పుగా పరిణమించిన వారిని వెంబడించడం మాత్రం ఆపం. మాకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు మా నుంచి తప్పించుకోలేరు. వారిని తరిమి, తరిమి అంతం చేస్తాం. ఎప్పుడు, ఎక్కడ అనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పలేకపోయినా.. మా టార్గెట్ మాత్రం మిస్ కాదు" అని డెఫ్రిన్ వ్యాఖ్యలు చేశారు.మరోవైపు, దాడుల్లో గాయపడిన ఖమేనీని చికిత్స కోసం రష్యాకు తరలించినట్లు వచ్చిన వార్తలను ఇరాన్ ఖండించింది. "ఇదొక కొత్తతరహా మానసిక యుద్ధం. ఇరాన్ నేతలకు పారిపోవాల్సిన, షెల్టర్లలో దాక్కోవాల్సిన అవసరం లేదు. వారు ప్రజల మధ్యే ఉంటారు" అని రష్యాలో ఇరాన్ రాయబారి కాజెమ్ జలాలీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# మీ చమురు, గ్యాస్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తాం

దాడులు చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు ఆ దేశానికి చెందిన టెహ్రాన్ టైమ్స్ పోస్టులు పెట్టింది.వీటిపై మరికొన్ని గంటల్లో దాడులు చేయబోతున్నట్లు ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్‌లోని అతిపెద్ద గ్యాస్‌ఫీల్డ్ అయిన సౌత్ పార్స్ మౌలిక సదుపాయాలపై బుధవారం దాడి జరిగింది. దీనికి ఇజ్రాయెల్, అమెరికానే కారణమని ఇరాన్ ఆరోపిస్తోంది. మరోవైపు ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఎస్మాయిల్ ఖతీబ్, సీనియర్ భద్రతా అధికారి అలీ లారిజానీ, బసీజ్ ఫోర్స్ అధిపతి జనరల్ గులాం రెజా సాల్మనీ మృతి చెందారు. టాప్ లీడర్ల మరణం నేపథ్యంలో ఇరాన్ నుంచి తీవ్రస్థాయిలో హెచ్చరికలు రావడం గమనార్హం.అంతర్జాతీయంగా తగ్గినట్లే తగ్గిన చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. ఇరాన్‌లోని గ్యాస్ మౌలిక సదుపాయాలను ఇజ్రాయెల్ ధ్వంసం చేసిన నేపథ్యంలో వీటి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర ఏకంగా 5 శాతం పెరిగి మళ్లీ 108 డాలర్ల స్థాయికి చేరింది. తాజా దాడుల వల్ల దీర్ఘకాలంలో సప్లయ్ చైన్‌కు అంతరాయాలు ఏర్పడతాయన్న భయాలు నెలకొన్నాయి.

# గల్ఫ్ ప్రవాస భారతీయులు ఇంటిబాట

విద్యార్థులకు సాయం అందిస్తోందని.. అనేక మంది భారతీయులు ఇరాన్ సరిహద్దు దాటి ఆర్మేనియా, అజర్‌బైజాన్‌లకు వెళ్లాలని భావిస్తున్నట్లు చెప్పింది.

కువైట్ యువరాజుతో మోదీ సంభాషణ..

గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తుండడంతో అక్కడున్న భారతీయుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో కువైట్ యువరాజుతో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. కువైట్‌పై దాడులను భారత్ ఖండిస్తోందన్నారు. హర్మ్యూజ్ జలసంధి మార్గంలో నౌకలు సురక్షితంగా, స్వేచ్ఛగా వెళ్లేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి నిరంతర దౌత్య చర్చలు ఎంతో అవసరమని ఉద్ఘాటించారు.

చైనాను కాదని భారత్‌వైపు మళ్లిన చమురు ట్యాంకర్‌లు చైనాకు వెళ్తున్న చమురు ట్యాంకర్ అక్వా టైటాన్ భారత్ వైపు మళ్లిందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దక్షిణ చైనా సముద్ర జలాల్లో అది టర్న్ అయిందని ఆ కథనాల సారాంశం. వీటిపై భారత ప్రభుత్వం స్పందించింది. ఆ రష్యన్ ట్యాంకర్‌కు సంబంధించి తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా బుధవారం వెల్లడించారు.పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన భయాలు నెలకొన్న వేళ.. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను భారీగా పెంచింది. ఈ నేపథ్యంలోనే చైనాకు వెళ్తున్న ఇంధన ట్యాంకర్.. మనదేశం వైపుగా వస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. కర్ణాటకలోని న్యూ మంగళూరుకు మార్చి 21న చేరుకోనుందని పేర్కొన్నాయి. ఈ ఏడాది జనవరి చివరిలో బాల్టిక్ సీ పోర్ట్‌లో ఈ ట్యాంకర్‌లోకి చమురు లోడ్ అయిందని తెలిపాయి. వాస్తవంగా ఇది చైనా (అస్త్రతినిజీ)లో రిజావో పోర్ట్‌కు వెళ్లాల్సి ఉందని రాసుకొచ్చాయి.కాగా.. రష్యా చమురు కొనుగోలుపై విధించిన పలు ఆంక్షలను ఇటీవల అమెరికా సడలించిన నేపథ్యంలో.. భారత్‌కు చమురు దిగుమతులు పెరిగాయి. దాంతో ఇప్పటివరకు దేశ రిఫైనరీలు 30 మిలియన్ల బ్యారెళ్ల చమురును కొనుగోలు చేశాయి. ఇక, జపాన్, దక్షిణకొరియా వంటి పలు దేశాలు కూడా మళ్లీ రష్యా చమురు కొనుగోళ్లను పెంచడంతో దీని ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి.


హర్మ్యూజ్‌ను దాటిన 90 నౌకలు..

ఇరాన్ యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి చమురు ట్యాంకర్లు సహా 90 నౌకలు హర్మ్యూజ్ జలసంధిని దాటాయి. ఈ విషయాన్ని మారిటైమ్ అండ్ ట్రేడ్ డేటా ప్లాట్‌ఫామ్స్ వెల్లడించాయి. ఈ నౌకలన్నీ తమ ట్రాకింగ్ వ్యవస్థలను ఆపేసి, డార్క్ మోడ్‌లో పాశ్చాత్య దేశాల ఆంక్షలను దాటుకొని హర్మ్యూజ్ మీదుగా ప్రయాణించాయి. ఇలా మన దేశానికి రావాల్సిన నౌకలు కూడా ఆ జలసంధిని దాటి, పోర్టులకు చేరుకుంటోన్న సంగతి తెలిసిందే.

గుజరాత్‌కు జగ్ లాడ్కీ..

ఇరాన్ యుద్ధం వేళ ముడిచమురు నౌక 'జగ్ లాడ్కీ' భారత్‌కు చేరుకుంది. అది యూఏఈ నుంచి 81వేల మెట్రిక్ టన్నుల చమురును గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్‌కు తీసుకువచ్చింది.

# తండ్రీ, కూతురు సజీవ దహనం



హనుమకొండ ప్రతి నిధి మార్చి 18 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో జరిగిన తండ్రి కూతుళ్ళ సజీవ దహన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. హైదరాబాదులో ఉండే రాజశ్రీ–ప్రవీణ్ దంపతు లు రెండు రోజుల క్రితమే కడిపికొండకు వచ్చినట్లు తెలిసింది. వీరికి ఇద్దరు సంతానం కాగా కూతురి అన్నప్రాసన కార్యక్రమం కోసం వచ్చినట్లు సమాచారం. మంగళవారం కార్యక్రమం పూర్తి అయిన తర్వాత.. ఏమైందో ఏమో కానీ తెల్లవారుజామున ఇంట్లో నుంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపే రాజశేఖర్, కూతురు రాజశ్రీ మంటల్లో కాలిపోయారు.

**అల్లుడే కారణమా..!**

కుటుంబ కలహాల నేపథ్యంలో అల్లుడే ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుత్తి తో మామను, భార్యను హత్య చేసిన అనంతరం, దానిని అగ్నిప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితుడు పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు తెలుస్తోంది. సీఐ కిషన్ ఆధ్వర్యంలో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం కు తరలించారు. క్లూస్ టీం సభ్యులు సంఘటనా స్థలంలో కీలక ఆధారాలను సేకరించారు.

# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- పేద ముస్లిం లకు రంజాన్ కానుకల అందజేత




వరంగల్ బ్యూరో, మార్చి 18 (జనం సాక్షి) : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలో బుధవారం క్రిస్టల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "ఈద్ కా తోఫా" కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పేద ముస్లిం లకు దుస్తులను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రంజాన్ పర్వదినం పరస్పర ప్రేమ, దయ, త్యాగానికి ప్రతీక అని సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యం లో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పండుగల సందర్భంగా అవసరమైన సహాయాన్ని అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ముఖ్యమంత్రి మైనారిటీల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కొనియాడిన మంత్రి మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాలకు 3500 "ఈద్ కా తోఫా"లను అందజేస్తున్నందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈద్ పర్వదినం అందరికీ శాంతి, సౌభాగ్యాలను తీసుకురా వాలని ఆకాంక్షించారు. ఈద్ కా తోఫా ల అందజేత వల్ల నిరుపేద ముస్లిం లు పండగను సంతోషంగా ఆనందం గా జరుపుకుం టారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, రంజాన్ మనుషుల్లో మనస్ఫూర్తి, కరుణ, పరస్పర గౌరవాన్ని పెం పొందించే పవిత్రమైన పర్వదినమని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలంటే పరస్పర సహ కారం అవసరమని, ప్రభుత్వ పథకాలు అందరి కీ చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. పండుగలు మనలను ఒకటిగా కలిపే వేదికలని, ఇలాంటి కార్యక్ర మాలు సామాజిక ఐక్యతను మరింత బలపరు స్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఫుర్ఖాన్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, చింతాకుల అనిల్ కుమార్, బస్వరాజు కుమార స్వామి ఆర్ డి వో సుమ, డిఎండబ్ల్యూ ఓ రమేష్, బల్దియా డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, తహసిల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తడి నేలలతో పర్యావరణ ప్రయోజనాలు

- చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




నిర్మల్ రూరల్, మార్చ్18(జనం సాక్షి) : చిత్తడి నేలలతో(వెట్ ల్యాండ్స్)అనేక పర్యావరణ ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లాలో చిత్తడి నేలల గుర్తింపుకు సంబంధించిసంబంధిత అధికారులతో కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో బుధవారం సాయంత్రం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న చిత్తడి నేలలను శాస్త్రీయంగా గుర్తించి వాటిని అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో భాగంగా అటవీ,రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వేలు నిర్వహించాలని సూచించారు. చిత్తడి నేలల వల్ల భూగర్భ జలమట్టం పెరగడమే కాకుండా, జీవవైవిధ్యం పెంపొందుతుందని,వీటిని గుర్తించి కాపాడుకోవడం మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో గుర్తించిన చిత్తడి నేలలను కేవలం పర్యావరణ కోణంలోనే కాకుండా, పర్యాటక కేంద్రాలుగా కూడా తీర్చిదిద్దే అవకాశం ఉందని తద్వారా జిల్లా అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల స్థానికం గా ఉపాధి అవకాశాలు మెరుగుపడ తాయని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, అటవీ శాఖాధికారి (డిఎఫ్ఓ)సుశాంత్ సుఖదేవ్ బోబడే,ఆర్డీవో రత్నకళ్యాణి,డిఆర్డిఓ విజయలక్ష్మి,డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మవార్ల ఆశీస్సులు అందరి మీద వుండాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త



హైదరాబాద్ (జనంసాక్షి) : అమ్మవార్ల ఆశీస్సులు అందరి మీద వుండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. పెద్ద అంబర్ పేట సంగీ టెంపుల్ రోడ్డు లో గల తన సాయి శ్రీనివాస బాటిల్స్ కంపెనీ ప్రాంగణంలో ఘనంగా ఎల్లమ్మ తల్లి, ఉప్పలమ్మ తల్లి బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్ గుప్త కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రాంత ప్రజల శ్రేయస్సు, శాంతి, సౌభాగ్యాల కోసం ఆ అమ్మవార్ల ఆశీస్సులు అందరి మీద వుండాలి అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు మాట్లాడుతూ, మన సంప్రదాయాలు, పండుగలు మన సంస్కృతికి ప్రతీకలని, వాటిని భక్తి భావంతో కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న, కుమారుడు ఉప్పల సాయి కిరణ్ కోడలు శార్వారీ చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ కంపెనీ సిబ్బంది కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## గల్ఫ్ సంక్షేమానికి నిధులకై భట్టిని కలిసిన ఎన్నారై కమిటీ

నిర్మల్ బ్యూరో, మార్చి18 (జనంసాక్షి) : గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్ లో నిధులు కేటాయించాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో... ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ప్రతినిధి బృందం బుధవారం అసెంబ్లీ ఆవరణలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ బృందంలో ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల ఉన్నారు. మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

# అంతర్జాతీయ సదస్సుకు ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు





హనుమకొండ ప్రతినిధి మార్చి 18 (జనం సాక్షి) : చెన్నైలోని జాయ్ వ్యవసాయ అగ్రిటెక్ విశ్వవిద్యాలయంలో మార్చి 26, 27 తేదీలలో నిర్వహించనున్న అంతర్జాతీయ అగ్రిటెక్ వ్యవసాయ సదస్సుకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన ఇద్దరు అధ్యాపకులు ఆహ్వానం పొందారు. పత్రికా విలేఖరిత( జర్నలిజం) విభాగానికి చెందిన సహాయ ఆచార్యులు డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి, భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ ఎల్. జితేందర్ సంయుక్తంగా సిద్ధం చేసిన "వ్యవసాయ ఆర్థిక శాస్త్రం – సుస్థిర అభివృద్ధి" అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సదస్సులో ప్రవేశపెట్టేందుకు ఆమోదం లభించినట్లు కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతర్జాతీయ సదస్సులో వ్యవసాయ రంగ అభివృద్ధి, ఆధునిక అగ్రిటెక్ విధానాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు వంటి అంశాలపై ప్రపంచంలోని పలు విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు, అధ్యాపకులు పాల్గొని తమ పరిశోధనలను సమర్పించ నున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకులు పాల్గొనడం విశ్వవిద్యాలయానికి గౌరవకారణమని ప్రధానాచార్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి, డాక్టర్ ఎల్. జితేందర్‌లను కళాశాల అధ్యాపక వర్గం, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

# లాంగ్ వీకెండ్‌లో ప్రైవేట్ బాదుడు

- బస్సుల్లో ఇబ్బడిముబ్బడిగా రేట్లు



హైదరాబాద్ (జనంసాక్షి) : సామాన్యుడికి సొంతూరి ప్రయాణం భారంగా మారుతోంది. వరుస సెలవులు రావడంతో నగరాల్లో నివసించే ఉద్యోగులు, విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు దీనిని అదునుగా చేసుకుని ఛార్జీలను అడ్డగోలుగా పెంచేస్తున్నాయి. మార్చి 19న ఉగాది, 21న రంజాన్, 22న ఆదివారం కావడంతో మధ్యలో ఉన్న శుక్రవారం ఒక్క రోజు సెలవు పెడితే వరుసగా నాలుగు రోజులు పండుగను కుటుంబంతో గడపవచ్చని చాలామంది ప్రణాళికలు వేసుకున్నారు. అయితే.. ఆర్టీసీ బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు ఎప్పుడో నిండిపోవడంతో ప్రయాణికులకు ప్రైవేట్ ట్రావెల్స్ మాత్రమే ప్రత్యామ్నాయంగా మిగిలాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొన్ని సంస్థలు సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. సాధారణ రోజుల్లో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ బస్సు ఛార్జీ సుమారు రూ. 1,500 నుంచి రూ. 2,000 మధ్య ఉంటుంది. కానీ ఈ లాంగ్ వీకెండ్ దృష్ట్యా కొన్ని ట్రావెల్స్ ధరలను ఏకంగా 3 నుంచి 4 రెట్లు పెంచేశాయి. నాన్ ఏసీ స్లీపర్ సీట్లకు కొన్ని ప్రముఖ ట్రావెల్స్ సంస్థలు ఒక వ్యక్తికి ఏకంగా రూ. 4,999 నుంచి రూ. 5,700 వరకు వసూలు చేస్తున్నాయి. ఏసీ స్లీపర్‌కు కొత్తగా అందుబాటులోకి వచ్చిన సర్వీసుల్లో కూడా టికెట్ ధర రూ. 5,300 దాటిపో యింది. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే బస్సుల ఛార్జీలు కూడా గణనీయంగా పెరిగాయి. పండుగ రద్దీని బట్టి సాధారణ ధర కంటే రూ. 1,000 నుంచి రూ. 1,500 అదనంగా వసూలు చేస్తున్నారు. పెంచిన ధరలకు సంబంధించిన స్క్రీన్ షాట్లను ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. 'విమాన ప్రయాణం కంటే బస్సు టికెట్ ధరలే ఎక్కువగా ఉన్నాయని, ఇలాగైతే ఇంటికి వెళ్లడం కంటే నగరంలోనే ఉండిపో వడం మేలు' అని నెటిజన్లు వాపోతున్నారు. సాధారణంగా దసరా, సంక్రాంతి వంటి పెద్ద పండుగల సమయంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, అధిక ధరలు వసూలు చేసే ట్రావెల్స్‌పై చర్యలు తీసుకుం టామని హెచ్చరిస్తుంటారు. కానీ.. ఇలాంటి 'లాంగ్ వీకెండ్స్' సమయంలో ప్రైవేట్ దోపిడీని అరికట్టడంలో అధికారులు విఫలమవు తున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

## భీమదేవరపల్లిలో వ్యవసాయాధికారుల పర్యటన

హన్మకొండ, మార్చి18 (జనంసాక్షి) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వీర్లగడ్డ తండా గ్రామంలో బుధవారం వరి పొలాలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు గోన్యా నాయక్, పద్మజ, హనుమకొండ డివిజన్ ఏడీఏ ఆదిరెడ్డి, భీమదేవరపల్లి మండల వ్యవసాయ అధికారి పద్మ సందర్శించారు. వరి పొలాలలో కంకినల్లిని ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ సందర్భంగా పలు రసాయనాలు వర్షాలు తగ్గిన తరువాత పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. మరో పది రోజులలో వచ్చి వరి పొలాలని మరల పరిశీలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం వ్యవసాయాధికారులు అచ్యుత్ రెడ్డి, స్వామి రావు, ప్రశాంత్, వీర్లగడ్డ తండా గ్రామ సర్పంచ్ గుగ్లోతు పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.



# పాలకుర్తి పరిసరాల్లో 'ఎల్లమ్మ' సినిమా షూటింగ్

**ప్రొడక్షన్ మేనేజర్ మేడారపు సుధాకర్**

పాలకుర్తి మార్చి 18 (జనంసాక్షి) శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై బలగం వేణు దర్శకత్వంలో, దిల్ రాజు నిర్మాతగా నిర్మించబోతున్న 'ఎల్లమ్మ' సినిమాను పాలకుర్తి పరిసరాలలోని కొండాపురం, వల్మిడీ, కోలన్ పల్లి కొండ ప్రాంతాలలో చిత్రికరించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఎల్లమ్మ సినిమా ప్రొడక్షన్ మేనేజర్ డాక్టర్ మేడారపు సుధాకర్ తెలిపారు. పాలకుర్తి పరిసర ప్రాంతాలలో ఎల్లమ్మ షూటింగ్ లొకేషన్ ల కోసం దర్శకుడు బలగం వేణు, కబాలి, ఖుషి, సరిపోదా సినిమాల కెమెరామన్ జి. మురళి వర్ధన్, ఆర్ట్ డైరెక్టర్ రామాంజనేయులు మంగళవారం, బుధవారం రెండు రోజులు పరిశీలించారు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఎల్లమ్మ సినిమా షూటింగ్ చారిత్రక నేపథ్యం కలిగిన పాలకుర్తి లో చిత్రీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు , పాలకుర్తీలోని సహజ నటులకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో మేనేజర్స్ రవి, సత్య. డాక్టర్ తాళ్లపెల్లి నరేష్ లు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల అభివృద్ధికి 'స్ఫూర్తి'

- కలెక్టర్ డా. సత్య శారదా దేవి..



వరంగల్ ప్రతినిధి, మార్చి 18(జనంసాక్షి): విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల పెంపొందనకు, మానసిక దృఢత్వం అభివృద్ధికి 'స్ఫూర్తి' కార్యక్రమం ఎంతో ఉపయుక్తమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. బుధవారం ప్రజా పాలన పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ పట్టణంలోని ప్రభుత్వ సీకేఎం కళాశాలలో నిర్వహించిన 'స్ఫూర్తి' కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈఓ రామ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. ధర్మారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. వరప్రసాద్, డిబీసీడీఓ పుష్పలత, ఆర్డీవో సుమలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని అన్నారు. భయాన్ని జయిస్తే విజయాన్ని అందుకోవడం సులభ మవుతుందని, ఆత్మవిశ్వాసం పెంపొందించు కోవాలని సూచించారు. కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ విద్యార్థులతో పాటు సమీప ప్రభుత్వ పాఠశాల 6వ నుండి 8వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి, వారి భవిష్యత్ లక్ష్యాలపై చర్చించారు. విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి, పోటీ, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ప్రేరేపించారు. శారీరక అభివృద్ధితో పాటు మానసిక అభివృద్ధి కూడా సమానంగా అవసరమని పేర్కొంటూ, పర్సనాలిటీ డెవలప్మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, టైమ్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో భయాన్ని తొలగించి, వారిని సృజనాత్మకంగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ఫోటోకు అగౌరవం

**కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వర్మ**

కాకినాడ, మార్చి18 (జనంసాక్షి) : పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత శ్రీవత్సవాయి సత్యనారాయణ వర్మ తరచూ వార్తల్లో ఉంటారు.. కాకినాడ జిల్లా కలెక్టర్ ను కలిసి పిఠాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటోకు ప్రోటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు చేశారు.. సీఎం చంద్రబాబు నాయుడు ఫోటోను రెవెన్యూ స్టాంప్ సైజులో ఏర్పాటు చేసి అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని మండిపడ్డారు. అధికారులకు జ్ఞాపకశక్తి ఉండడం లేదని, సీఎం చంద్రబాబు ఫోటో ఏ సైజులో ఉండాలో వారికి ప్రోటోకాల్ తెలియడం లేదని కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు.. ఒక మెమో జారీ చేసి అధికారులకు ఆ విషయంపై క్లారిటీ ఇవ్వాలని కలెక్టర్ ను కోరారు.. సీఎం చంద్రబాబు ఫోటో లేకుండా కార్యక్రమాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని అన్నారు వర్మ.. గత వారంలో పిఠాపురంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేసి వేదిక మీద నుంచి కిందకు దిగిపోయారు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ.

# ఉగాది – ప్రకృతి, సంస్కృతి కాలచక్రం కలిసిన జీవనోత్సవం

భారతీయ సంస్కృతిలో పండుగలు కేవలం ఆనంద వేడుకలు మాత్రమే కావు. అవి ప్రకృతి మార్పులు, కాలచక్రం, మానవ జీవన విధానం మధ్య ఉన్న లోతైన సంబంధాన్ని తెలియజేసే సామాజిక వ్యవస్థలు. అలాంటి పండుగల్లో ఉగాది ఒక విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉంది. ఉగాది అంటే "యుగాది" అనే పదం నుండి ఉద్భవించింది. యుగానికి ఆది అనే భావన ఇందులో దాగి ఉంది. ప్రతి సంవత్సరం చైత్ర మాసం శుద్ధ పాడ్యమి నాడు జరుపుకునే ఈ పండుగ తెలుగు ప్రజల నూతన సంవత్సరారంభంగా పరిగణించబడుతుంది. ప్రకృతి తన పాత రూపాన్ని విడిచిపెట్టి కొత్త జీవనోత్సాహంతో ముందుకు వచ్చే కాలం ఇదే.

ప్రకృతి శాస్త్రపరంగా పరిశీలిస్తే ఉగాది పండుగ కాలం వసంత ఋతువు ప్రారంభంతో సరిసమానంగా ఉంటుంది. భూమి సూర్యుని చుట్టూ చేసే పరిభ్రమణంలో సుమారు 365 రోజులు గడుస్తాయి. ఈ పరిభ్రమణంలో ఋతువులు మారుతాయి. భారతదేశం వంటి ఉష్ణమండల ప్రాంతాల్లో వసంత ఋతువు ప్రకృతి పునరుజ్జీవనాన్ని సూచిస్తుంది. చెట్లు పాత ఆకులను వదిలి కొత్త చిగురులను మొలకెత్తించే సమయం ఇది. వృక్షశాస్త్ర పరిశోధనల ప్రకారం వసంత కాలంలో సుమారు 70% వరకు చెట్లు కొత్త ఆకులను విస్తరింపజేస్తాయి. ఈ సమయంలో మొక్కలలో ఆహార నిర్మాణం వేగంగా పెరుగుతుంది. అందువల్ల ప్రకృతి కొత్త జీవంతో కళకళలాడుతుంది.

ఉగాది పండుగను పరిశీలించినప్పుడు ప్రకృతి మార్పులను గమనించిన పురాతన భారతీయుల జ్ఞానం స్పష్టంగా కనిపిస్తుంది. శతాబ్దాల క్రితం నుంచే ప్రజలు వసంత ఋతువును నూతన ప్రారంభంగా పరిగణించారు. సుమారు క్రీస్తు శకం 500 ప్రాంతంలో రచించబడిన అనేక ఖగోళ గ్రంథాల్లో చైత్ర మాసం ప్రారంభాన్ని సంవత్సర ప్రారంభంగా పేర్కొన్నారు. ఈ విధంగా కాలగణనలో ప్రకృతి మార్పులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తుంది.

ఉగాది సందర్భంలో ప్రతి ఇంటిలో తయారయ్యే ఉగాది పచ్చడి ప్రత్యేకమైనది. ఈ పచ్చడిలో ఆరు రుచులు ఉంటాయి. తీపి, చేదు, పులుపు, ఉప్పు, కారపు రుచి, వగరు రుచి అనే ఆరు రుచులు మనిషి జీవితంలో ఎదురయ్యే అనుభవాలను సూచిస్తాయి. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం ఈ ఆరు రుచుల సమతుల్యం ఆరోగ్యపరంగా కూడా ప్రయోజనకరం. ఉదాహరణకు వేపపువ్వులో సహజ ఔషధ గుణాలు ఉంటాయి. వైద్య పరిశోధనల ప్రకారం వేపలో సుమారు 80% వరకు సూక్ష్మజీవులను నిరోధించే లక్షణాలు ఉన్నాయి. బెల్లం శరీరానికి శక్తిని అందిస్తుంది. చింతపండు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మామిడి చిగురు శరీరానికి విటమిన్లను అందిస్తుంది. ఈ విధంగా ఉగాది పచ్చడి ప్రకృతి వైద్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

ప్రకృతి దృశ్య పరంగా చూస్తే ఉగాది కాలంలో గ్రామాలు ప్రత్యేకంగా అందంగా కనిపిస్తాయి. పొలాల్లో కొత్త పంటలు మొలకెత్తుతాయి. చెట్లపై పసుపు రంగు మామిడి పూలు కనిపిస్తాయి. వేపచెట్లు తెల్లని పూలతో అలంకరించబడతాయి. ఈ సమయంలో గాలి స్వచ్ఛంగా ఉంటుంది. పక్షుల కిలకిలారావాలు వినిపిస్తాయి. ప్రకృతి సుమారు 60% వరకు కొత్త ఆకులతో నిండి కనిపిస్తుందని పర్యావరణ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ మార్పు మనిషి మనసుకు ఆనందాన్ని అందిస్తుంది.

సాంస్కృతిక దృక్కోణంలో ఉగాది అనేది కుటుంబాలను కలిపే పండుగ. తెల్లవారుజామున ప్రజలు స్నానం చేసి కొత్త బట్టలు ధరిస్తారు. ఇళ్ల ముందు రంగవల్లులు వేస్తారు. దేవాలయాలకు వెళ్లి ప్రార్థనలు చేస్తారు. పంచాంగ శ్రవణం అనే సంప్రదాయం కూడా ముఖ్యమైనది. పంచాంగంలో సంవత్సరానికి సంబంధించిన గ్రహస్థితులు, వర్షపాతం, పంటల పరిస్థితులు వంటి అంశాలను వివరిస్తారు. వ్యవసాయ ప్రధాన సమాజంలో ఇది ఎంతో ప్రాముఖ్యమైన సంప్రదాయం. గతంలో రైతులు ఈ సూచనలను ఆధారంగా తీసుకొని వ్యవసాయ కార్యక్రమాలను ప్రారంభించేవారు.


పర్యావరణ దృక్కోణంలో ఉగాది పండుగ మనిషికి ఒక సందేశాన్ని అందిస్తుంది. ప్రకృతి తన పాత ఆకులను వదిలి కొత్త జీవంతో ముందుకు సాగుతుంది. ఇదే భావన మనిషి జీవితానికి కూడా వర్తిస్తుంది. గతంలో జరిగిన అనుభవాలను గుర్తుచేసుకుంటూ కొత్త ఆశయాలతో ముందుకు సాగాలని ఈ పండుగ సూచిస్తుంది. ఆధునిక కాలంలో పర్యావరణ సంక్షోభం పెరుగుతున్న సందర్భంలో ఈ సందేశం మరింత ప్రాధాన్యం పొందుతోంది. ప్రపంచవ్యాప్తంగా అడవుల విస్తీర్ణం గత 100 సంవత్సరాల్లో సుమారు 30% తగ్గినట్లు పర్యావరణ నివేదికలు తెలియజేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం మరింత స్పష్టమవుతుంది.

ఇక సామాజిక పరంగా చూస్తే ఉగాది పండుగ కుటుంబ బంధాలను బలపరచే సందర్భంగా ఉంటుంది. ప్రజలు ఒకచోట చేరి పండుగను ఆనందంగా జరుపుకోవడం ద్వారా సామాజిక ఐక్యత పెరుగుతుంది. పంచాంగ శ్రవణం ద్వారా కాలగణన, వర్షపాతం, వ్యవసాయ పరిస్థితులపై అవగాహన పెరుగుతుంది. ఈ విధంగా ఉగాది పండుగ ప్రకృతి, శాస్త్రం, సంస్కృతి అనే మూడు రంగాల సమ్మిళిత రూపంగా నిలుస్తుంది. అందుకే ఉగాది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు; అది ప్రకృతితో మనిషి జీవనం కలిసిన శాశ్వతమైన జీవనోత్సవం అని చెప్పవచ్చు.



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# సాహిత్య పురస్కారాలు – ఎంపికలో చిక్కులు



బిఎస్ రాములు
సామాజిక తత్వవేత్త
తెలంగాణ రాష్ట్ర తొలి
బీసీ కమిషన్ చైర్మన్
ఫోన్ : 8331966987

సాహిత్య పురస్కారాలు వారిలోని సృజనాత్మకతకు గుర్తింపు గౌరవం. వారు మరింత ఎదగడానికి ఉత్సాహం ప్రోత్సాహం జవసత్వాలు అందిస్తాయి. ఇతరులు ఎదగడం ఇష్టం లేక, తాము ప్రోత్సహించలేక కొందరు పురస్కారాల మీద నోరు పారేసుకుంటారు. ఇటీవల ఒక సీనియర్ సాహితీవేత్త దశాబ్దాల తరబడి అనేక పురస్కారాలు చిన్నవి పెద్దవి పుచ్చుకొని వుండి ఇవేం పురస్కారాలు శాలువా చెక్క మెమొంటో ఇచ్చి జాతీయ పురస్కారం అంటున్నారని యువతరం అందుకునే పురస్కారాలను విమర్శించాడు. మాకు చిన్నపుడు పెన్సిల్ బహుమతి ఇస్తే అదే గొప్ప సంతోషం. ఆ ప్రోత్సాహమే అంచెలంచెలుగా ఎదగడానికి ఆధారమైంది.

**కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార విశిష్టత**

అయితే బాగా గుర్తింపు గల, జీవిత కాల కృషికి అది ఓ సర్టిఫికేట్ అనుకోవడం వల్ల అనేక విమర్శలు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు ప్రతిభకు కొలమానాలు అసలే కావు. అవి పైరవీలకు కొలమానాలు. పలుకుబడికి కొలమానాలు. సెలక్టు చేయువారికి పుచ్చుకును వారికున్న అనుబంధ బాంధవ్యాలకు ,విస్తృత పరిచయాలకు కొలమానాలు అని అంటారు వారు! అయితే నిరంతర సాహిత్య సేవకు కొలమానంగా కూడా నిలుస్తాయని మరిచి పోకూడదు. నందిని సిధారెడ్డి గారికి నిరంతర సాహిత్య సేవకు, సామాజిక చైతన్యానికి వచ్చిన పురస్కారం ఇది. నందిని సిధా రెడ్డి గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు. అభినందనలు.

**విశాల ప్రాతిపదికపై సాహిత్య అకాడమీ కృషి**

ఈ పురస్కారం సందర్భంగా పదిమంది రచయితల రచనల షార్ట్ లిస్టు కూడా ప్రకటించారు. న్యాయ నిర్ణేతల పేర్లు ప్రకటించారు. ఈ పద్ధతి ఎంతో మేలు చేస్తుంది. ఇలా 24 భాషల పురస్కారాలు, షార్ట్ లిస్టులు ప్రకటించడం ద్వారా ఏ భాషలో ఏ ఏ రచనలు వస్తున్నాయో కొంతైనా మనం తెలుసుకోగలుగుతున్నాము. ఏ ప్రమాణాలతో ఎన్నిక చేసారో న్యాయ నిర్ణేతలు అభిప్రాయాలు కూడా తెలిపితే దేశంలో ఆయా భాషల సాహిత్యం పట్ల ఒక అవగాహన ఏర్పడుతుంది.

**షార్ట్ లిస్టయిన రచనలపై చర్చలు అనేక కోణాలు**

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాల సందర్భంగా ప్రకటించిన తెలుగు రచనల షార్టు లిస్టు గురించి ఫేస్ బుక్ లో చర్చలు మొదలయ్యాయి. అది సహజమే. తద్వారా అనేక కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. షార్టు లిస్టులో నైనా రాయలసీమ రచనలు లేవు అని శాంతి నారాయణ గారు అన్నారు. ఎపుడూ రాయలసీమ వారికేనా? అరసం వారికేనా అని గొణిగే వారు కూడా ఉన్నారు. ఒక్క స్త్రీల పుస్తకమైనా షార్ట్ లిస్టులో లేదు అని ఎండ్లూరి మానస గారు అన్నారు. ఒక్క దళితుల పుస్తకమైనా లేదు అని నిరంజన్ గారన్నారు. కథలకు నవలలకు ఎపుడూ చిన్న చూపేనా అన్నారు అట్టాడ అప్పల నాయుడు గారు. అప్పల నాయుడు గారితో ఫోన్లో మాట్లాడినప్పుడు తన బహుళ నవల మూడేళ్లు వరుసగా షార్ట్ లిస్టులో వస్తున్నదని, ఆ ప్రకారం చూస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

**పురస్కారాల ఎంపిక న్యాయ నిర్ణేతల దృష్టి**

ఇలా పురస్కారాల ఎంపికను ఎన్ని కోణాల్లో ఆలోచించాలో ఈ విషయాలు తెలుపుతాయి. 1998లో కరీంనగర్ జిల్లా కథలు మొదటి సంపుటికి కథల ఎంపిక సమయంలోనే మాకివన్నీ అనుభవంలోకి వచ్చాయి. దళిత రచయిత లేకపోతే దళిత జీవిత కథ ఎంపిక చేసి పూరించాము. శాంతి నారాయణ గారు తన ఫేస్ బుక్ చర్చలో ఇలా అన్నారు. "మేము నిష్పాక్షికంగానే విమలాశాంతి పురస్కారాలు ఇచ్చాము. అలా కాదు అని నిరూపిస్తే పురస్కారాలు రద్దు చేస్తామన్నారు. " రద్దు చేయడం వద్దు గానీ!! ఎవరిని న్యాయ నిర్ణేతలుగా పెడుతున్నారో అదే వారి అభిరుచిని, ఇష్టాన్ని తెలుపుతుంది. తదనుగుణంగానే ఎన్నిక జరుగుతుంది. ఉదాహరణకు వీరు ఎపుడూ నన్ను న్యాయ నిర్ణేతగా ఉండాలి అని అడిగింది లేదు. తద్వారా నాకు నచ్చిన సాహిత్యానికి , నాకు నచ్చిన వారికి ఇచ్చే ఉద్దేశం లేదని అర్థం. అలాగే కొలకలూరి ఇనాక్ , అంపశయ్య నవీన్ గారలు పురస్కారాల గురించి కూడా ఏ నాడు నన్ను న్యాయ నిర్ణేతగా ఉండాలని అడిగింది లేదు. ఈ ముగ్గురూ విశాల సాహితి పురస్కారాలు నా చేతుల మీదుగా అందుకున్న గౌరవనీయులు.




**విశాల సాహితి పురస్కారాల విశిష్టత**

నేనైతే ఎవరి మీద ఆధార పడకుండా నాకు నచ్చిన వారికే , నేను మెచ్చిన వారికే విశాల సాహితి పురస్కారాలిచ్చాను. . 1998 లో ప్రారంభించి వందలాది మందికి ఇచ్చాను. ఒకరికో ఇద్దరికో అనే పరిమితి కూడా పెట్టు కోలేదు. అలాంటి పరిమితి అదే కాలంలో రాసిన ఇతర రచనలను రచయితలను కించ పరిచినట్టవుతుందని ఆ పరిమితి పెట్టుకోలేదు. పురస్కార గ్రహీతలు ఎంతో ఎదిగారు. నా నిర్ణయాలు ఎన్నడూ తప్పు కాలేదు. పురస్కార గ్రహీతలు జాతీయ స్థాయికి ఎదిగారు . జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్నారు.

**న్యాయ నిర్ణేతలు నిష్పక్ష పాతంగా ఉండడం సాధ్యమా?!**

పురస్కారాల న్యాయ నిర్ణేతలు ఎలా తమకు నచ్చిన వారిని ప్రమోట్ చేయడానికి ఈ అవకాశం ఉపయోగించుకుంటారో తెలుసు. కనక నా నిర్ణయమే సరైనదని భావించి 1998 నుంచి సలహాలు తీసుకున్నా తుది నిర్ణయం నేనే ఫైనల్ చేసి ఇస్తున్నాను. శాంతి నారాయణ గారు , ఇనాక్ గారు , అంపశయ్య నవీన్ గారు ఇలా తమకు నచ్చిన వారికిస్తే ఇంకా ప్రతిష్టాత్మకంగా వుండేది. వారే నిర్ణయించడం అనేది గొప్ప గౌరవం కదా! ఆవంత్స సోమసుందరా గారు స్వయంగా ఎంపిక చేసి ఇచ్చి గౌరవించారు. ఎలాంటి న్యాయ నిర్ణేతలు ఎలాంటివారిని సూచిస్తారో తెలుసు కనక న్యాయ నిర్ణేతలను నిర్ణయించడం లోనే వారి ఇష్టాయిష్టాలు దాగి వున్నాయి. కేంద్ర సాహిత్య అకాడమీ న్యాయ నిర్ణేతలను నిర్ణయించడంలో కూడా ఇదే వుంటుంది. 25 ఏళ్ల కింద రెండు సార్లు న్యాయ నిర్ణేత గా కేంద్ర సాహిత్య అకాడమీ ఆహ్వానించింది. ఆ రచనల షార్ట్ లిస్టు చూసాక ఎవరికివ్వాలని కోరి నాకు పంపించారో అర్థమైంది.

**సమాజ పరిమితే తప్ప అది ప్రతిభకు పరిమితి కాదు**

నిష్పక్షపాతంగా ఇవ్వడాన్ని మిగతా రచనలు అంత స్థాయిలో లేవని అర్థం తీయకూడదు. దాశరథి రంగాచార్య గారికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రాలేదు. అయితే వారు గొప్ప రచనలు చేయ లేదని అనగలమా? 1000 వ ర్యాంక్ వరకు ఐఏఎస్ కు తీసుకుంటే 1001 ర్యాంకుకు అర్హత లేదు అని అనగలమా? 1500 ర్యాంకు వరకు తీసుకుంటే అర్హుడే కదా! అలాగే ఒకే ఒక పురస్కారం అనేది ఒక పరిమితి! నిజానికి తెలుగు విశ్వవిద్యాలయం ఇస్తున్నట్లుగా అన్ని రకాల ప్రక్రియల్లో అన్ని భాషల్లో ఏటా ఇస్తే ఈ ఇరుకిరుకు పోటీ వుండదు. కేంద్రం తలుచుకుంటే బడ్జెట్/ యంత్రాంగం ఒక లెక్కా? అధి సాధించడానికి అందరు కృషి చేయాలి . అంతేకానీ ఇలా పరస్పర కలహాలు విమర్శలు కాదు.

**బహుళ నవల జ్ఞానపీఠ్ పురస్కారానికి అర్హమైనది**

ఈసారి నవలల విషయానికి వస్తే అప్పల నాయుడు గారి బహుళ నవల జ్ఞానపీఠ్ పురస్కారానికి, సరస్వతీ సమ్మాన్ పురస్కారానికి అర్హమైనది. సాహిత్య విమర్శ విషయంలో ఇందులో షార్ట్ లిస్టు లో పేర్కొన్న ఆడెపు లక్ష్మీ పతి గారి దిక్ చక్రం అన్ని విధాలుగా అర్హమైనది. అలా ప్రయివేటు సంస్థల అనేక పురస్కారాలు కూడా పొందిన పుస్తకం అది. షార్ట్ లిస్టులో వున్న వాటిలో ఇవి రెండు చదవడం జరిగింది. మిగతా రచనలు నా దృష్టికి రాలేదు. కనక చదవ లేక పోయాను. అలా ఎన్నో రచనలు మన దృష్టి నుండి తప్పి పోతుంటాయి. నేను 2023 లో వెలువరించి కొత్త కోరికలు కథల సంపుటి కూడా చాలా మందికి దృష్టి కి వచ్చి వుండదు. వారి దృష్టిలో పడి వుంటే ఇది కూడా షార్ట్ లిస్టులో చేరే కథల సంపుటి. ఇలాగే ప్రతి ఒకరు అనుకునే/ఆశించే అవకాశం వుంటుంది. కనక ఎక్కువ సామాజిక న్యాయం, ఎక్కువ సాహిత్య న్యాయం, సాహిత్య ప్రయోజనం చేకూర్చే రచనల ఎన్నికకు ఆస్కార్ అవార్డు లాగా, నోబెల్ బహుమతి, బుకర్ పురస్కారం లాగా విస్తృత, ఓటింగ్ జరగాలి. పరిశీలకులు , పాఠకులు , సాహితీవేత్తలు పాల్గొన్నాలి. ఓటింగ్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనలేక పోతే సరైన చర్చ జరగదు.

**షార్ట్ లిస్టు రచనలకు కూడా విస్తృత ప్రచారం గౌరవం కలిగించాలి**

షార్ట్ లిస్టు రచనలకు కూడా విస్తృత ప్రచారం కల్పించాలి. గౌరవించి కాస్త సన్మానమైనా చేయాలి. ఇతర దేశాల పురస్కారాల్లో ఇలా షార్ట్ 'య్టయిన రచనలను కూడా ప్రచారం చేయడం వల్ల పురస్కార రచనలతో సమానంగా అవి కూడా అమ్ముడుపోయాయి. అలా సాహిత్య విస్తృతి పెరుగుతుంది. ఈ షార్ట్ లిస్టులో గల రచనలపై న్యాయ నిర్ణేతల అవగాహన అభిప్రాయాలు బయట పెట్టాలి. అపుడు చర్చ జరుగుతుంది. వాటికి న్యాయ నిర్ణేతలు బాధ్యత వహిస్తారు. కనక పారదర్శకత పెరుగుతుంది. మరింత జాగ్రత్తగా ఎంపిక చేసే అవకాశం ఉంటుంది.

## అవనికే కొత్త శోభనిచ్చే ఉగాదికి స్వాగతం

వసంతుడి రాక వనాలకు–
ఉగాది రాక జనాలకు పండుగ.
వనాలకు,జనాలకు మాత్రమే కాదు,అవనికే
కొత్త శోభను అద్దే వేళ ఇది.మనిషికి
యవ్వనం ఎలాగో,కాలానికి వసంతం
అలానే!
మానవ హృదయాల్లో కొత్త ఆశలు
మొలిపిస్తూ,మానుల లేత చిగుళ్లలో పచ్చని
పలుకులు పలికిస్తూ,ఆమని అడుగులతో
ప్రకృతి ఆశాదీప సందేశాన్ని
వెలిగిస్తోంది..పచ్చదనం కోసం తరువులు
తపనపడినట్లు,
మనుషులు కూడా వసంతంలో
,ఉగాదుల, ఉషస్సుల కొత్త వెలుగులు
విరబూయాలని
మనసారా కోరుకోవాలి.
షడ్రుచుల సమ్మేళనంలోనే
సంవత్సరాది సారం దాగి ఉంది.
పంచాంగం ఎవరినీ భయపెట్టదు;
మనిషికి బాధ్యత గుర్తుచేసే
ముందస్తు సూచన మాత్రమే
చేస్తుంది.ప్రకృతికి,మనిషికి ఇష్టమైన
పండుగ–ఉగాది.
తరువులు కొత్త చిగుళ్ల
తొడుగుతాయి,కోకిలలు కొత్త రాగాలు
ఆలపిస్తాయి,
టపటపమని కొత్త చినుకులు రాలుతాయి.
అయితే మానవ తప్పిదాలతో ప్రకృతికి
ఎంత ప్రమాదమో, మనిషికీ అంతే
హానికరం సుమా! ప్రకృతిని నాశనం చేస్తే
ఉగాది ఉత్సవాల అర్థమే పారిపోతుంది;
జీవకోటికి దిగులు మిగులుతోంది. మానవ
సమాజాన్ని సవాలు చేస్తున్న వికృత శక్తుల
పరాభవం కోసం,ధర్మం–మానవత
విలువలు మరలా పునర్జన్మ పొందాలని ఈ
"పరాభవ నామ సంవత్సర ఉగాది" కొత్త
శక్తిని,కొత్త చైతన్యాన్నిమనలో నింపాలని
ఆశిస్తూ–ఉగాదికి శుభ స్వాగతం!

మేకిరి దామోదర్
కవి–రచయిత,
జిల్లా : వరంగల్,
ఫోన్ : 9573666650

# ప్రపంచవ్యాప్తంగా నిరసనల వెల్లువ – ఒంటరైన డోనాల్డ్ ట్రంప్

ప్రస్తుతం అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల ప్రభావం అమెరికా సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుంది. ముఖ్యంగా ఇజ్రాయిల్తో కలిసి ఇరాన్ పై చేపట్టిన యుద్ధ చర్యలు, వాణిజ్య నిర్ణయాలు అమెరికాలోనే కాకుండా ఐరోపా, ఆసియా దేశాల్లో తీవ్ర ఆందోళన కలిగించాయి. ఈ విధానాల వల్ల ప్రజలు, మీడియా, ప్రభుత్వాలు ట్రంప్ పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. ఇక ఇస్లామిక్ దేశాలు ఏకమయ్యే పరిస్థితి కూడా కనిపిస్తుంది.

**అమెరికాలో పెరుగుతున్న వ్యతిరేకత**

ట్రంప్ యుద్ధ విధానాలు, ముఖ్యంగా ఇరాన్ లో పౌరులపై జరిపిన దాడులు అమెరికా ప్రజలను, మీడియాను, మేధావులను, తన క్యాబినెట్ సహచర మంత్రులు, స్వపక్షం, విపక్షాలను సైతం తీవ్రంగా కలచివేశాయి. ఫిబ్రవరి 28, 2026న ఇరాన్లోని మినాబ్ అనే ప్రాంతంలో ఒక బాలికల పాఠశాలపై జరిగిన క్షిపణి దాడిలో కనీసం 165 మంది చిన్నారులు మరణించారు . ఈ దాడి అమెరికా–ఇజ్రాయిల్ సంయుక్త దాడుల్లో భాగమని, అమెరికా తయారు చేసిన తోమాహాక్ క్షిపణి శిథిలాలు ఈ ఆరోపణలకు బలం చేకూర్చాయి . కానీ ట్రంప్ మాత్రం ఇరానే స్వంతంగా తన పాఠశాలపై బాంబు వేసుకుందని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనను అమెరికా మీడియా ప్రారంభంలో విస్మరించినా, తరువాత తీవ్రంగా ప్రశ్నించింది. న్యూయార్క్ టైమ్స్ విలేఖరి ట్రంప్ ను ఈ అంశంపై నిలదీయగా, తనకు సరైన సమాచారం లేదని ట్రంప్ ఒప్పుకోవలసి వచ్చింది.

ప్రజల్లో నిరసన కూడా పెరిగింది. ప్యూ రీసెర్చ్ సెంటర్ సర్వే ప్రకారం, ట్రంప్ ఆమోదం రేటు 37 శాతానికి పడిపోయింది . స్వతంత్ర ఓటర్లలో ట్రంప్ ఆమోదం 25 శాతానికి పడిపోగా, 66 శాతం మంది వ్యతిరేకిస్తున్నారు.కేవలం 27 శాతం అమెరికన్లు మాత్రమే ట్రంప్ విధానాలను పూర్తిగా లేదా ఎక్కువగా సమర్థిస్తున్నారు. ట్రంప్ నైతికతపై నమ్మకం కూడా గణనీయంగా పడిపోయింది .



**ఐరోపా నుండి తిరస్కారం :** ఐరోపా దేశాలు కూడా ట్రంప్ యుద్ధోన్మాదాన్ని తిరస్కరించాయి. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలు పునరుద్ధరించడానికి యుద్ధనౌకలు పంపాలన్న ట్రంప్ డిమాండ్ను ఐరోపా దేశాలు తోసిపుచ్చాయి. జర్మనీ రక్షణ మంత్రి "ఇది మా యుద్ధం కాదు, మేము దీన్ని ప్రారంభించలేదు" అని స్పష్టం చేయగా, ఫ్రాన్స్, ఇటలీ, పోలాండ్ కూడా సైనిక సహాయం నిరాకరించాయి . స్పెయిన్ ఈ దాడులను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా అభివర్ణించింది .

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం :**

ట్రంప్ యుద్ధ చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీశాయి. హోర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటాయి. ఇండియాలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి రోజువారీ జీవితం ఇబ్బందుల్లో పడింది. ఎల్పీజీ సిలిండర్ల కొరత ఏర్పడటంతో వంట గ్యాస్ సమస్య తీవ్రమైంది. గుజరాత్లో 98 శాతం ఇంజనీరింగ్ సంస్థలు మూతపడగా, భారత వృద్ధి రేటు అంచనాలు గోల్డ్మన్ సాక్స్ తగ్గించింది. భద్రతా ఆందోళనలతో విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు వెనక్కి వెళ్ళిపోయాయి . బంగారం, వెండి ధరలు అనేక రెట్లు పెరిగి 2026 జనవరిలో బంగారం 5,000 డాలర్లు, వెండి 100 డాలర్లు దాటాయి.

**ఇస్లామిక్ దేశాల ఏకత్వ సంకేతాలు:**

ఈ పరిణామాలు ఇస్లామిక్ దేశాల్లో కొత్త చర్చలకు దారితీస్తున్నాయి. ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి ముస్లిం దేశాలను ఇరాన్ కు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ వంటి దేశాలు ఇరాన్ దాడులను ఖండించినా , ప్రాంతీయ ఐక్యత అవసరం గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇజ్రాయిల్ లెబనాన్ లో దాడులు విస్తరించడంతో లక్ష మందికి పైగా ప్రజలు నిర్వాసితులయ్యారు .

చివరిగా.. ట్రంప్ యుద్ధోన్మాద విధానాలు ప్రపంచాన్ని అనేక సంక్షోభాల్లోకి నెట్టాయి. పాఠశాలపై బాంబు దాడి వంటి అమానవీయ చర్యలు, తరువాత వాటిని కప్పిపుచ్చే ప్రయత్నం అమెరికా లో, ట్రంప్ పట్ల వ్యతిరేకతను పెంచాయి.ఐరోపా దేశాలు (నాటో సభ్యత్వం గల దేశాలు) కూడా డోనాల్డ్ ట్రంప్ యుద్ధం ఏకపక్ష నిర్ణయం అని భావిస్తున్నాయి. వారి సహకారం అందించి ఇరాన్ పై పోరాటానికి నిరాకరిస్తున్నాయి. డోనాల్డ్ ట్రంప్ కు వారిపై కోపంతో కామెంట్స్ చేస్తున్నారు అయినా ఐరోపా దేశాలు లెక్క చేయటం లేదు. అలాగే అమెరికా సైన్యం లో కొందరు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలను ఫాలో కావడం లేదు. రష్యా డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలను, ఆయిల్ సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యతిరేకిస్తున్నారు. ట్రంప్ యుద్ధ విరమణ చేసి శాంతియుతంగా చర్చలు జరపాలని సూచించారు. డోనాల్డ్ ట్రంప్ ఎడతెగని బాంబింగ్ వల్ల ఇప్పుడు ఇస్లామిక్ దేశాలు ఏకమయ్యే పరిస్థితి ఏర్పడితే, అది మరింత క్లిష్ట పరిస్థితికి దారితీస్తుంది. ప్రపంచ దేశాలు శాంతియుత పరిష్కారాల కోసం ప్రయత్నించడమే సరైన మార్గం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

## మేలుకోనంత కాలం

దేశమంతటా కులం కంపు, మతం రొచ్చు
మూఢనమ్మకాల మురికికాలువలో
విచ్చలవిడిగా దొర్లుతోంది దేశం
మానవతా వస్త్రాలను విప్పేసుకొని
అమానవీయతను అంటించుకొని
ఊరేగుతోంది దేశం

ఓ వైపు
విషంలా వ్యాపిస్తున్నది కులమతాల పిచ్చి
పేట్రేగిపోతున్నది ఉన్మాదం
మరోవైపు
మనమేమో ఉగాది ఉత్సవాలంటున్నాం
ప్రభుత్వాలేమో ఊదరగొట్టు
ఉపన్యాసాలిస్తున్నాయి

మామిడి పిందెల్ని కాదు
పొత్తికడుపులోనే కరిగిపోతున్న పిండాల్ని
చూడండి
కోకిల కూతల్ని కాదు
నలిగిపోతున్న మగువల ఆర్తనాదాల్ని
వినండి
చెరుకుగడల్ని కాదు
చేదెక్కుతున్న బాల్యజీవితచిగుర్లని
పరికించండి
వేపపువ్వుల్ని కాదు
లేత నవ్వులు చిదిమేయబడుతున్న
దృశ్యాన్ని గమనించండి
భక్ష్యాల్ని భుజించడం కాదు
మన బతుకుల్ని భక్షిస్తున్న బకాసురులెవరో
గ్రహించండి

మేలుకోనంత కాలం
పెను నిద్దుర వదులుకోనంత కాలం
చైతన్యవంతమవనంత కాలం
అసలైన ఉగాదులుండవు
ఆ నవయుగమెంతో దూరమే!
చేరుకోలేని గమ్యస్థానమే!

కార్తీక రాజు
హనుమకొండ
8977336447

## ఎలా స్వాగతం పలకను

అగ్రరాజ్యం ఇగో తీర్చు కోవటానికి
పరాయి దేశాల మీద కన్నెర్ర చేస్తూ
సామాన్యుల కన్నీటి సంద్రంలో మునిగి
తేలుతూ..

ప్రజా పాలన అందిస్తామంటూ ...
హామీల తుఫాన్ లో తడిపేసి....
కొండెక్కిన ధరలతో
ప్రజలంతా హాలో లక్ష్మణా అని
విలపిస్తుంటే...
చోద్యం చూస్తున్న పాలకులు

నిత్యం కల్తీ వస్తువులతో కాపురం చేస్తూ
అమాయకుల ప్రాణాలు తోడేస్తూ
వికటాట్టహాసం చేస్తున్నా...
ఏమీ తెలియని నంగనాచి అధికారగణం...

నిక్కార్సమైన నాణ్యమైన మద్యం అంటూ
ఇల్లు ఒళ్లు గుల్ల చేస్తున్న బెల్టు షాపుల
రూపంలో కబళించేస్తుంటే...

ప్రశ్నిస్తా అంటూ గొంతు ఎత్తినోడు
పలాయనం చిత్తగిస్తుంటే
పాపం పుణ్యం తెలియని
పసిమొగ్గలను
నిర్దాక్షిణ్యంగా మధమెక్కిన మృగాల
కాళ్ల కింద
నలిగి ప్రాణాలు విడుస్తుంటే...

ఏమీ తెలియని నంగనాచిలా
రాక్షస క్రీడ ఆడుతున్న
రాజకీయ దురందురులు...

వనాలను వధించి కాంక్రీట్ జంగిల్లో
పశుపక్షాధులకు నీడా గూడు లేకుండా
చేస్తుంటే...

కొత్త ఉగాదికి ఎలా...
స్వాగతం పలకను

డా.గాదిరాజు రంగరాజు

# తెలంగాణ విద్య కమిషన్ 2026 నివేదికను సవరించాలి

- యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటి




**ముషీరాబాద్, మార్చి 18 (జనం సాక్షి) :** తెలంగాణలో విద్యా విధానాన్ని సమూలంగా మార్చాలన్న సంకల్పంతో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆకునురి మురళి చైర్మెన్ గా ఇతర సభ్యులతో ఏర్పాటు చేసిన కమీషన్ ఇచ్చిన నివేదికను సవరించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం బాగ్లింగంపల్లిలోని ఓంకార్ భవన్ లో యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ తాటికొండ రవి అధ్యక్షతన చర్చగోష్టి నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, అతిథులుగా డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య, ఆర్థిక విశ్లేషకులు, ప్రముఖ జర్నలిస్టు పాపారావు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆమంచ నాగేశ్వర్ లు హాజరై మాట్లాడారు. ముఖ్యంగా ప్రాథమిక విద్యకు ప్రతి 1,3,5 కి.మీటర్ల పరిది లో విద్యార్థుల సంఖ్యను ప్రాతిపదికన పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. మండల పరిధిలో ఏర్పాటు చేయబోవు పాఠశాలల సంఖ్య పరిమితిని తొలిగించాలనీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో మద్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఆద్వర్యంలో నిర్వహించాలనీ, మద్యాహ్న భోజన నిర్వహణ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ సూచించారు. అక్షయ పాత్ర మధ్యవర్తిత్వాన్ని తొలిగించాలనీ, మద్యాహ్న భోజన పథకం నిర్వాహనకై ప్రతి పాఠశాలకు ఒక నాన్- టీచింగ్ పోస్టును ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా విద్య బోర్డు చైర్మన్గా కలెక్టర్ కి బదులుగా ఐఎఎస్ స్థాయికి తగ్గని మరో అధికారిని నియమించాలనీ, విద్యా బోధనలో తెలుగు భాష మాధ్యమము విధిగా ఒక సబ్జెక్ట్ గా ఉండాలనీ విజ్ఞప్తి చేశారు. కమిషన్ నివేదికలో వికలాంగులకు అందించే విద్యపై ఎలాంటి స్పష్టతను నివ్వలేదనీ అన్నారు. ప్రభుత్వ బోధనలో సాంకేతిక వైజ్ఞానిక ప్రయోజిత కార్యక్రమాలను ప్రసారంలో భాగం చేయాలనీ, ఆర్టికల్ 51 సైంటిఫిక్ టెంపర్ మెంట్ పై కమీషన్ నివేదికలో ఎక్కడ ప్రస్తావన లేదనీ తెలిపారు. ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ బోర్డుల విలీనాన్ని విరమించాలని, 10ం2ం3 విధ్యా విధానం యధాతదంగా కొనసాగించాలనీ కోరారు. పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన వారికి తదుపరి డిగ్రి కోర్సులో ల్యాటరల్ పద్ధతిలో ఎంట్రెన్స్ కల్పించాలనీ, విద్యరంగం లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులలో కాంట్రాక్టు నియమాకాలు రద్దు పరచి శాశ్వత ప్రాతిపాదికగా నియమకాలు జరపాలనీ కమిషన్ నివేదికను సవరించాలన్నారు. ఫీజుల నియంత్రణ చేపట్టాలనీ, ఈఏపీసిఇటి ని యధాతథంగా కొనసాగించాలనీ, డిగ్రీ విద్య 4 సం.ల కాల పరిమితి అనే సవరణను ఉపసంహారించాలన్నారు. అలహాబాద్ హైకోర్టు తీర్పు అనుగుణంగా, ప్రభుత్వం నుండి ఆర్థికంగా లబ్దిపొందిన ప్రభుత్వ అధికారుల పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని చేసిన తీర్పును అమలు పర్చాలని కమీషన్‌లో ప్రస్థావించక పోవడం గమనర్హమన్నారు. ప్రైవేటు రంగంలో పాఠశాలలు, కాలేజీలు అర్జించిన లాభాలలో యాజమాన్యాలు కేవలం 50%. మాత్రమే తీసుకోవాలనీ, మిగతా లాభాన్ని పాఠశాలల, కాలేజీల ఎదుగుదలకు తోడ్పడుతున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ యొక్క జీతభత్యాలకు, విద్యార్థుల మౌలిక వసతులకు ఏర్పాటు చేయటానికి ఖర్చు చేయుటకు కమీషన్ తన నివేదికలో ప్రస్తావించకపోవడం పైనా ఆలోచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రేణుక, మధు, నాయకులు వెంకట్ ,తిరుపతి, వాణి, గణేష్, రవి, శేఖర్, సాగర్, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మహేష్, నాగరాజు , జార్జి రెడ్డి పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వర్ రావు, పిడిఎస్యు మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రాకేష్, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తిక్, ఏఐఎఫ్డివై రాష్ట్ర కార్యదర్శి వనం సుధాకర్, ఇతర ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళా సర్పంచ్‌పై దాడికి పాల్పడ్డ నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి



సికింద్రాబాద్, మార్చి 18 (జనంసాక్షి) : గిరిజన మహిళా సర్పంచ్ కుటుంబంపై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ కరాటే రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ గిరిజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కరాటే రాజు,లైవ్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజేష్ చౌహాన్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్ హాజరై మాట్లాడారు. నాగర్ కర్నూల్ జిల్లా అంకిరోనిపల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళా సర్పంచ్ కొర్రా కమల పై, ఆమె కుటుంబంపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో ఇలాంటి దాడులు జరుగుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయ్యాయన్నారు.గిరిజనుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్ర డీజీపీ వెంటనే జోక్యం చేసుకొని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు తక్షణమే న్యాయం జరగాలని, లేనిపక్షంలో గిరిజన సమాజం మొత్తం ఏకమై పోరాడుతుందని హెచ్చరించారు. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి కుటుంబానికి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక మహిళా సర్పంచ్ పై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని కాపాడే పద్ధతి కాదని, అధికార మదంతో గిరిజన మహిళా నేతలను అణచివేయడం సరికాదని సూచించారు. ఈ సమావేశంలో విజేందర్ నాయక్, రాకేశ్ నాయక్, కిరణ్, సందీప్, కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ యాక్షన్ ప్లాన్ అమలుపై ప్రత్యేక దృష్టి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 18 (జనంసాక్షి) :** జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 అమలుకు సంబంధించి ప్రత్యేక బ్యాంకర్ల సమావేశం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పథకం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు బ్యాంకర్లు చురుకుగా సహకరించాలని సూచించారు. ఈ పథకం కింద రూ.1 లక్ష విలువ గల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన యూనిట్లు 90 శాతం సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జొమాటో, స్విగ్గీ, ర్యాపిడో వంటి ఆన్‌లైన్ వేదికల ద్వారా గిగ్ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. అదేవిధంగా రూ.3 లక్షల విలువ గల గూడ్స్ లేదా ప్రయాణికుల త్రిచక్ర వాహన యూనిట్లు 70 శాతం సబ్సిడీతో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ వాహనాల ద్వారా లబ్ధిదారులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశముందని పేర్కొన్నారు. అలాగే రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లను 60 శాతం సబ్సిడీతో అందించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఎస్సీ రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు ఈ పథకం కింద 215 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, 106 త్రిచక్ర వాహన యూనిట్లు, 22 సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. వీటిని త్వరితగతిన గ్రౌండింగ్ చేయడంలో బ్యాంకర్లు చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. అర్హులైన ఎస్సీ అభ్యర్థులు మార్చి 24, 2026 లోపు దరఖాస్తులు సమర్పించాలని, బ్యాంకులు వాటిని వేగంగా పరిశీలించి రుణాల మంజూరు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె. బాబు మొజెస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సి. శివ ప్రసాద్‌తో పాటు ఎస్‌బిఐ, యూబిఐ, కెనరా బ్యాంక్, పీఎన్‌బీ, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ తదితర బ్యాంకులకు చెందిన జిల్లా నియంత్రణాధికారులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

# అధికారుల వేధింపులు సరికావు

- మెమోల పేరుతో భయబ్రాంతులు పెడితే పోరాటం చేస్తాం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం



**నర్సాపూర్, మార్చి 18 (జనం సాక్షి) :** తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలనీ చలో హైదరాబాద్ వెళ్లిన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ లను నర్సాపూర్ ప్రాజెక్టు అధికారులు భయబ్రాంతులకు గురిచేస్తూ మెమోలా పేరుతో మనస్సికంగా వీధించడం సరైనదికదాని సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం అన్నారు. బుధవారం నర్సాపూర్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ధర్నాలో భాగంగా ఛలో హైదరాబాద్ ఈ నెల 16న వెళ్లిన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కి ధర్నాకు అనుమతి లేదనే పేరుతో ఉదేశ్యపూర్వకంగా మెమోలు తీసుకొని వివరణ రాయాలని వొత్తిడి చేయడం అధికారులకు తగదని ప్రజాస్వామ్యంలో పోరాటాలు చేస్తూ హక్కులు సాధించుకునే హక్కు ఉందన్నారు. జిల్లాలో ధర్నాకు వెళు _న్నామని డిడబ్ల్యూఓ అన్ని ప్రాజెక్టుల అధికారులకు వినతిపత్రం ఇవ్వడం జరిగిన కావాలనే ఇలాంటి ప్రయత్నాలు చేసి టీచర్స్, హెల్పర్స్ నీ గంధరగోళంలోకి నెట్టడం తప్ప మరో ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే అనేక పథకాలు ప్రజలకు చేరావేయడంలో టీచర్స్ పాత్ర కీలకమని గుర్తుచేసారు. అనేక వత్తిడిలతో ఉద్యోగాలు చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం బలవంతంగా బి ఎల్ ఓ డ్యూటీలు అప్పగించిందాన్ని ,సింగిల్ ఓ సేవలు అందించిన నేటికీ ఆ డబ్బులు ప్రభుత్వం ఇవ్వలేదాన్నారు. ఇప్పటివరకు ధర్నాకు వెళ్లిన వారికీ మెమోలు ఇవ్వడం అనేది లేదని, కానీ ఈ కొత్త సంప్రదాయం ఏంటని ప్రశ్నించారు. వెంటనే మెమోలు ఇచ్చే పద్దతిని మానుకోవాలని లేనిపక్షంలో అంగన్వాడీ యూనియన్ సీఐటీయూ గా నిర్ణయాలు చేసి పోరాటాలకు పిలుపు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ పక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించాలి
- జిల్లా కలెక్టర్ ప్రవీణ్య




**సంగారెడ్డి, మార్చి 18 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ మ్యాపింగ్ పక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బిఎల్వోలకు హెచ్చరించారు. జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్, ఇంటింటి సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఓలకు తాకిదులు తప్పవని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పటాన్చెరువు, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాలకు చెందిన ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ఓ లు, బిఎల్వోలు, సూపర్వైజర్లతో వీడియో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి బిఎల్ఓ తన పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం కోసం నిర్వహించే ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్ఓలు కీలక పాత్ర పోషించాలని అన్నారు .బిఎల్ఓ లు తమ బాధ్యతలను సమర్ధంగా నిర్వర్తించాలని తెలిపారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ పక్రియలో నిర్లక్ష్యం వహించే బిఎల్వోలకు తాకిదులు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బిఎల్వో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, బిఎల్వోలు లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే బిఎల్వోలను నియమించాలని ఈ ఆర్ఓలను ఆదేశించారు. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 13 కేటగిరీలలో బిఎల్వోలను నియమించుకోవచ్చని అన్నారు. బిఎల్వోల వివరాలను ఈసీఐ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ఆర్ ఓ లు ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీవో రాజేందర్, ఎన్నికల విభాగం సెక్షన్ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు

- 3.6 కిలోల గంజాయి స్వాధీనం
- వ్యక్తి అరెస్టు
- జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు, మార్చి 18 (జనంసాక్షి) :** గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారంతో చేసిన ఈ దాడుల్లో మొత్తం 3.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తాండూరు మండలం గౌతాపూర్ సమీపంలోని ఓ పాలిష్ యూనిట్‌లో గంజాయి నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అక్కడ కార్మికుడిగా పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండి ముస్తాకిన్ వద్ద గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి.పోలీసుల విచారణలో నిందితుడు ముస్తాకిన్ కీలక విషయాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి తాండూరుకు తీసుకువచ్చి, తాను పనిచేస్తున్న యూనిట్‌లోని ఇతర కార్మికులకు, అలాగే పరిసర ప్రాంతాల్లోని కూలీలకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు.నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు, అతనిపై ఎన్.డి.పి.ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఏఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..గంజాయి విక్రయం, కొనుగోలు వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి సమాచారాన్ని గమనించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ రాణి, ఎస్సై రవికుమార్, మరియు సిబ్బంది భీమయ్య, రవి కిషోర్, రమేష్ రాజేందర్ సతీష్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య
- రాయికోడ్‌లో రంజాన్ దుస్తుల పంపిణీ



**రాయికోడు, మార్చి 18 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనె అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రమైన రాయికోడు వ్యవసాయ మార్కెట్ యార్డులో రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన రంజాన్ దుస్తులను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధన్న పాటిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ వినయ్ కుమార్, తాసిల్దార్ ఆశాజ్యోతి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, పలువురు నాయకులతో కలిసి మైనార్టీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేనని కొనియాడారు. త్వరలోనే రైతులకు రైతు భరోసా నిధులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని గుర్తు చేశారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సహకారంతో రైకోడ్ మండలంలో వందల కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మండలం అన్ని విధాల అభివృద్ధి జరిగేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజ్ పటేల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు జి విట్టల్, ఆర్ కృష్ణ, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఒగ్గ శ్రీనివాస్, సర్పంచులు చరణ్ కుమార్, లక్ష్మణరావు పాటిల్, నరేష్, లక్ష్మణ్, నాయకులు మహమ్మద్ సుల్తాన్,ఉప్పరి పండరి, మక్షుత్, ప్రవీణ్ ఎండి రఫీక్, నజీరుద్దీన్, మహంకాళి, రమేష్, డీలర్ సంగన్న, జి విటల్, శ్రీనివాస్, పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక

- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు
- మెదక్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు




**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 18 (జనం సాక్షి) :** పవిత్రమైన రంజాన్ మాసం సోదరభావం, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీక అని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావుపేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరుల కోసం బుధవారం మెదక్ పట్టణంలోని క్రిస్టల్ గార్డెన్స్ లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రేమ, శాంతి, సహకారం పెంపొందించే పవిత్రమైన కాలమని అన్నారు. ఉపవాస దీక్ష ద్వారా మనసును పవిత్రం చేసుకోవడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ముస్లిం సోదరుల అభ్యున్నతికి విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొల్పడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రంజాన్ పండుగ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప పండుగ అని అన్నారు.తెలంగాణ రాష్ట్రం అన్ని మతాలు, వర్గాలు కలిసి జీవించే సంస్కృతికి నిలయమని తెలిపారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్రంలో శాంతి, అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్షించారు. ఉపవాసం ద్వారా ఆత్మశుద్ధి సాధించడం, పేదలకు దానం చేయడం వంటి గొప్ప విలువలను రంజాన్ మాసం గుర్తు చేస్తుందని అన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తమని తెలిపారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆర్డిఓ రమాదేవి మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు తోడుపునూరి చంద్రపాల్,గూడూరి కృష్ణ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడి మధుసూదన్ రావ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాదర్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్ గౌడ్ మున్సిపల్ కౌన్సిలర్లు తోడుపునూరి శివ రామకృష్ణ, గంట సంపత్, శశాంక్, మన్సుర్,హరిత, నర్సింలు జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, బొజ్జ పవన్,మ్యాడం బాలకృష్ణ, గూడూరి ఆంజనేయులు సలీం,హాఫిజ్ మొల్సబ్,సమీ మంగ మోహన్ గౌడ్,ప్రశాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి,హంజద్,ముత్యంగౌడ్ ఉమర్,హామీద్ మహేష్ గౌడ్, ప్రవీణ్ గౌడ్ , శంకర్ గౌడ్,నిఖిల్,ఖాలేక్, తాహెర్, రియాజ్, కొండా శ్రీను గుప్తా, బాలరాజ్, దిలీప్ ఏఎస్పి మహేందర్ డిఎస్పి ప్రసన్న కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
19 మార్చి 2026

# ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం

**తూప్రాన్, మార్చి 18 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్తరించిందని బిజెపి రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్ ముది రాజు తెలిపారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు మనోహరాబాద్ మండల అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారి గారికి వినతిపత్రం అంద చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని రాష్ట్రంలో అర్హులైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని, వికలాంగులకు, వితంతువులకు,వృద్ధులకు నూతన పింఛన్లు మంజూరు చేయడం లేదని, ఎన్నికల సమయంలో అనేక ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు పెట్టుబడి సాయం ఎకరాకు 6000 రుపాయలు వేస్తామని చెప్పి మూడు విడతల పైసలు ఎగ్గొట్టి రైతులను మోసం చేస్తోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగంది,కానీ వాటిలో ఏ ఒక హామీ కూడా ఇప్పటివరకు పూరిగా అమలు కాలేదు అన్నారు. యువతకు



జాబ్ క్షలండర్, నిరుద్యాగ భృతి, వృద్ధాప్య , వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్యాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమసాల పరిష్కకరం వంటి అనేక హామీలు ఇప్పటికే అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుతవంపై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నా రన్నారు .మండలంలో రైతులు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా సమయానికి అందకపోవ్వడంతో రైతులు పెట్టుబ్డల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వృద్ధాప్య వితంతు దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్లు అర్హులైన లబ్ధిదారులకు అందడం లేద నీ మండలంలో దరఖాస్తు చేసుకున్న అనేకమంది వృద్ధులు వికలాంగులు, ఒంటరి మహిళలకు ఇప్పటికి పెన్షన్లు మంజూరు కాలేదని, అర్హులైన అభ్యర్థుల అందరి దరఖాస్తులను వెంటనే ఆమోదించి వారికి పెన్షన్లు అందించాలని కోరారు. పేదలకు ప్రభుత్వం ప్రకటించిన గృహ నిర్మాణ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఇల్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ప్రజలు దరఖాస్తులు సమర్పించినప్పటికీ వారి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని, ఆ సమస్యల పరిష్కారం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, కాళ్లకల్ బిజెపి గ్రామ అధ్యక్షులు కొత్తూరి మల్లేష్ ముదిరాజ్, మండల నాయకులు ఎర్ర కృష్ణ, బూత్ కమిటీ అధ్యక్షులు చెట్టి రాజు ముదిరాజ్,ఎర్ర శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ మంచి గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి




**కౌడిపల్లి, మార్చి 18 (జనంసాక్షి) :** 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కౌడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వెలుతురు, ఫ్యాన్లు, మూత్రశాలలు, అత్యవసర నిమిత్తం అవసరమైన మందులు, వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుంటకట్ట తొలగింపు ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

- డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పణ



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, మార్చి 18 (జనంసాక్షి) :** బిజినపల్లి మండల కేంద్రంలోని గ్రామ శివారులో ఉన్న జుట్టయ్య కుంటను అక్రమంగా ఆక్రమించేందుకు కొందరు కట్టను తొలగిస్తున్నారని, అట్టి వారిపై ప్రభుత్వం తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిజినపల్లి మండల మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు తుమ్మల అల్లోజి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.అంతకుముందు కూడా అదనపు కలెక్టర్ మరియు ఇరిగేషన్ ఈఈలకు ఇదే విషయంపై వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 458లో ఉన్న జుట్టయ్య కుంట మొత్తం 17 ఎకరాలు 10 గుంటల విస్తీర్ణంలో ఉందని, దీనికి అనుసంధానంగా మూడు గొలుసు కట్టు చెరువులు కూడా ఉన్నాయని వివరించారు.ఈ కుంటపై జరుగుతున్న ఆక్రమణల వల్ల స్థానిక మత్స్యకారులకు తీవ్రమైన నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 1996లో వరదల కారణంగా కుంట కట్ట తెగిపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక నిధులతో మరమ్మత్తులు చేపట్టినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం మళ్లీ కుంట కట్టను తొలగించడం ద్వారా ప్రభుత్వ ఆస్తిని నష్టపరిచే చర్యలు జరుగుతున్నాయని తెలిపారు.ఈ నేపథ్యంలో కుంటను రక్షించేందుకు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కుంట పరిరక్షణకు శాశ్వత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రం సమర్పణ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మహేశ్వర్ రెడ్డి, సుదర్శన్, బాలమసయ్య, శ్రీశైలం, శివ, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించినందుకు 3 ఏళ్ల జైలు శిక్ష

- నిందితులకు 2 లక్ష రూపాయల జరిమానా
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 18 (జనం సాక్షి) :** హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వాచ్‌మెన్ స్వామి, అటెండర్ రాజుకు కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. విద్యార్థినుల భుజాలపై చేతులు వేయడం, వారు బట్టలు మార్చుకునే సమయంలో రహస్యంగా గమనించడం వంటి ఘటనలపై ఆగష్టు 2018 లో ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై అప్పటి తూప్రాన్ ఎస్ఐ నాగార్జున గౌడ్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి ఐఓలు డీఎస్పీ తూప్రాన్ రాంగోపాల్ రావు, కిరణ్ కుమార్‌లు పూర్తి సాక్ష్యాలను సేకరించారు. ప్రస్తుత ఐఓ గంగారాజు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితులకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు చెరో లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.2 లక్షల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ ఆఫీసర్ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ నాగరాజు, భరోసా లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేతా తదితరులు సహకరించినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్యను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# కేజీబీవీలో పనిచేసే సిబ్బంది విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి

**నాగర్‌కర్నూల్, మార్చి 18 (జనంసాక్షి) :** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు) విద్యార్థుల సమగ్ర విద్యా అభివృద్ధి కేంద్రాలుగా ఉన్నాయని, ఈ సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రతి ఒక్కరు విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ, నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించడంలో మరింత బాధ్యతతో వ్యవహరించి, విద్యార్థుల విద్యా అభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర ప్రాంతీయ విద్యా సంచాలకులు హైదరాబాద్ (ఆర్జేడీ) ఎం. సోమిరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆర్జెడి సోమిరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శన సందర్భంగా విద్యాలయంలోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, బోధన విధానం, ఉపాధ్యాయుల పనితీరు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభ్యాస స్థాయి, అవగాహన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. అదేవిధంగా,



విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాలను, వసతి పరిస్థితులను కూడా పరిశీలించి, ఆహారం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆయన సంబంధిత ఎస్ ఓ, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా అభివృద్ధి పట్ల ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆర్జెడి సోమిరెడ్డి మాట్లాడుతూ, కేజీబీవీలో పని చేసే ప్రతి ఒక్కరూ తమ వృత్తి పట్ల నిబద్ధతతో వ్యవహరించి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని ఆయన సూచించారు. విద్యాసంస్థలకు చెడ్డపేరు రాకుండా అందరూ సమన్వయంతో పని చేయాలని, వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి సంస్థ ప్రతిష్టను కాపాడాలని అన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరిస్తూనే, కేజీబీవీలను రాష్ట్రంలో ఉత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ ల ద్వారా బాలికల సమగ్ర అభివృద్ధికి సమృద్ధిగా నిధులు వెచ్చిస్తుందన ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని ఆయన సూచించారు. కేజీబీవీలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల పై ఆర్జెడి సోమిరెడ్డి సమగ్ర విచారణ జరిపారు. ఆయన వెంట జిసిడిఓ శోభారాణి, కేజీబీవీ ఎస్ ఓ సుజాత, తదితరులు ఉన్నారు.

## స్వయం ఉపాధి యూనిట్లకు రుణాల మంజూరుకు సహకరించండి

**సంగారెడ్డి, మార్చి 18 (జనం సాక్షి) :** ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన యూనిట్లకు బ్యాంకులు వేగంగా రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులముల కార్యాచరణ ప్రణాళిక 2025–26 కింద సంగారెడ్డి జిల్లాకు మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లకు రుణాల మంజూరుపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) నర్సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, నాబార్డ్ ఏజీఎం క్రిష్ణ తేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ... షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన వివిధ యూనిట్లకు బ్యాంకులు సమయానికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీతో ఈ పథకాలను అమలు చేస్తున్నందున బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని




కోరారు. లబ్ధిదారులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారని, అనంతరం స్క్రీనింగ్ కమ్ సెలక్షన్ కమిటీ ద్వారా అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకులు త్వరితగతిన కాన్సెంట్ ఇచ్చి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. అదేవిధంగా పథకాల అమలులో ఎటువంటి ఆలస్యం లేకుండా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు.జిల్లాలో షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధికి ఈ పథకాలు ఎంతో దోహదపడతాయని, అందరూ సమన్వయంతో పనిచేసి పథకాలను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రుణ సదుపాయాలతో లబ్ధిదారులు స్వయం ఉపాధి ఏర్పరుచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా బ్యాంకులు సహకరించాలని కోరారు.

## మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



**పటాన్‌చెరు, మార్చి 18 (జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన 75 కోట్ల రూపాయలకు సంబంధించిన అభివృద్ధి పనులను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఇంద్రేశం, ఇస్నాపూర్, గడ్డపోతారం, జిన్నారం, గుమ్మడిదల మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్లు, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్, జలమండలి, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమీన్పూర్ సర్కిల్ పరిధిలో గల బీరంగూడ, అమీన్పూర్, రామచంద్రపురం, భారతి నగర్, బొల్లారం వార్డుల పరిధిలో గల ప్రతి కాలనీకి పారిశుధ్య సిబ్బందిని కేటాయించి.. ప్రతిరోజు పర్యవేక్షించాలని సూచించారు.నూతన కాలనీలకు సరిపడి సిబ్బంది లేకపోతే నూతన సిబ్బందిని నియమించాలని అన్నారు.త్వరలో సి ఎస్ ఆర్ నిధుల ద్వారా పారిశుధ్య వాహనాలను సైతం కేటాయించబోతున్నట్లు తెలిపారు. ఐదు మున్సిపాలిటీలకు ప్రభుత్వం ప్రత్యేకంగా 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించడం జరిగిందని, త్వరలో ఇందుకు సంబంధించిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు అజయ్ రెడ్డి, తిరుపతి, వెంకట కిషన్, వెంకటరామయ్య, దశరథ్, డి ఈ వెంకటరమణ, జలమండలి డీజీఎం శివ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గడువులోగా వంద పడకల ఆసుపత్రి పనులు పూర్తి చేయాలి

- డ్రా పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్స్ కేటాయింపు
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**కల్వకుర్తిరూరల్, మార్చి 18 (జనంసాక్షి) :** కల్వకుర్తి పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కల్వకుర్తిలో పర్యటించి, నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆసుపత్రి నిర్మాణ పురోగతిపై ఇంజనీర్లు, సంబంధిత అధికారులతో సమీక్షించిన కలెక్టర్, ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దళిత సామాజిక వర్గానికి షాపింగ్



కాంప్లెక్స్‌ల కేటాయింపు అనంతరం, మున్సిపాలిటీ పరిధిలో షెడ్యూల్డ్ కులాల (రాజ) కోసం కేటాయించిన 36 షాపింగ్ కాంప్లెక్స్‌లను కలెక్టర్ సందర్శించారు. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, అర్హులైన వారికి డ్రా విధానంలో ఈ షాపులను పారదర్శకంగా కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్,వివిధ శాఖల అధికారులు మరియు ఇంజనీర్లు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

**చేర్యాల, మార్చి 18 (జనంసాక్షి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక కార్పొరేట్ విధానాలపై రైతులంతా ఐక్యమై పోరాడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ పిలుపునిచ్చారు. బుధవారం చేర్యాల మండల కేంద్రంలోని వైశ్య భవన్ లో తెలంగాణ రైతు సంఘం మండల, పట్టణ 4వ మహాసభలు మోకు దేవేందర్ రెడ్డి, ఆముదాల నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి గారలు హాజరైనారు. ఈ సందర్భంగా మూడ్ శోభన్ గారు మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ నిర్వహిస్తున్న ఇరాన్ పై యుద్ధం కారణంగా భారతదేశ రైతాంగం, సాధారణ ప్రజానీకం అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తున్నదని అమెరికా అధ్యక్షుడు డ్రోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న సామ్రాజ్యవాద విధానాలకు భారత ప్రధాని మోడీ వ్యవహరిస్తున్న తీరు వల్ల నిత్యవసర వస్తువుల ధరలు




విపరీతంగా పెరిగిపోయాయని భారత దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పడిపోయాయని ఎగుమతులపై పన్నుల భారం విపరీతంగా పెంచి వేయడం అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తులను పన్నులు లేకుండా భారతదేశంలో దిగుమతి చేసుకోవడం వల్ల ఇక్కడి రైతాంగంపై అనేక బారాలు పడుతున్నాయని ఈ విధానాలను తిప్పి కొట్టాలని మరియు నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, యూరియా కొరత, గిట్టుబాటు ధర లేకపోవడం, ఫర్టిలైజరీ యాప్, కాటన్ కపాస్ యాప్ లాంటి టెక్నాలజీ నీ వ్యవసాయ రంగంలో ప్రవేశపెడుతూ ఇక్కడి చిన్న, సన్న కారు రైతులను వ్యవసాయం నుండి వేరు చేసే విధంగా మన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఈ విధానాల వల్ల బడా భూస్వాములకు , కార్పొరేటు వ్యవసాయం నిర్వహించే వారికి మేలు జరుగుతుంది తప్ప చిన్న సన్న రైతులకు ఏమాత్రం లాభాలు చేకూరే విధంగా లేవని రాబోయే రోజుల్లో ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం ఐక్యమై పోరాడాలని పిలువు పిలుపునివ్వడం జరిగింది. అనంతరం తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ టౌన్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, బెజాడి మల్లారెడ్డి, ఆముదాల నర్సిరెడ్డి ,తుప్పతి రాజు, బోడిగం నర్సిరెడ్డి, నాగపురి కనకయ్య ,కొంగరి చంద్ర మజుందార్, సుర్ణ తిరుపతి, ఎస్ డి ఇబ్రహీం, నంగి మైసయ్య, కందూరు శ్రవణ్, కర్ణాకర్, శ్రీకాంత్, పండుగ యాదగిరి, మోకు ఇంద్రం, కర్రె సత్తయ్య, ఎస్ డీ ఇస్మాయిల్, ఆవుల చంద్రయ్య, ఎల సెంబయ్య ముస్త్యాల ప్రభాకర్, కత్తుల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య
- ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు

**రాయికోడు, మార్చి 18 (జనం సాక్షి) :** సమగ్ర సుస్థిర వ్యవసాయం వైపు రైతులను దారి తీసేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతో ముఖ్యమని దీనిపై రైతులు దృష్టి సారించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రముఖ న్యాయవాది జి అంజయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ఎన్ కచూర్ రావు లు స్పష్టం చేశారు. మండల కేంద్రమైన



రాయికోడ్ లోని రైతు వేదికలో సమగ్ర సుస్థిర వ్యవసాయం పై నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుస్థిర వ్యవసాయం ద్వారా పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి స్థానిక వనరులను ఉపయోగిస్తూ పంటలు పండించాలని సూచించారు. రాయికోడు ఏవో శ్రీమతి సారిక మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా మట్టి సారాన్ని కాపాడుకోవచ్చుని అదేవిధంగా ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చని సూచించారు. గోమూత్రం, గోమయం, జీడిపప్పు, చీకు, గుడ్డ జిలుగు, వంటి సహజ పదార్థాలతో తయారు చేసే జీవామృతం ఘన జీవామృతం వంటి ఎరువులు మట్టిలో సూక్ష్మజీవులను పెంచి పంటల పెరుగుదలకు ఎంతో తోడ్పడతాయని ఆమె వివరించారు. అనంతరం పలువురు రైతులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరభద్ర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్ కుమార్, మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్, అల్లాపూర్ సర్పంచ్ చరణ్ కుమార్, పలువురు వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు సకల ఏర్పాట్లు

- అధికారులు సమన్వయంగా పని చేయాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ ప్రతినిధి, మార్చి 18(జనంసాక్షి) : పాలకుర్తి మండలం వల్మిడి గ్రామం లోని శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 23 నుండి ప్రారంభం కానున్న శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపైన బుధవారం, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా డీసీపీ రాజ మహేంద్ర నాయక్,సంబంధిత అధికారులతో మినీ కాన్ఫరెన్స్ హల్ లో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... స్వామి వారి బ్రహ్మోత్సవాల కోసం వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేయాలని, ఆయా శాఖల అధికారులు వారి పరిధిలో గల ఏర్పాట్లన్ని పక్కాగా చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం గా సీటింగ్ ఏర్పాట్లు ఉండాలని, విద్యుత్ సరఫరా లో ఆటంకం ఉండకూడదని , ట్రాఫిక్, క్యూ లైన్, పార్కింగ్ తదితర అంశాల్లో భక్తుల కి ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్వామి వారి దర్శనం సులభం గా దర్శనం చేసుకొని వెళ్లేలా పోలీస్ బందో బస్తు ఉండాలని, తాగు నీటి కోసం మంచి నీళ్ల ట్యాంకర్ లని, మెడికల్ క్యాంపు ని ఏర్పాటు చేయాలని, అంబులెన్స్ అందుబాటులో ఉండాలని, భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా సరిపడా బస్సులను ఆర్టీసీ వారు అందుబాటులో పెట్టాలని,పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అవసరమైన చోట రోడ్ మరమ్మతులు చేయాలనీ, చీరూ వాలంటీర్ లను పంపించాలని, ఫైర్ వెహికిల్ కూడా అందుబాటులో పెట్టాలని, శానిటేషన్ కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపట్టాలని, ఫుడ్ సేఫ్టీ అధికారులు, భోజనాలను చెక్ చేయాలనీ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశం లో ఆర్డీ వో వెంకన్న, ఏసీపీ నర్సయ్య, ఆలయ ఈఓ, పాలకుర్తి తహసీల్దార్, విద్యుత్, వైద్య, పంచాయతీ రాజ్, పోలీస్, ఆర్టీసీ, ఫైర్, పంచాయతీ రాజ్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యపు నీడలో పశు వైద్యశాఖ

- గూడెల్లో వైద్యులు రారు.... చికిత్స చేయరు
- మండలంలో పశు వైద్యాధికారి ఉన్నట్టా లేనట్టా?



మంగపేట మార్చి 18(జనంసాక్షి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పశుసంపద పై ఆధారపడి జీవించేవారే అధికం అలాంటి రైతులకు వెన్నెముకగా నిలవాల్సిన పశు వైద్యశాఖ వైద్యాధికారులు 'నిర్లక్ష్యపు నీడ' లో ఉన్నారంటూ పశువుల రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పలు ఏజెన్సీ గ్రామాల్లో పశువైద్యాధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అక్కడ జీవిస్తున్నటువంటి పశువులు రోగాల బారిన పడి తీవ్ర అనారోగ్యాల సమస్యలతో మృత్యువాత పడుతున్నాయి అంటూ ఏజెన్సీ గ్రామాల ప్రజలు తమ ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో పశు వైద్యాధికారుల నిర్లక్ష్యంతో పశువులకు సరైన సమయంలో వైద్యం అందక ఆసుపత్రుల్లో సిబ్బంది అందుబాటులో లేక పశు పోషకులు తీవ్ర నష్టాలను చవిచేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని నిధులు కేటాయించిన క్షేత్రస్థాయిలో పశు వైద్య సేవలు తీరు దారుణంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో పశు వైద్యశాలలో వైద్యులు నిర్విత సమయానికి ఆసుపత్రులకు రావడంలేదని, మధ్యాహ్నం కాకముందే తాళాలు వేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వైద్యాధికారులు నిర్లక్ష్యం కారణంగా టీకాల పంపిణీలోను జాప్యం జరుగుతుండడంతో పశువులకు గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎండి) వంటి అంటూ వ్యాధులు సోకి పశువులు మృత్యువాత పడుతున్నాయి అంటూ ఏజెన్సీ ప్రాంతంలోనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. మంగపేట మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన రేగులగూడెం, బొంబాయిగూడెం గ్రామాల్లో సుమారు 800 పైగా పశువులు ఉన్నాయి కానీ ఇక్కడ వైద్యులు రారు.. చికిత్స చేయరు అని గ్రామస్తులు బహిర్గతంగానే చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశువర్ధక శాఖ పాడి రైతులను ప్రోత్సహిస్తుంటే ఇక్కడ మాత్రం పశు శాఖ వైద్యాధికారులు వ్యవహరిస్తున్న తీరు ప్రభుత్వాల లక్ష్యానికి వ్యతిరేకంగా ఉన్నాయంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. వైద్యాధికారులు గ్రామాలను సందర్శించి పశువుల సంఖ్య, నమోదులను చేపట్టాల్సిన నిర్లక్ష్యపు వైఖరితో పశువులు రోగాలబారిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పశు వైద్యశాఖ వైద్యాధికారులు నిర్లక్ష్యాన్ని వీడి రైతులకు అందుబాటులో ఉండాలని రైతులు కోరారు.

### సకాలంలో టీకాలు వేయాలి



గ్రామంలో పశువులు సుమారు 600కు పైగా ఉన్నాయి. కానీ పశు వైద్యాధికారులు ఇక్కడికి ఎవరు రాకపోవడంతో చేసేది ఏమీ లేక ప్రైవేట్ వాక్సినేటర్లను పిలిపించుకొని పశువులకు వైద్యం చేయించుకుంటున్నామని వీటి వల్ల ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుందని తెలిపారు. ఎప్పటికైనా పశు వైద్యులు సకాలంలో పశువులకు టీకాలు వేయాలని గ్రామస్తులు కోరారు.

- మడకం బండయ్య, రేగులగూడెం

### విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

మండలంలో విధులు నిర్వహిస్తున్నటువంటి పశు వైద్యాధికారులు తప్పనిసరిగా గ్రామాలను పరిశీలించాలని అలాగే సకాలంలో టీకాలను పంపిణీ చేయాలని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 09 వ తేదీ వరకు వాక్సినేషన్ కొనసాగుతుందని ఎక్కడైతే పశువుల నమోదు, టీకాలు వేయని ఆ ప్రాంతంలో తప్పనిసరిగా టీకాలను వేసే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

- జిల్లా పశు వైద్యాధికారి కొమరయ్య

# మత సామరస్యం వెల్లివిరిసింది

- విశ్వదీప్తి పాఠశాలలో ఉగాది, రంజాన్ వేడుకలు



మల్హర్, మార్చి18 (జనంసాక్షి) : మండలం లోని కొయ్యూరు గ్రామం లోని విశ్వదిప్తి పాఠశాల లో బుధవారం రోజున ముందస్తు ఉగాది, రంజాన్ పండుగలను పాఠశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.విద్యాలయం ఆవరణలో విద్యార్థులు తెలుగు తనం ఉట్టిపడలే వేశాధారణ లో ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ మాట్లాడుచు ముందస్తు ఉగాది,రంజాన్ పండుగల శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు ఉగాది పచ్చడి, ఇఫ్తార్ విందు ఇచ్చారు. కులమతాలకు అతీతంగా విద్యార్థుల అందరిని ఒకే వేదిక పైకి తీసుకరావడం తో పాఠశాల లో మతసామరస్యం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ మెర్సీ వర్గీస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ పంటలపై రైతులు దృష్టి సారించాలి

- ఉద్యానవన శాఖ అధికారి తరుణ్



చెన్నారావుపేట, మార్చి 18( జనం సాక్షి ): ఆయిల్ ఫామ్ పంటలపై రైతుల దృష్టి సారించాలని ఉద్యానవన శాఖ అధికారి తరుణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆత్మ(అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ, ఇతర అనుబంధ శాఖల పైన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ పంటల సాగుకై రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మంచి సబ్సిడీలు, ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. రైతులు దీనిని సద్వినియోగపరుచుకొని అత్యధిక సంఖ్యలో ముందుకు వచ్చి ఆయిల్ ఫామ్ మొక్కలను నాటుకోవాలన్నారు. అలాగే ప్రస్తుతం కొన్ని వ్యవసాయ యంత్ర పరికరాలకు సబ్సిడీలు ఉన్నాయని కావాల్సిన రైతులు సంప్రదించాలని కోరారు. ప్రాంతీయ పరిశోధన స్థానం ములుగు రోడ్డు వరంగల్ సీనియర్ శాస్త్రవేత్త రాములు మాట్లాడుతూ రైతులు సమగ్రమైన పోషక యాజమాన్యాలు పాటిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే నేలలు ఆరోగ్యంగా ఉండి చౌడు భారకుండా మంచి నాణ్యమైన అధిక దిగుబడులను ఇస్తుందన్నారు. సాధ్యమైనంతవరకు వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించిన మేరకే ఎరువులను సమతుల్యంగా వాడుకోవాలని పరిమితులను మించి వాడితే నేల ఆరోగ్యము దెబ్బతింటుందన్నారు. పంట పెట్టుబడి ఖర్చు రైతుకు ఎక్కువవుతుందని తద్వారా అనవసరపు చీడపీడలు ఆశించి ఖర్చు ఎక్కువై నాణ్యత తగ్గిపోతుందని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల యాజమాన్యం, సేంద్రియ వ్యవసాయం ప్రతి రైతు అలవర్చుకోవాలని అన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సంపేట కే.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు వ్యవసాయ విధానాలు పాటించి సుస్థిర వ్యవసాయాన్ని అవలంబించుకోవాలని అన్నారు. ఆత్మ వరంగల్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ విజయనిర్మల మాట్లాడుతూ ఈ ఆత్మ ప్రాజెక్టులో భాగంగా వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు సంబంధించిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు శిక్షణ కార్యక్రమాల రూపంలో అంతర జిల్లా అంతర రాష్ట్ర ఎక్స్పోజర్ విజిట్ల రూపంలో భవిష్యత్తులో అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట మండల వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ రెడ్డి, సారంగం, ఏఈవోలు, రైతులు, పాల్గొన్నారు.



# గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీస్ దాడులు

- ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు
- ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి

నెక్కొండ, మార్చి 18 (జనం సాక్షి): నెక్కొండ మండల కేంద్రంలోని ఏదో చాటు మాటూగా కాకుండా తమ ఇళ్లవద్దే నాటు సారా కాస్తూ అమ్మకాలు జరుగుతున్న వ్యక్తుల ఇళ్లలో ఎక్సైజ్ పోలీస్ నర్సంపేట సిఐ నరేష్ రెడ్డి, స్థానిక నెక్కొండ మండల సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్, పోలీస్ సిబ్బందితో మండలంలోని హరిచంద్ తండాలో రైడ్ నిర్వహించగ సుమారు 2000 లీటర్ల గుడుంబా పానకం, 50 కిలోల బెల్లం, 10 కిలోల పట్టిక, 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురు వ్యక్తులను అదుపులో కి తీసుకొని తీసుకున్న ముగ్గురు వ్యక్తులపై1) రాజావత్ రాము 2)జాటోతు కిట్టయ్య 3) జాటోతు బిక్షపతి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు . స్వాధీనం చేసుకున్న మొత్తాన్ని నర్సంపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కి తరలించామని పోలీసు తెలిపారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

- విద్యార్థినీ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి
- అసెంబ్లీలో ధ్వజమెత్తిన ఎమ్మెల్యే రామారావు పటేల్



బాసర, మార్చ్ 18 (జనం సాక్షి) చదువుల తల్లి కొలువైనటువంటి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలోని త్రిబుల్ ఐటీ యూనివర్సిటీలో సమస్యలు రాజ్యమేలుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బుధవారం అసెంబ్లీలో ధ్వజమెత్తారు.గత 2014 వ సంవత్సరం నుండి బాసర ట్రిపుల్ ఐటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన బాసర త్రిబుల్ ఐటీలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ట్రిపుల్ ఐటీ విద్యార్థి తేజస్విని మృతి చెందిందని అవునా ఆమె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఈ ఘటన జరిగిందన్నారు.సరైన వైద్య సేవలు అందకపోవడం మూలంగానే ఒక నిండు ప్రాణం బలైందనీ అన్నారు.గత ఆరు సంవత్సరాల క్రితం అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ విద్యార్థులకు కొన్ని కంప్యూటర్లు మాత్రమే ఇచ్చారని, కంప్యూటర్లు, ల్యాప్టాప్ లు లేక విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేకపోతున్నారన్నారు. త్రిబుల్ ఐటీ పర్యవేక్షణకు గొప్ప విద్యావంతులను నియమించి ఒక కమిటీ ఏర్పాటు చేయడం వలన అక్కడి అధికారులకు విద్యార్థుల పట్ల శ్రద్ధ ఉంటుందని కావున పర్యవేక్షణకు పార్లమెంటు సభ్యులు,శాసనసభ్యులు లేదా కలెక్టర్ల వంటి విద్యావంతులతో కూడిన ఒక కమిటీని వెయ్యాలన్నారు. నియామకాల ప్రక్రియ పారదర్శకంగా లేదని, సమస్యలు అడిగితే పరీక్షల్లో విద్యార్థులకు ఫెయిల్ చేస్తామని అధికారులు విద్యార్థులను బెదిరిస్తున్నారని అన్నారు. అక్కడ ఉన్న బేకరీ యజమాని విద్యార్థులకు బేకరీ తిను బండారాలను ఇష్టనుసారంగా అధిక ధరలకు అమ్మి విద్యార్థులను నిలువుగా దోచుకుంటు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పట్టించుకునే నాధుడు కరువయ్యారని అన్నారు.ఇకనైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించి విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.


# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రస్తుత సమాజంలో మహిళలదే కీలకపాత్ర
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ బ్యూరో, మార్చి18,(జనంసాక్షి) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో మహిళల పాత్రను కొనియాడుతూ, వారికి మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడూతూ, నేటి సమాజంలో మహిళలు అబలలు కాదని, సబలులుగా అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. విద్య ద్వారా మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, ప్రతి మహిళ తన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలను అధిరోహించడం గర్వకారణమని పేర్కొన్న కలెక్టర్, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల అభివృద్ధికి పురుషుల సహకారం కూడా అవసరమని, సమాన అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మహిళలు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో పాటు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, విజయవంతమైన మహిళలు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున మహిళా ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని, పని ప్రదేశాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను కలెక్టర్ ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఖజానా శాఖ అధికారి సరోజ, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికి ఊపిరినిచ్చిన ఇనగాల ట్రస్ట్



పరకాల, మార్చి 18 (జనం సాక్షి): పరకాల పట్టణానికి చెందిన బొచ్చు శరత్ చైతన్య దంపతుల కుమార్తె రిత్విక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఇనగాల వెంకటరామిరెడ్డి చొరవతో అపోలో ఫౌండేషన్ హృదాన్ ప్రోగ్రాం ద్వారా చిన్నారికి శస్త్ర చికిత్స చేయించారు. గత కొంతకాలంగా చిన్నారి రిత్విక గుండెజబ్బుతో బాధపడుతుండగా శస్త్ర చికిత్స చేయించేందుకు అవసరమైన ఖర్చు భరించలేని చిన్నారి తల్లిదండ్రులు హనుమకొండ డిసిసి అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి ని కలవగా తక్షణమే స్పందించి జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్ లో చిన్నారికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించారు. ప్రస్తుతం చిన్నారి కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. తమ బిడ్డకు పునర్జన్మను ఇచ్చిన ఇనగాల వెంకట్రాం రెడ్డి, ట్రస్టుకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



బెల్లంపల్లి, మార్చ్ 18, (జనంసాక్షి) : పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షల నిమిత్తం జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వెలుతురు, ఫ్యాన్లు, మూత్రశాలలు, అత్యవసర నిమిత్తం అవసరమైన మందులు, వైద్య సిబ్బంది నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, జిరాక్స్ సెంటర్లు మూసివేయిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ సంపత్‌తో కలిసి సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠ్యాంశాలలో వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల కోసం వేసవిలో సమ్మర్ క్యాంప్ లు నిర్వహిస్తామన్నారు. రామ్ నగర్ ప్రాంతంలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను సందర్శించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# సీఎండీకి మాజీ ఎమ్మెల్యేల వినతి



హన్మకొండ ప్రతినిధి మార్చి 18 (జనం సాక్షి) : స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హన్మకొండ-హంటర్ రోడ్ లోని ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ భవనానికి విద్యుత్ శాఖ అధికారులు అకారణంగా విధించిన అపరాధ రుసుమును రద్దు చేయాలని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ కు వర్ధన్నపేట మాజీ శాసన సభ్యులు, వరంగల్ మాజీ మేయర్ తక్కెళ్ల పల్లి రాజేశ్వర్ రావు, వర్ధన్నపేట మాజీ శాసన సభ్యులు,ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు బోర్డు చైర్మన్ వన్నాల శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్,ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ ముఖ్య సలహాదారులు, సీనియర్ జర్నలిస్ట్ వేముల సదానందం నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గత పది సంవత్సరాలుగా చేనేత కార్మికుల విద్యార్థుల ఉన్నత విద్యకు పేదరికం అడ్డు కాకూడదనిది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ ఆధ్వర్యంలో బీసీ నేత విద్యార్థులకు ఉచిత బోజనం,వసతి గృహం నిర్వహిస్తున్నది. ఈ భవనానికి సంబంధించిన విద్యుత్ బిల్లులు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. పూర్తిగా దాతల ఆర్థిక సహాయంతో కొనసాగుతున్న బీసీ నేత హస్టల్ కు చెందిన విద్యుత్ మీటర్ పై విద్యుత్ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అకారణంగా రూ.73,745/- అపరాధ రుసుము విధించారు. బీసీ నేత హస్టల్ నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మా సంస్థకు 'మూలిగేనక్కపై తాటిపండు పడిన' చందంగా తయారైంది. కావున అకారణంగా విధించిన అపరాధ రుసుమును రద్దు చేయాలని ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు తక్కెళ్ళ పెల్లి రాజేశ్వర్ రావు, వన్నాల శ్రీరాములు,కొండేటి శ్రీధర్,ట్రస్ట్ బోర్డు ముఖ్య సలహాదారులు వేముల సదానందం నేతలు కోరారు. కాగా వారు చేసిన విజ్ఞాపన పట్ల ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

# నల్గొండ జిల్లా పట్టు పురుగుల పెంపకానికి అనుకూలం

- కలెక్టర్ బి.చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, మార్చి 18 (జనం సాక్షి) :** పంట మార్పిడిలో భాగంగా రైతులు పట్టుపురుగుల పెంపకంపై దృష్టి సారించాలి అని పంట మార్పిడిలో భాగంగా రైతులు పట్టుపురుగుల పెంపకంపై దృష్టి సారిస్తే అధిక లాభాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. అయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం, నరసింహాపురం లో రైతు పుండరీకం సాగు చేస్తున్న పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని సందర్శించారు. పట్టుపురుగుల పెంపకానికి ఉపయోగ పడే భూములు,విస్తీర్ణం, పెట్టుబడి ఖర్చు, వాతావరణ అనుకూలత, కూలీలు తదితర వివరాలను రైతు పుండరీకం ద్వారా జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పట్టుపురుగుల పెంపకం రైతు పుండరీక మాట్లాడుతూ పట్టు పట్టుపురుగుల పెంపకానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నాయని, ఒక ఎకరాకు పెట్టుబడి 8 నుండి 10 లక్షలు ఖర్చు అవుతుందని, ప్రతి సంవత్సరం 8 పంటలు తీయవచ్చని, ఒక పంటకు లక్ష రూపాయల నుండి నాలుగు లక్షల వరకు ఆదాయం వచ్చిన సందర్భాలు ఉన్నాయని, తాను రెండు ఎకరాల్లో పట్టుపురుగుల పెంపకాన్ని చేపట్టడం జరిగిందని, 2017 సంవత్సరంలో పట్టుపురుగుల పెంపకం ప్రారంభించామని ఇప్పటివరకు నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ పట్టుపురుగుల పెంపకాన్ని చేపట్టవచ్చని, ముఖ్యంగా వరి లాంటి మంటలకు వచ్చే తెగులు, ఎలాంటి చీడపీడల బెడద ఉండదని, కేంద్ర ప్రభుత్వం 50% ,రాష్ట్రప్రభుత్వం 25 శాతం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. రైతులకు మంచి లాభకారంగా ఇది ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పట్టుపురుగుల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని, ఏప్రిల్ 2న గ్రామాలలో నిర్వహించే ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక గ్రామసభలలో పట్టుపురుగుల తోటల పెంపకానికి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేకించి సెరికల్చర్ లో సబ్సిడీ బాగా ఉందని, అంతే కాక ఈ పంటలో ఎలాంటి వృధా అన్నది లేనందున నష్టం కూడా రాదని,సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు లాభాలు వస్తాయని,పట్టుపురుగుల పెంపకానికి నల్గొండ జిల్లా భూమి, నీరు ,అన్నీ అనుకూలంగా ఉన్నాయని, అలాగే సెరికల్చర్ కు మంచి మార్కెట్ ఉందని, మంచి డిమాండ్ ఉందని దీన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రైతు పుండరీకం కు కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన సెరికల్చర్ రిసోర్స్ సెంటర్ ను సందర్శించి రైతులతో మాట్లాడారు. అన్ని గ్రామాల సర్పంచ్ లు సేరికల్చర్ పంట పట్ల ప్రోత్సహించాలని ఈ సందర్భంగా తెలిపారు. కాగా ఇందిరమ్మ ఇండ్ల గురించి జిల్లా కలెక్టర్ సర్పంచులతో మాట్లాడుతూ గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు గురించి ఆరా తీశారు. సెక్రటరీ తో మాట్లాడి వ్యక్తిగత మరుగుదొడ్లకు బుక్ చేసుకోవడం ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులను పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ డిడి సుభాషిని మాట్లాడారు. హార్టికల్చర్ అధికారి అనంతరెడ్డి, నరసింహాపురం సర్పంచు రాజేశ్వరి, ఇతర గ్రామాల సర్పంచులు, తదితరులు ఉన్నారు.

## జిల్లా ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 18 (జనంసాక్షి) :** జిల్లా ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండుగ ప్రతి కుటుంబానికి ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉగాది పండుగ కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలకు శ్రీకారం చుట్టే శుభదినమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని, జిల్లా అభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని పండుగ వేడుకలను నిర్వహించాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు. శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, పరిశుభ్రమైన వాతావరణంలో ఉగాది వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. ఈ ఉగాది ప్రతి ఒక్కరికి శాంతి, సమృద్ధి, సుఖసంతోషాలను తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు




**కోదాడ టౌన్, మార్చి 18 (జనంసాక్షి) :** ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు,మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ జబ్బార్, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో ఒక్కపొద్దులో ఉన్న ముస్లిం సోదరులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని,మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలు ముస్లింల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ప్రజాప్రతినిధులు,అధికారులు ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వాజిద్ అలీ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి,ఎంఈఓ సలీం షరీఫ్,ముస్లిం మైనార్టీ నాయకులు అల్తాఫ్ హుస్సేన్,వరప్రసాద్ రెడ్డి,కేఎల్ఎన్ ప్రసాద్,పందిరి నాగిరెడ్డి,చింతలపాటి శ్రీనివాస్,బాజాన్, బాగ్దాద్,రహీం,అహ్మద్ అలీ,మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక రంజాన్



**సూర్యాపేట, మార్చి 18 (జనంసాక్షి) :** మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. బుధవారం సూర్యాపేట మున్సిపాలిటీ 44వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ గునగంటి హేమా సతీష్ ఆధ్వర్యంలో రంజాన్ పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని అన్నారు. పేదల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. అల్లా ఆశీస్సులతో అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. మన ప్రాంతం అభివృద్ధి చెందేలా అల్లా శక్తిని ఇవ్వాలని అన్నారు. మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, కొణతం రాజేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం,ఆలేటి మాణిక్యం, ఇస్రార్ అహ్మద్, షేక్ మన్సూర్ అలీ, బంధు శ్రీధర్ బాబు, ప్రదీప్, జహీర్, మసూద్, సాయి, సోహెల్, మునీర్, ఆలేటి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో కార్మికుల పాత్ర అభినందనీయం

- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం
- గట్టు ఇప్పలపల్లి సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్



**తలకొండపల్లి, మార్చి 18 (జనంసాక్షి) :** గ్రామ పరిశుభ్రత కోసం నిత్యం కష్టపడుతున్న కార్మికుల సేవలు వెలకట్టలేనివని,వారు అంకితభావంతో పనిచేస్తేనే గ్రామాలు పరిశుభ్రంగా,ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్ అన్నారు. బుధవారం తలకొండపల్లి మండలంలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలకవర్గం సభ్యులతో కలిసి గ్రామ పంచాయతీ సిబ్బంది,పారిశుద్ధ్య కార్మికులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధి,పరిశుభ్రతలో పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్యం,గ్రామ పరిశుభ్రత కోసం నిత్యం కష్టపడుతున్న కార్మికుల సేవలు అమూల్యమైనవని గుర్తు చేశారు. వారి కృషిని గుర్తించి సన్మానించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం కార్మికులకు రక్షణగా ఉపయోగపడే శానిటైజర్ కిట్స్,గ్లౌజ్ లు,మాస్కులు,సబ్బులు,తదితర నిత్యవసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిత,పంచాయతీ కార్యదర్శి,వార్డు సభ్యులు రేణు రెడ్డి,అశోక్ గౌడ్,రాజశేఖర్, మల్లేష్,శెట్టి రాజశేఖర్, మంజుల, శ్రీను, అమృత, ఆసియాబేగం, వెంకటమ్మ,సురేష్, గ్రామపంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సర్పంచ్ భర్తపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన గిరిజన విద్యార్థి సంఘాల నేతలు



**అచ్చంపేట, మార్చి 18 (జనం సాక్షి) :** మండల పరిధిలోని అంకిరోనిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సర్పంచ్ కమల భర్త సతీష్ నాయక్ పై దాడిచేసిన కాంగ్రెస్ అచ్చంపేట మండలాధ్యక్షులు దొడ్ల నర్సయ్య యాదవ్ తో పాటు అతని అనుచరులు దొడ్ల వినోద్,దొడ్ల రామకృష్ణ, దొడ్ల పద్మలను అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని గిరిజన విద్యార్థి సంఘాల జెఏసీ నేతలు డిమాండ్ బుధవారం చేశారు. బషీర్ బాగ్ లోని తెలంగాణ రాష్ట్ర ఎస్టీ కమిషన్ కార్యాల యాన్ని సందర్శించి సభ్యులు కె. రాంబాబునాయక్ ను కలిసి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు గ్రామంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించుకున్న ఇండ్ల యాజమానులకు సర్పంచ్ నోటిస్లు జారి చేయగా హైద్రాబాద్లోని ఓయు ఆర్ట్స్ కాలేజి ప్రాంగణంలో జరిగిన మిడియా సమావేశంలో బీఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు, గిరిజన చైతన్య వేధిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజు నాయక్ మాట్లాడుతూ గ్రామంలోని ఆటో స్టాండ్ దగ్గర సతీష్ తన పనినిమ్మితం నిలబడి వుంటే అక్రమ నిర్మాణాలకు నోటిసులు ఎలా ఇప్పిస్తావని సంబందం లేని విషయాలు తీసుకవచ్చి కల్పించుకోని కులంపేరుతో తీవ్రంగా దూషిస్తు రాళ్లతో, కర్రలతో దాడి చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆకారణంగా గిరిజన సర్పంచ్ కమల కుటుంబ సభ్యులపై దాడిచేసిన కాంగ్రెస్ మండలాధ్యక్షులు దొడ్ల నర్సయ్యతో పాటు అతని అనుచరులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు కొర్ర శరత్ నాయక్.లైవ్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి. రాజేష్ నాయక్. నరేస్నాయక్, గిరిదర్నాయ.క్ నేతలు నాయక్ డిమాండ్ చేశారు.

## ప్రజలందరికీ తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 18 (జనంసాక్షి) :** ఈ పరాభవ నామ సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ మాజీ మంత్రి , సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అన్ని రంగాల ప్రజల ఆశలు చిగురించి ప్రతి ఇంటా సిరులు పండాలని అన్నారు. తెలుగు వారి కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. ప్రకృతితో మమేకమై వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు ఉగాది గొప్ప పర్వదినమని తెలిపారు. షడ్రుచుల వలె అన్ని రంగాల ప్రజలు కలిసిమెలిసి ఐక్యతతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రకృతి అనుకూలించి రైతులతో పాటు ఉద్యోగ, వ్యాపార అన్ని రంగాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## మారుమూల గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



**మోమిన్‌పేట, మార్చి 18 (జనం సాక్షి) :** మారుమూల గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్య మవుతుందని, బాల్ రెడ్డి గూడెం గ్రామ సర్పంచ్ అనంతరెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో సీనియర్ నాయకులు నరోత్తం రెడ్డిలతో కలిసి 10 లక్షలు సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో, సీనియర్ నాయకులు నరోత్తం రెడ్డిల అండతోగ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమలను, చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే గ్రామంలో,వర్క్ షెడ్ 10 లక్షలు, డ్వాక్రా భవనం10 లక్షలు, అలాగే ఆర్, అండ్,బిరోడ్డు నుండి గ్రామం వరకు బీటీ రోడ్డు మంజూరైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయ, వార్డు సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగం రావడంలేదని బెంగతో యువతి ఆత్మహత్య



**ఖమ్మం రూరల్, మార్చి 18 (జనం సాక్షి) :** ఉద్యోగం రావడం లేదని తీవ్ర మనస్థాపనతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెల్లారుపల్లి గ్రామానికి చెందిన ఉన్నం భవాని (25) పీజీ వరకు చదువుకొని గత కొంతకాలంగా ఇంటి దగ్గరే ఉంటూ కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంది. ఎటువంటి నోటిఫికేషన్ రాకపోవడం,ఉద్యోగం ఇక రాదేమోనని బెంగతో తీవ్ర మనస్తాపం చెంది మంగళవారం ఉదయం గడ్డి మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించింది. వైద్యులు ఫలితం లేదని ఇంటికి తీసుకెళ్లమని సూచించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్ఐ



**చింతపల్లి, మార్చి 18 (జనం సాక్షి) :** చింతపల్లి మండల కేంద్రంలోని పదో తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా స్థానిక ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి ఆకస్మికంగా పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పరీక్షలు నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయా అనే విషయాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, విద్యార్థుల క్రమశిక్షణ, సిబ్బంది విధి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాంటి అక్రమాలు, కాపీయింగ్ ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన ఆకాంక్షించారు.

## యాదగిరిగుట్ట దేవస్థానంలో దళిత ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలి



**భువనగిరి టౌన్, మార్చి 18 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి దేవస్థానంలో దళిత వర్గాల ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు తక్షణమే ఇవ్వాలని దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ నూతన డైరెక్టర్ ఎం. హనుమంతు రావును కలసి వినతిపత్రం అందజేశారు. దేవస్థానంలో గత కొన్ని నెలలుగా దళిత వర్గాల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వకుండా, ఇతర వర్గాల వారికి మాత్రమే ఆదేశాలు జారీ చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి అన్యాయం జరుగుతున్నట్లయితే వెంటనే సరిదిద్దాలని కోరారు. అలాగే దేవస్థానంలో దళిత ఉద్యోగులు, భక్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కూడా డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హనుమంతు రావును శాలువాతో సన్మానించి, దేవస్థాన ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, దళిత ఐక్యవేదిక చైర్మన్ బట్టు రామచంద్రయ్య మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, జర్నలిస్టు సంఘం నాయకులు వినియోగదారుల ఫోరం నాయకులు ఎలిమినేటి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ముందుకు రావాలి

- మత్తు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం
- హాలియా ఎస్సై సాయి ప్రశాంత్





**హాలియా, మార్చి 18 (జనం సాక్షి) :** భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న భగత్ సింగ్ స్మారక విద్యార్థి యువజన ఉత్సవాల సందర్భంగా పోస్టర్లు విడుదల చేయడంతో పాటు గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు సంబంధించిన పలకలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయి ప్రశాంత్ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలన కోసం విద్యార్థి, యువజన సంఘాలు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమన్నారు. యువతను తప్పుదారి పట్టిస్తున్న మత్తు పదార్థాలు సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని తెలిపారు. వీటి వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు, భవిష్యత్తులు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి విక్రయం, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని, అక్రమ కార్యకలాపాలలో పాల్గొనేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జమిందార్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు సురేష్, వెంకటేష్, విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, విభాగ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీష్, యువజన సంఘ నాయకులు రామకృష్ణ, నాగరాజు, వర్షిత్, సందీప్, గోపి తదితరులు పాల్గొన్నారు.




# రెండో రోజూ లాభాల ర్యాలీ

- డాలర్ రూ.92.40
- ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.4,741 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు: రూ.5,225 కోట్లు




**న్యూఢిల్లీ:**వరుసగా రెండో రోజూ దేశీయ సూచీల లాభాల ర్యాలీ కొనసాగింది. సానుకూల అంతర్జాతీయ సంకేతాలతో లోహ, వాహన షేర్లు రాణించడం కలిసొచ్చింది. సెన్సెక్స్ 76,000 పాయింట్ల ఎగువన ముగియగా, నిఫ్టీ 23,600 పాయింట్లకు చేరువైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 12 పైసలు తగ్గి, జీవనకాల కనిష్ఠమైన 92.40 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు 2.9% లాభంతో 103 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా, ఐరోపా సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.73 లక్షల కోట్లు పెరిగి రూ.433.30 లక్షల కోట్ల (4.69 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 324 పాయింట్ల (క్రితం ముగింపు 75,502.85) లాభంతో 75,826.68 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. తదుపరి ఆరంభ లాభాలను కోల్పోయి, 75,324.73 పాయింట్లకు పడిపోయింది. మధ్యాహ్నం తర్వాత మళ్లీ పుంజుకున్న సూచీ, 76,304.26 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. చివరకు 567.99 పాయింట్ల లాభంతో 76,070.84 వద్ద ముగిసింది. నిఫ్టీ 172.35 పాయింట్లు పెరిగి 23,581.15 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,346.60- 23,656.80 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 21 రాణించాయి. ఎటర్నల్ 5.70%, టాటా స్టీల్ 4.41%, ఎం అండ్ ఎం 3.12%, బీఈఎల్ 2.39%, ఎల్ అండ్ టీ 2.29%, భారతీ ఎయిర్‌టెల్ 2.13%, మారుతీ 1.88%, ఇండిగో 1.55%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.25%, యాక్సిస్ బ్యాంక్ 1.18% లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ, హెచ్‌యూఎల్, టీసీఎస్ 1.37% వరకు నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. లోహ 2.81%, వాహన 2.05%, స్థిరాస్తి 1.79%, కమొడిటీస్ 1.69%, వినియోగ 1.54%, పరిశ్రమలు 1.54%, యంత్ర పరికరాలు 1.40%, టెలికాం 1.24%, బ్యాంకింగ్ 0.90% మెరిశాయి. ఐటీ, ఎఫ్ఎమ్‌సీజీ, ఫోకస్డ్ ఐటీ పడ్డాయి. బీఎస్ఈలో 2360 షేర్లు లాభపడగా, 1784 స్క్రిప్‌లు నష్టపోయాయి. 198 షేర్లలో ఎటువంటి మార్పులేదు. ఆదాయపు పన్ను విభాగం నుంచి రూ.5,786.4 కోట్ల నోటీసు అందుకున్నట్లు మారుతీ సుజుకీ ఇండియా తెలిపింది. వివాదాల పరిష్కార ప్యానెల్ ముందు, ఈ నోటీసును సవాల్ చేయనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. కర్ణాటకలోని కూర్గ్‌లో అల్ట్రా-లగ్జరీ రిసార్ట్ కొనుగోలు చేసినట్లు లీలా ప్యాలెసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రకటించింది. దీంతో కలిపి కంపెనీ చేతిలోని హోటళ్ల సంఖ్య 15కు పెరిగింది. ఇన్నోవిజన్ ఐపీఓ ముగిసేసరికి 3.32 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 63,99,943 షేర్లను ఆఫర్ చేయగా, 2,12,70,519 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 13.75 రెట్లు, ఎన్ఐఐల నుంచి 8.26 రెట్లు, రిటెయిల్ మదుపర్ల విభాగంలో 58% స్పందన నమోదైంది. దివాలా ప్రక్రియ ద్వారా జైప్రకాశ్ అసోసియేట్స్‌ను కొనుగోలు చేయడానికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ సమర్పించిన రూ.14,535 కోట్ల బిడ్‌కు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదం తెలిపింది. గత ఏడాది నవంబరులో జైప్రకాశ్ అసోసియేట్స్‌ను కొనుగోలు చేయడానికి అదానీ సమర్పించిన ప్రణాళికను రుణదాతల కమిటీ (సీఓసీ) ఆమోదించింది.

## విమాన ప్రయాణికులకు భారీ ఊరట..

### 60శాతం సీట్లపై బాదుడు బంద్

**న్యూఢిల్లీ:**విమాన ప్రయాణికులకు భారీ ఊరట కలిగించేలా కేంద్ర పౌరవిమానయాన శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. విమానాల్లో సీట్ల ఎంపికపై విధిస్తున్న అధిక ఛార్జీలను అరికట్టడానికి చర్యలు చేపట్టింది. ఇకపై అన్ని విమానాల్లో కనీసం 60 శాతం సీట్లపై ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకుండా విమానయాన సంస్థలకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేసింది. విమానాల్లో సీట్ల ఎంపికకు ఛార్జీల వంటి కన్పించని రుసుములతో ఎయిర్‌లైన్లు దోపిడీకి పాల్పడుతున్నాయంటూ కొంతకాలంగా ప్రయాణికులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విమానాల్లో సీట్ల ధరలు అవి ఉన్న స్థానాలకు అనుగుణంగా వేర్వేరుగా ఉంటాయి. ఉదాహరణకు విండో సీటు, దారి పక్కన ఉండే సీట్లు కాస్త ఎక్కువ సౌకర్యవంతంగా ఉండటంతో ఆయా సీట్లకు డిమాండ్ ఎక్కువ ఉంటుంది. దీంతో వీటికి ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తారు. విమానంలో చాలా తక్కువ సీట్లకు మాత్రమే ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవు. అవి కూడా మధ్య వరుసలో ఉండేవి లేదా.. చివర్లో ఉండేవే. ఈ తరహా అదనపు ఛార్జీలు ఎందుకంటూ ప్రయాణికులు తరచూ సామాజిక మాధ్యమాల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పౌరవిమానయాన శాఖ తాజా చర్యలు చేపట్టింది. అదనపు ఛార్జీలపై పరిమితి విధించడంతో పాటు అన్ని ఎయిర్‌లైన్లలో పారదర్శక విధివిధానాలు పాటించేలా పలు ఆదేశాలు జారీ చేసింది. అవేంటంటే..అన్ని విమానాల్లో కనీసం 60శాతం సీట్లను ఎలాంటి అదనపు/ఎంపిక ఛార్జీలు లేకుండా ఇవ్వాలి ఒకే పీఎన్ఆర్‌తో టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులు ఒకే దగ్గర కూర్చునేలా సీట్లు కేటాయించాలి. ప్రయాణికుల క్రీడా పరికరాలు, సంగీత వాయిద్యాలను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సురక్షితంగా తరలించాలి. పెంపుడు జంతువుల కోసం ఎయిర్‌లైన్లు స్పష్టమైన పాలసీలను తీసుకురావాలి. విమానాల ఆలస్యం, రద్దు వంటి సందర్భాల్లో ప్రయాణికుల హక్కుల విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలి. ప్రయాణికుల హక్కులను వెబ్‌సైట్లు, యాప్‌లు, బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లు, ఎయిర్‌పోర్టు కౌంటర్ల వద్ద ప్రదర్శించాలి. వీటి గురించి ప్రాంతీయ భాషల్లో స్పష్టంగా సమాచారం అందించాలి.



## జియో నుంచి యూపీఐ క్యాష్ విత్‌డ్రా సేవలు

**న్యూఢిల్లీ:**జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ అనుబంధ సంస్థ జియో పేమెంట్స్ బ్యాంక్ సరికొత్తగా యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణ సేవలను ప్రారంభించింది. టచ్ పాయింట్ల వద్ద తన బిజినెస్ కరెస్పాండెంట్ల ద్వారా చేపట్టిన ఈ సేవలు డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేసేందుకు వేసిన ప్రధాన అడుగుగా చెబుతోంది. ముఖ్యంగా గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లోని వినియోగదార్లు తమ యూపీఐ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, నగదును విత్‌డ్రా చేసుకోవచ్చని తెలిపింది. ఇందుకు డెబిట్ కార్డులు - ఏటీఎం అవసరం ఉండదని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేర్కొంది. ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో ఇంటర్నేషనల్ ట్రావెలర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. వైఫై కాలింగ్ ఆప్షన్ ద్వారా ఉచితంగా ఇన్‌కమింగ్ ఎస్సెమ్మెస్‌లు పొందే సదుపాయం కల్పిస్తోంది. ఇందుకోసం ఎలాంటి ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌ను యాక్టివేట్ చేసుకోవాల్సిన అవసరం లేదు. అంటే విదేశాల్లో ఉన్నప్పుడు ఎలాంటి రుసుములూ లేకుండానే బ్యాంకు ఓటీపీలు, బ్యాంకింగ్ అలర్ట్‌లు వంటివి పొందొచ్చని 'ఫోన్ అరెనా' పేర్కొంది. వైఫై నెట్‌వర్క్‌కు కనెక్ట్ అయ్యుండి, తమ స్మార్ట్‌ఫోన్‌లో వైఫై కాలింగ్ సదుపాయాన్ని యాక్టివేట్ చేసుకున్న యూజర్లు ఈ సదుపాయాన్ని పొందొచ్చు. అంటే కేవలం ముఖ్యమైన సందేశాలు పొందడం కోసం ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌ను యాక్టివేట్ చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ సదుపాయం తప్పిస్తుంది. ముఖ్యంగా విదేశాల్లో ఉన్నప్పుడు బ్యాంకు ఓటీపీలు, లావా దేవీలకు సంబంధించిన సమాచారం, ఏదైనా అకౌంట్‌లోకి లాగిన్ అవ్వాల్సిన సందర్భంలో వెరిఫికేషన్ సందేశాలు అవసరం అవుతుంటాయి. అలాంటప్పుడు మొబైల్‌లో ఈ సదు పాయం యాక్టివేట్ చేసుకుంటే సరిపోతుంది. అయితే, దేశీయంగా ఏదైనా రీఛార్జి ప్లాన్ యాక్టివ్‌లో ఉండాలి. అలాగే, వైఫై కాలింగ్ సదుపాయానికి ఆ స్మార్ట్‌ఫోన్ సపోర్ట్ చేస్తుండాలి.




## అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ కార్యాలయ స్థలాలకు భారీ గిరాకీ!

కొలియర్స్ నివేదిక

**న్యూఢిల్లీ:**దేశీయ కార్యాలయ స్థలాల విపణి 2026లో బలంగా ఉండబోతోందని కొలియర్స్ నివేదిక వెల్లడించింది. ఈ రంగ వృద్ధికి గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలు (జీసీసీలు), ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేసెస్ సహకరిస్తాయని పేర్కొంది. కార్యాలయ స్థలాల కార్యకలాపాల్లో బెంగళూరు, దిల్లీ-ఎన్‌సీఆర్, హైదరాబాద్ ముందుంటాయని తెలిపింది. ఖాళీ స్థలాలు తగ్గిపోవడంతో పాటు అద్దెలు పెరుగుతాయని అంచనా వేసింది. నివేదిక ప్రకారం..రెండు సంవత్సరాలుగా రికార్డు స్థాయిలో లీజింగ్ కార్యకలాపాలు నమోదు కాగా, ఈ ఏడాది కార్యాలయ స్థలాల విపణి మరింత స్థిరమైన వృద్ధి దశలో ఉండబోతోంది. ప్రీమియం, హరిత భవనాల వైపు ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ ఆపరేటర్లు మారుతున్నారు. సంస్థాగత పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి. ఈ దశాబ్దం చివరకు భారత ప్రీమియం ఆఫీస్ స్పేస్ 100 కోట్ల చదరపు అడుగుల స్థాయిని చేరుకుంటుంది. కార్యాలయ స్థలాల లీజింగ్, నిర్మాణ కార్యాకలాపాల్లో బెంగళూరు ముందంజలో ఉంది. మొత్తం గిరాకీ, 2026 సరఫరాల్లో ఈ నగరం వాటానే మూడో వంతు ఉంటుంది.. దిల్లీ ఎన్‌సీఆర్, హైదరాబాద్ కూడా కీలకంగా ఉన్నాయి. ఈ రెండు చోట్ల కూడా కార్యాలయ స్థలాలకు గిరాకీ, సరఫరా గణనీయంగా పెరుగుతున్నాయి. ఖాళీ స్థలాలు తగ్గిపోవడంతో, అద్దెలు క్రమంగా పెరుగుతున్నాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,44,600 | ₹ 1,57,750 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,75,000

# యుద్ధంలో వృద్ధ విమానం




**వాషింగ్టన్:**రెక్కలు చాచి గాల్లో ఎగిరితేనే అమెరికన్ ఫైటర్ యుద్ధవిమానాలకు అదనపు జవసత్వాలు అందుతాయి. సైనిక విమానాలకు గాల్లో ఇంధనాన్ని నింపే ఈ భారీ లోహవిహంగం.. ఇరాక్‌లో కుప్పకూలిన ఘటన దాని 'వార్ధక్యాన్ని' కళ్లకు కడుతోంది. ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి ఈ విమానాలు ఇంకా పెద్దసంఖ్యలో సర్వీసులో ఉన్నాయి. గతమెంతో ఘనకీర్తి కలిగిన ఈ ట్యాంకర్ల విశ్వసనీయత, మన్నికపై ప్రస్తుతం ఆందోళన వ్యక్తమవుతోంది. విమానాలకు గాల్లోనే ఇంధనం నింపడం వల్ల అవి ల్యాండింగ్ అవసరం లేకుండానే సుదీర్ఘ దూరం ప్రయాణం చేయగలుగుతాయి. మరింత ఎక్కువ సమయం గాల్లో కార్యకలాపాలు సాగించగలుగుతాయి. కేసీ-135 విమానం.. బోయింగ్-707 ప్రయాణికుల విమాన డిజైన్ ఆధారంగా రూపొందింది. ఇది 60 ఏళ్లుగా సర్వీసులో ఉంది. అమెరికా వైమానిక దళం, నౌకాదళం, మెరీన్ కోర్‌లకు సేవలు అందిస్తోంది. గత కొన్నేళ్లలో వీటికి అనేక అదనపు సొబగులు అద్దారు. అయినా ఈ ట్యాంకర్లు పాతబడిపోవడంతో వాటి విశ్వసనీయత ప్రశ్నార్థకంగా ఉంది. ఈ విమానాల ఉత్పత్తి చివరిసారిగా 1960లలో జరిగింది. ఇప్పటికీ అమెరికా వైమానిక దళం వద్ద 376 కేసీ-135 ట్యాంకర్లు ఉన్నాయి. యుద్ధంలో గాయపడినవారిని తరలించడానికి, నిఘా ఆపరేషన్లకూ ఈ కేసీ-135 ట్యాంకర్ విమానాలు ఉపయోగపడతాయి. ఈ విమానం పొడవు 136 అడుగులు. రెక్కల వెడల్పు 130 అడుగులు. ఇది గంటకు గరిష్ఠంగా 530 మైళ్ల వేగంతో పయనించగలదు. 50వేల అడుగుల ఎత్తు వరకూ వెళ్లగలదు. కేసీ-135లో ఒక పైలట్, కోపైలట్, బూమ్ ఆపరేటర్ ఉంటారు. వైద్యపరమైన మిషన్ల కోసం వెళ్లినప్పుడు నర్సులు, మెడికల్ టెక్నీషియన్లు కూడా ఇందులో పయనమవుతారు. ఇంధనాన్ని నింపే వ్యవస్థ.. ఈ విమానం వెనుకభాగంలో ఉంటుంది. బూమ్ ఆపరేటర్ కూడా అక్కడే ఉంటారు. తొలుత ఫ్యూయెల్ బూమ్‌ను కిందకి దించి.. వెనుక వస్తున్న యుద్ధవిమానాలు, బాంబర్లతో అనుసంధానిస్తారు. ఆ తర్వాత దాని ద్వారా వేగంగా ఇంధనాన్ని బట్వాడా చేస్తారు. ఇది చాలా సున్నితమైన ఆపరేషన్. ఇందులో రెండు విమానాలు నిర్దిష్ట వేగంతో కొనసాగాలి. ఈ ప్రక్రియను బూమ్ ఆపరేటర్.. కిటికీ గుండా పర్యవేక్షిస్తుంటారు.

కొన్ని కేసీ-135లు తమ రెక్కల్లోని పాడ్‌ల ద్వారా కూడా ఇతర విమానాలకు గాల్లో ఇంధనం నింపుతాయి. కేసీ-135 విమానం 90వేల లీటర్ల ఇంధనాన్ని ఇతర యుద్ధవిమానాలకు నింపగలదు. అవసరమైతే సరకులు లేదా ప్రయాణికులను చేరవేయడానికి ఈ విమానాల్లోని ఇంధన ట్యాంకుల ఎగువన ప్రత్యేక చోటు కూడా ఉంటుంది.

**గతంలోనూ ప్రమాదాలు..**

2013 మే 3: అఫ్గానిస్థాన్ యుద్ధంలో పాల్గొంటున్న కేసీ-135ఆర్ విమానం కిర్గిజిస్థాన్‌లోని చాల్దోవర్‌కు సమీపంలో టేకాఫ్ తర్వాత కూలిపోయింది. ఈ లోహవిహంగం.. రడ్డర్‌లో సమస్యలు తలెత్తాయి. దీంతో గాల్లోకి లేచాక విమానాన్ని స్థిరంగా ఉంచడానికి సిబ్బంది ఎంతో శ్రమించారు. అయినా విమాన తోకభాగం విరిగిపోయింది. అనంతరం ఆ లోహవిహంగం గాల్లోనే పేలిపోయింది. ఆ ప్రమాదంలో ముగ్గురు సిబ్బంది చనిపోయారు. 1966 జనవరి 17: కేసీ-135 ట్యాంకర్ల చరిత్రలో ఇదే అత్యంత పెద్ద దుర్ఘటన. నాడు స్పెయిన్‌లోని పాలోమెరెస్‌లో హైడ్రోజన్ బాంబులు మోసుకెళుతున్న ఒక బి-52 బాంబర్.. కేసీ-135 ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. ఫలితంగా ట్యాంకర్ విమానం కూలిపోయింది. అందులోని నలుగురు సిబ్బంది చనిపోయారు. బాంబరు విమానం కూడా ధ్వంసమై, అందులోని ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ బి-52లోని నాలుగు హైడ్రోజన్ బాంబుల్లో మూడు.. నేలపై పడ్డాయి. ఈ క్రమంలో వాటిలోని సంప్రదాయ పేలుడు పదార్థాలు విస్ఫోటం చెందాయి. దీనివల్ల రేడియోధార్మిక పదార్థమైన ప్లుటోనియం ఆ ప్రాంతంలో చెల్లాచెదురుగా పడింది. ఫలితంగా 2 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో రేడియోధార్మికత వ్యాపించింది. దీంతో అక్కడి నుంచి 1,750 టన్నుల రేడియోధార్మిక మట్టిను తొలగించి, అమెరికాకు తరలించారు. అయినా అక్కడ రేడియోధార్మికత కొనసాగింది. నాలుగో బాంబు మధ్యధరా సముద్రంలో పడింది. 80 రోజుల గాలింపు తర్వాత దాన్ని చెక్కుచెదరని స్థితిలో అమెరికా నౌకాదళ సిబ్బంది స్వాధీనం చేసుకోగలిగారు.

## చైనాకు తరలిస్తున్న రష్యా చమురు..

## భారత్ వైపు యూటర్న్



పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన భయాలు నెలకొన్న వేళ.. అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. చైనాకు తరలిస్తున్న రష్యా చమురు ట్యాంకర్ ఆక్వా టైటాన్ భారత్ వైపు మళ్లింది. సౌత్‌చైనా సముద్ర జలాల్లో అది యూటర్న్ తీసుకుంది. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను భారీగా పెంచిన నేపథ్యంలో.. ఈ ట్యాంకర్ మనదేశం వైపుగా వస్తోంది. కర్ణాటకలోని న్యూ మంగళూరుకు మార్చి 21న చేరుకోనుంది. షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. ఈయేడాది జనవరి చివరిలో బాల్టిక్ సీ పోర్ట్‌లో ఈ ట్యాంకర్‌లోకి చమురు లోడ్ అయింది. వాస్తవంగా ఇది చైనాలో రిజావో పోర్ట్‌కు వెళ్లాల్సిఉంది. రష్యా చమురు కొనుగోలుపై విధించిన పలు ఆంక్షలను ఇటీవల అమెరికా సడలించిన నేపథ్యంలో.. భారత్‌కు చమురు దిగుమతులు పెరిగాయి. దాంతో ఇప్పటివరకు దేశ రిఫైనరీలు 30 మిలియన్ల బ్యారెళ్ల చమురును కొనుగోలు చేశాయి. ఈ క్రమంలోనే ఆక్వా టైటాన్ భారత్ వైపు మళ్లింది. ఇక, జపాన్, దక్షిణకొరియా వంటి పలు దేశాలు కూడా మళ్లీ రష్యా చమురు దిగుమతులను పెంచడంతో ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

**హర్మూజ్‌ను దాటిన 90 నౌకలు..**

ఇరాన్ యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి చమురు ట్యాంకర్లు సహా 90 నౌకలు హర్మూజ్ జలసంధిని దాటాయి. ఈ విషయాన్ని మారిటైమ్ అండ్ ట్రేడ్ డేటా ప్లాట్‌ఫామ్స్ వెల్లడించాయి. ఈ నౌకలన్నీ తమ ట్రాకింగ్ వ్యవస్థలను ఆపేసి, డార్క్ మోడ్‌లో పాశ్చాత్య దేశాల ఆంక్షలను దాటుకొని హర్మూజ్ మీదుగా ప్రయాణించాయి. ఇలా మన నౌకలు కూడా ఆ జలసంధిని దాటి, పోర్టులకు చేరుకుంటోన్న సంగతి తెలిసిందే.

# 2 వారాలుగా స్థావరాలు మార్చినా.. ఇజ్రాయెల్ గురికి చిక్కిన లారిజానీ

టెహ్రాన్:

ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీని చంపేసి ఆ దేశాన్ని గట్టి దెబ్బకొట్టింది ఇజ్రాయెల్. యుద్ధం తొలిరోజున సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీని చంపేసిన తర్వాత టెహ్రాన్‌కు ఇంత భారీస్థాయిలో నష్టం జరగడం మళ్లీ ఇప్పుడే. ఖమేనీ మరణం తర్వాత నుంచి ఇజ్రాయెల్‌కు చిక్కకుండా లారిజానీ అనేకసార్లు స్థావరాలు మార్చినప్పటికీ.. పక్కా నిఘా సమాచారంతో ఐడీఎఫ్ అతడిని అంతమొందించింది.

**1600 కిలోమీటర్ల దూరంలో ఉన్నా..**

ఇరాన్‌లో అత్యంత శక్తిమంతమైన నేతగా లారిజానీకి పేరుంది. ఖమేనీ మరణం తర్వాత నుంచి ఇజ్రాయెల్ అతడిపై గురిపెట్టింది. కానీ, లారిజానీ కదలిక లను గుర్తించడం అంత తేలికైన పని కాదు. శత్రువులకు చిక్కకుండా దాక్కోవడంలో సిద్ధహస్తుడని పేరు. అందుకుతగ్గట్లుగానే గత రెండు వారాల నుంచి రహస్య ప్రాంతంలో ఉంటూ ఇరాన్ సైన్యాన్ని నడిపిస్తున్నారు. నిఘా వర్గాలకు దొరక్కుండా తరచూ స్థావరాలు మార్చినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. దీంతో లారిజానీని ట్రాక్ చేసేందుకు ఇజ్రాయెల్ ప్రత్యేక వ్యవస్థను రంగంలోకి దించింది. ఈ క్రమంలోనే అతడు కుమార్తె ఇంట్లో ఉన్నాడని తెలుసుకున్న నిఘా వర్గాలు ఐడీఎఫ్ దళాలకు సమాచారమిచ్చాయి. అనంతరం ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆలస్యం చేయకుండా ఆపరేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 1600 కిలోమీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను ఛేదించేందుకు యుద్ధ విమానాలను పంపారు. అత్యంత పక్కా సమాచారంతో ఐడీఎఫ్ దళాలు లారిజానీ ఉన్న ప్రాంతంలో వైమానిక దాడులు జరిపాయి. ఈ ఘటనలో లారిజానీతో పాటు అతడి కుమారుడు కూడా మృతి చెందాడు. ఇదిలాఉండగా.. లారిజానీ ఆపరేషన్ చేసిన సమయంలోనే ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సొల్మనీని కూడా ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. ఒకే సమయంలో పూర్తిగా వేర్వేరు ప్రాంతాల్లో విజయవంతంగా దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. సొల్మనీ ఇటీవల ఇరాన్‌లో జరిగిన అల్లర్లను అణచివేయడంలో కీలక పాత్ర పోషించాడు.



**ఎవరీ లారిజానీ..?**

1958లో జన్మించిన లారిజానీ ఇరాన్‌లో అత్యంత ప్రజాదరణ గల రాజకీయ కుటుంబం నుంచి వచ్చాడు. మాజీ సుప్రీంలీడర్ అలీ ఖమేనీకి కుడిభుజంగా వ్యవహరించిన ఆయన.. ఇరాన్ అణు కార్యక్రమంలో కీలకంగా పనిచేశాడు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా సేవలందించాడు. 2025లో ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల తర్వాత.. మళ్లీ సెక్యూరిటీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టాడు. తాజా ఇజ్రాయెల్-అమెరికా దాడులకు వ్యతిరేకంగా ఇరాన్ చేస్తోన్న పోరాటంలో తమ సైన్యాన్ని సమన్వయం చేశాడు. ఖమేనీ మరణం తర్వాత.. సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఎన్నికైన సంగతి తెలిసిందే. మత సిద్ధాంతాల కారణంగా ఆయన నియామకాన్ని లారిజానీ వ్యతిరేకించినట్లు సమాచారం.

## రజనీకాంత్‌పై వ్యాఖ్యలు.. క్షమాపణలు చెప్పిన టీవీకే నేత

చెన్నై:ప్రముఖ నటుడు రజనీకాంత్ రాజకీయ ప్రయత్నాలపై వ్యాఖ్యలు చేసిన టీవీకే పార్టీ జనరల్ సెక్రటరీ అదవ్ అర్జున వివాదంలో చిక్కుకున్నారు. తాజాగా ఆయన రజనీకి క్షమాపణలు చెప్పారు. ఆయనను కించపరిచే ఉద్దేశం తనకు లేదని వివరణ ఇచ్చారు. బుధవారం తమిళనాడు రాజధాని చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో మాట్లాడారు. "నా నాయకుడు (విజయ్)కు నాయకుడైన రజనీకాంత్‌ను కించపరిచే ఉద్దేశం నాకు ఏమాత్రం లేదు. అది డీఎంకే కుట్ర అని మాత్రమే నేను చెప్పాను. బహుశా.. ఆయన నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకొని ఉండొచ్చు. రజనీకాంత్ బాధపడి ఉంటారని ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. కానీ అక్కడ నా ఉద్దేశం వేరు. ఈ వ్యవహారం విచారాన్ని కలిగించింది" అని అర్జున క్షమాపణలు కోరారు "నాకు చాలా చిన్నవయసులోనే ఎన్నికలకు సంబంధించిన విధులు నిర్వర్తించే అవకాశం వచ్చింది. రజనీ తన రాజకీయ ప్రవేశం గురించి ప్రకటించిన వెంటనే 18 శాతం ఓటర్లు ఆయనవైపు మళ్లినట్లు అప్పట్లో సర్వేలు వెల్లడించినట్లు గుర్తించాను. అదొక గొప్ప విషయం. ఆ గణాంకాలు రజనీకాంత్ ప్రత్యర్థుల్లో భయాన్ని సృష్టించింది" అని తమిళనాడులోని రాజకీయ పార్టీలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.



**కింగ్ మేకర్ కానున్న దళపతి!**

ఇటీవల అర్జున ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. రజనీ రాజకీయాల్లో ప్రవేశించేందుకు ప్రయత్నించిన సమయంలో డీఎంకే పార్టీ ఆయనపై బెదిరింపులకు పాల్పడిందని ఆరోపించారు. ఈ విషయంలో తాను నటుడిపై విమర్శలు చేయాలనుకోవట్లేదని, ఇలాంటి ఒత్తిళ్లకు తమ నేత విజయ్ తలొగ్గరని చెప్పడమే తన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను డీఎంకే నేతలు ఖండించారు. అలాగే రజనీకాంత్ తీవ్రంగా స్పందించారు. "టీవీకేలో ఉన్నతస్థాయిలో ఉన్న నేత నాపై చేసిన వ్యాఖ్యలు అసత్యం. ఈ విషయంలో నేను చెప్పేది ఒక్కటే.. కాలం మాట్లాడకపోవచ్చు కానీ, సరైన సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానమిస్తుంది" అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే.

గురువారం
19 మార్చి 2026
జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY



## వేములవాడ రూ 46 లక్షలతో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

**వేములవాడను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతాం : మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 18 (జనంసాక్షి) :** రాజన్న క్షేత్రమైన వేములవాడను మాడల్ టౌన్ సిటీగా అభివృద్ధి చేసి భక్తులకు,స్థానికులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సుమారు రూ 46 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 11 మీటర్ల ఎత్తు గల విద్యుత్ స్తంభాల పనులను కమీషనర్ సంపత్ కుమార్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో వేములవాడ పట్టణ రూపురేఖలు మారుతున్నాయన్నారు.గతంలో రోడ్డు మధ్యలో ఉన్న పాత విద్యుత్ స్తంభాల వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలగడమే కాకుండా, రోడ్డు విస్తరణ పనులకు ఆటంకంగా మారాయని,ఈ సమస్యను గుర్తించి, అత్యాధునికమైన 11 మీటర్ల ఎత్తైన నూతన స్తంభాలను మంజూరు కావడంతో భవిష్యత్తులో విద్యుత్ లైన్ల నిర్వహణ సులభతరం కావడమే కాకుండా పట్టణ సుందరీకరణ జరుగుతుందన్నారు.త్వరితగతిన రోడ్డు వెడల్పు పనులను పూర్తి చేసి, వేములవాడను ఒక మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామన్నారుఅభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సెస్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రోహిత్ రెడ్డిపై కేసు రాజకీయ ప్రతీకారం

- పైలెట్ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న కాంగ్రెస్.. డ్రగ్స్ కేసులో కుట్రలు: బీఆర్ఎస్
- ఎఫ్ఐఆర్ నమోదులో అనుమానాలు.. సెక్షన్ల మార్పు ఆరోపణ
- వ్యక్తిగత ఆరోపణలు తగవు.. హుందాగా వ్యవహరించాలి
- షోకాజ్ నోటీసుకు సమాధానం ఇస్తాం.. పార్టీతో కట్టుబడి ఉంటాం



**తాండూరు (రంగారెడ్డి జిల్లా), మార్చి 18 (జనంసాక్షి):**
మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ప్రతిష్టకు కాంగ్రెస్ పార్టీ భంగం కలిగిస్తోందని బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. బుధవారం తాండూరులో బీఆర్ఎస్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మీ, నేతలు పట్లోళ్ల నర్సింలు, నరేందర్ గౌడ్ తదితరులు మాట్లాడుతూ.. ఈ నెల 15న రోహిత్ రెడ్డిపై నమోదైన డ్రగ్స్ కేసులో కుట్రలు దాగి ఉన్నాయని మండిపడ్డారు. సంఘటన 15వ తేదీన జరిగినట్లు చెబుతున్నా.. ఒక రోజు ముందే 14నే ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో అనుమానాలు ఉన్నాయని, డ్రగ్స్, తుపాకుల కాల్పుల సెక్షన్లను మార్చి కేసులో ఇరికించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తాండూరు నియోజకవర్గంలో పైలెట్ రోహిత్ రెడ్డికి ఉన్న మంచి ఇమేజ్‌ను దెబ్బతీయడమే ఈ కేసు లక్ష్యమని, దీనికి బీఆర్ఎస్ పార్టీని కూడా జోడించి బద్నామ్ చేయాలని కాంగ్రెస్ పన్నాగాలు వేస్తోందని విమర్శించారు.
2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని, రోహిత్ రెడ్డికి ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సమాధానం ఇస్తామని, పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని, రోహిత్ రెడ్డికి అండగా ఉంటామని నేతలు స్పష్టం చేశారు. డ్రగ్స్ కేసులో రిటెస్టు డిమాండ్ చేస్తున్నామని, రోహిత్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటపడతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు శోభారాణి, పరిమళ, వరాల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సలీం, కోట్‌పల్లి మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఉప్పరి మహేందర్, మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు అనిల్, సురేష్ నాయక్, జావిద్, నాయకులు సంతోష్ గౌడ్, రుద్రుపాటిల్, చంటి యాదవ్, వివిధ మండలాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వడగండ్ల భీభత్సం

**213 మేకల మృతి.. 30 లక్షలకు పైబడి పశుసంపద నష్టం**

- జీవనాధారం కోల్పోయిన ఆరు కుటుంబాలు
- ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన 6 గురు మేకల కాపరులు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్
- మేకలకు పోస్టుమార్టం నిర్వహించిన పశు వైద్య అధికారులు
- నష్టాన్ని అంచనా వేసిన తహసిల్దార్
- మేకల కాపర్లను ఆదుకుంటాం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**వికారాబాద్ జిల్లా బ్యూరో/ పూడూర్ మార్చి 18 (జనం సాక్షి):**
ఉరుములు మెరుపులు ఈదుదు గాలులు పిడుగులతో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఈ వాన వల్ల రైతులకు కడగండ్లు మిగిలింది. అకాల వర్షం బీభత్సం సృష్టించిన కారణంగా చేతికొచ్చిన చేతికి రావలసిన పంటలు దెబ్బతినగా. పొలంలో మేత కోసం వెళ్ళిన మేకలపై వడగండ్ల వాన విసిరిన పంజాతో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని చౌడాపూర్ మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. మంగళవారం రాత్రి కురిసిన వడగండ్ల వాన కారణంగా చౌడపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మేకల కాపర్ల 213 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. వడగండ్ల దెబ్బకు మరిన్ని మేకలు మృతి వాతపడే అవకాశం ఉంది. ఆరుగురు మేకల కాపర్లు పూడూరు మండలం నిజాంపేట మేడిపల్లి 250 మేకలను తోలుకొని మేత కోసం ఆ పరిసరాల ప్రాంతానికి వచ్చారు. చీకటి పడడంతో పొలంలోనే మేకలను ఒకచోట చేర్చి మందవేశారు. రాత్రివేళ క్రూర జంతువులు మేకల పై దాడి చేయకుండా వలలు ఏర్పాటు చేసి కాపలాగా మేకల కాపర్లు ఆరుగురు ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి అకాల వర్షం వడగండ్లతో బీభత్సం సృష్టించింది. దీంతో మేకల కాపర్లు తలదాచుకోవడానికి గుడిసెలోకి పరిగెత్తారు. కానీ దాదాపు 250 పైగా మేకలు మేకల కాపర్లు వేసిన వల వలయంలో చిక్కుకున్నాయి. భీకరంగా కురిసిన వడగండ్ల వాన దెబ్బ వల్ల అక్కడికక్కడే 213 మేకలు మృతి చెందాయి. మిగతా కొన్ని మేకలు వడగండ్ల దెబ్బకు మృత్యువుతో పోరాడుతున్నాయి. ఈ విషయం తెలియగానే వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి విచారణకు ఆదేశించారు. పూడూరు తాసిల్దార్ విజయ్ కుమార్ పశు వైద్యశాల డాక్టర్లు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. కొన ఊపిరితో మృత్యువుతో పోరాడుతున్న మేకలకు ప్రాథమిక చికిత్స అందించారు. వడగండ్ల వాన మృతి చెందిన మేకలను పోస్టుమార్టం నిమిత్తం పశు వైద్యశాలకు ట్రాక్టర్ లో తరలించారు. కొత్తపల్లి కి చెందిన మేకల కాపర్లు యాదమ్మ కేశవులు గోపాల్ యాదయ్య జంబుల యాదయ్యలు ఒకచోట చేరి మేకలను మేపుకొని జీవనోపాధి గడుపుతున్నారు. ఒకేసారి ఆరు కుటుంబాలకు చెందిన మేకలు మృతి చెందడంతో వారి కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉంది. అకాల వర్షం కారణంగా మృతి చెందిన మేకలకు నష్టపరిహారం చెల్లించి వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే వర్షం వలన నష్టపోయిన పంటలను అంచనా వేయాలని కోరారు. పోస్టుమార్టం అనంతరం సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేస్తామని తాసిల్దార్ విజయ్ కుమార్ పశు వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్లు తెలియజేశారు. ఒకేసారి తమ బతుకు జీవనాధారమైన మేకలు మృత్యువాత పడడంతో మేకల కాపర్ల బాధ వర్ణానితం. వీలైనంత త్వరగా ప్రభుత్వం మేకల కాపరులను ఆదుకుంటుందని అందరం ఆశిద్దాం....

## తెలంగాణలో ద్వివిధ మైలురాయిని నెలకొల్పిన ఎస్‌బీఐ

- టీజీబీ ప్రధాన కార్యాలయ శంకుస్థాపన, వరంగల్‌లో సీఎస్ఆర్ కార్యక్రమాలు







**హైదరాబాద్/వరంగల్ (జనంసాక్షి) :**
దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ బీఐ), తెలంగాణ వృద్ధి, అభివృద్ధి పట్ల తన నిరంతర నిబద్ధతలో భాగంగా ఒక కీలక మైలు రాయిని చేరుకుంది. బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి నేతృత్వంలో రెండు కీలక కార్యక్రమాలను ఈ సందర్భంగా చేపట్టారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) కొత్త ప్రధాన కార్యాలయ భవనానికి ఛైర్మన్ శంకుస్థాపన చేశారు. అలాగే వరంగల్‌లో పలు ప్రధాన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలను ప్రారంభించారు. తద్వారా ఆర్థిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, సమాజంపై సానుకూల ప్రభావం చూపడం అనే ఎస్బీఐ ద్వివిధ లక్ష్యాలను ఆయన మరింత సుస్థిరం చేశారు. ఎస్బీఐ ఆధ్వర్యంలో నడుస్తున్న 9 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులలో (ఆర్ఆర్ బీలు) తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఒకటి. డిసెంబర్ 31, 2025 నాటికి 34,659 కోట్ల డిపాజిట్లు, 45,008 కోట్ల రుణాలతో కలిపి మొత్తం 79,667 కోట్ల వ్యాపారాన్ని నమోదు చేయడం ద్వారా, ఈ బ్యాంక్ దేశంలోనే అత్యంత లాభదాయకమైన, అగ్రగామి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులలో ఒకటిగా అవతరించింది. తెలంగాణలోని గ్రామీణ మరియు పాక్షిక పట్టణ ప్రాంతాలలో విస్తరించి ఉన్న 933 శాఖల నెట్‌వర్క్ ద్వారా, ఈ బ్యాంక్ 90 లక్షల మందికి పైగా వినియోగదారులకు సేవలు అందిస్తోంది.
తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కొత్త ప్రధాన కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమం, బ్యాంక్ పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడంలోనూ, తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తున్న బ్యాంక్ కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడంలోనూ ఒక కీలకమైన ముందడుగుగా నిలుస్తుంది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ఎస్బీఐ ఎండీ అశ్విని కుమార్ తివారీ, ఆర్బీఐ హైదరాబాద్ ప్రాంతీయ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, నాబార్డు తెలంగాణ ఆర్ఓ సీజీఎం ఉదయ భాస్కర్, ఎస్బీఐ కార్పొరేట్ సెంటర్ సీజీఎం (ఏఅండ్ఎస్) అతుల్ శ్రీవాస్తవ, ఎల్ హెచ్ఓ హైదరాబాద్ సీజీఎం రాధాకృష్ణన్, తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రాయి రవి, బ్యాంక్ బోర్డు డైరెక్టర్ల సభ్యులు మరియు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమ్మిళిత అభివృద్ధి పట్ల తన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తూ, ఎస్ బీఐ తన వరంగల్ పరిపాలనా కార్యాలయం వద్ద పలు కీలకమైన సీఎస్ఆర్ కార్యక్రమాలను ప్రకటించింది. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల మౌలిక సదుపాయాల సమగ్ర అభివృద్ధి కోసం సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్‌కు రూ.75 లక్షల గ్రాంటును, వయో వృద్ధుల జీవన నాణ్యత, భద్రత, సౌకర్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో సహృదయ వృద్ధాశ్రమంలో కీలకమైన పునరుద్ధరణ పనుల కోసం రూ.17.5 లక్షల గ్రాంటును బ్యాంక్ అందజేసింది.
సభను ఉద్దేశించి చల్లా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. అర్థవంతమైన సామాజిక ప్రభావాన్ని చూపడంలో ఎస్‌బిఐ పాన్-ఇండియా సిఎస్ఆర్ కార్యకలాపాల వ్యూహాత్మక ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పిహెచ్‌సి) మెరుగుపరచడం, రుతుస్రావ పరిశుభ్రతను ప్రోత్సహించడం వంటి బ్యాంక్ కీలక సిఎస్ఆర్ ప్రాధాన్యతా రంగాలను ఆయన వివరించారు. సామాజిక బాధ్యత, ఆర్థిక సమ్మిళితం పట్ల ఎస్‌బిఐకి ఉన్న బలమైన నిబద్ధతను శెట్టి పునరుద్ఘాటించారు. వెనుకబడిన వర్గాలకు మద్దతు ఇవ్వడం ఎస్‌బిఐ లక్ష్యంలో అంతర్భాగంగా ఉంటుందని ఆయన నొక్కి చెప్పారు. డిజిటల్ ఆవిష్కరణలు, వినియోగదారుల-కేంద్రీకృత సేవలు, లోతైన గ్రామీణ విస్తరణ ద్వారా తెలంగాణలో ఎస్‌బిఐ తన ఉనికిని విస్తరిస్తూనే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 1,337 శాఖలతో, వ్యవసాయం, ఎంఎస్ఎంఇలు, స్వయం సహాయక బృందాలకు ప్రత్యేక మద్దతు ఇవ్వడం ద్వారా బ్యాంక్ లాస్ట్-మైల్ కనెక్టివిటీని బలోపేతం చేస్తోంది. ఈ ప్రయత్నాలు తెలంగాణలో పటిష్టమైన ఆర్థిక మౌలిక సదుపాయాలను నిర్మించడానికి, సమ్మిళిత, సుస్థిర వృద్ధిని పెంపొందించడానికి ఎస్‌బిఐ నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తాయి.

## ఏసిబి వలలో ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్

- బెల్లం వ్యాపారి వద్ద అక్రమ వసూళ్లు
- బినామీతో యూపిఐ లావాదేవీలతో డబ్బుల మళ్లింపు
- ఏసిబి సోదాల్లో రూ.20 లక్షలు స్వాధీనం



**కరీంనగర్ బ్యూరో, మార్చి 18 (జనంసాక్షి) :**
ఏసిబి దూకుడు ప్రదర్శిస్తోంది. అధికారులే టార్గెట్‌గా ఏసిబి దాడులు చేస్తుండడంతో అవినీతి అధికారుల్లో గుబులు రేపుతోంది. తాజాగా కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ గుండేటి రామును మంగళవారం రాత్రి ఏసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఉపాధ్యాయులుగా కలిసి పనిచేసిన పుటి స్నేహితుడి హితం కోసం లంచం వసూళ్లకు సహకరించిన ఓ టీచర్ సైతం అరెస్టు కావడం సంచలనంగా మారింది. కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గుండేటి రాము, జక్కని వేణులు గతంలో సెకండరీ గ్రేడ్ టీచర్‌లుగా కలిసి పనిచేశారు. ఆ తరువాత రాము ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్గా ఉద్యోగం సాధించాడు. ఉపాధ్యాయులుగా కలిసి పని చేసినప్పటి స్నేహాన్ని ఆసరాగా తీసుకున్న రాము, జక్కని వేణు అకౌంట్ ద్వారా తన మామూళ్లు వసూలు చేసుకోవడం మొదలు పెట్టాడు. దీనికి వేణు సమ్మతించాడు. గుండేటి రాము గతంలో వేములవాడ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్నప్పుడు బెల్లం వ్యాపారుల నుంచి ప్రతినెల లంచం తీసుకునేవాడు. అయితే మామూళ్లు నేరుగా తీసుకోకుండా అతని స్నేహితుడు ఒబులాపూర్‌లో ఎస్‌జిటిగా పనిచేస్తున్న జక్కని వేణు అకౌంట్‌కు యూపై పేమెంట్ వేయించుకున్నారు. 2019 నుంచి 2024 ఫిబ్రవరి వరకు యూపిఐ లావాదేవీల ద్వారా జక్కని వేణుకు చెందిన ఎస్‌బిఐ, యుబిఐ ఖాతాలకు నగదును బదిలీ చేయించుకున్నారు. ఆ తరువాత డబ్బును ఎక్సైజ్ ఇన్స్ పెక్టర్ గుండేటి రాము, అతని తండ్రి అకౌంట్లకు టీచర్ జక్కని వేణు బదిలీ చేశారు. కాగా గుండేటి రామును ఏసిబి డిజిపికి ఫిర్యాదులు అందడంతో సమగ్రంగా విచారణ చేసిన ఏసిబి అధికారులు రాముతో పాటు అతనికి సహకరించిన టీచర్ వేణును అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్‌కు బినామీగా వ్యవహరించినట్లు ఏసిబి అధికారులు గుర్తించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు సమగ్ర విచారణ చేసి గుండేటి రాము ఇంట్లో సోదాలు చేయగా లెక్కలు లేని రూ. 20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏసిబి అధికారులు వెల్లడించారు. ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ గుండేటి రామును, టీచర్ జక్కని వేణులను అరెస్టు చేసి కరీంనగర్ ఏసిబి ప్రత్యేక కోర్టులో హాజరు పరిచినట్లు ఏసిబి అధికారులు తెలిపారు.


## అసెంబ్లీ ముట్టడిస్తారని రైతు నాయకుల ముందస్తు అరెస్ట్

**మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలఏర్పాటుపై రైతన్నల ఉద్యమ బాట**

**కథలాపూర్, మార్చి 18(జనం సాక్షి):** జగిత్యాల రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో మొక్కజొన్న కేంద్రాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తో అసెంబ్లీ ముట్టడి కి సమాయాత్తమైన రైతు నాయకులను ఉదయం నుండి ముందస్తు అరెస్ట్ లకు తెరదీశారు పోలీసు యంత్రాంగం, జిల్లా కేంద్రానికి దగ్గర ఉండే రైతు ఐక్య వేదిక గౌరవ అధ్యక్షులు పన్నాల తిరుపతి రెడ్డి, బందెల మల్లయ్య లను జగిత్యాల రూరల్ పోలీస్‌లు, రైతు ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు నల్ల రమేష్ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి లను ఇబ్రహీంపట్నం,చెరుకు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షులు మామిడి నారాయణ రెడ్డి, మారు మురళీ ధర్ రెడ్డి, గురిజాల రాజి రెడ్డిలను మెట్ పెల్లిలో, కొడుమ్యాల లో నరసింహ రెడ్డి,భూషణ్ రావు పేట్ సర్పంచ్ బద్దం మహేందర్ రెడ్డి, రిక్కల సంజీవ్, గడ్డం శేఖర్, కందిరి కిషన్ లను కథలాపూర్, నేరెళ్ల భూమా రెడ్డి లను మాల్యాల పోలీస్ లు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పన్నాల తిరుపతి రెడ్డి గారు మాట్లాడుతూ రైతు పండించిన మక్కల కు మద్దతు ధర 2400 అయితే బహిరంగ మార్కెట్ లో 1600-1800 మాత్రమే పెడుతూ దళారులు రైతులను మోసం చేస్తుంటే మార్క్ ఫెడ్ ద్వారా మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చెయ్యాలని 15 రోజుల క్రితం జిల్లా అడిషనల్ కలెక్టర్ గారికి ప్రజావాణిలో వినతిపత్రం ఇవ్వడంతో పాటు, మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.
అయినా నిర్లక్ష్యం వీడకపోవడంతో అసెంబ్లీ ముట్టడికి సిద్దమైన రైతు నాయకులను ఇలా ముందస్తు అరెస్ట్ లు చేయడం హేయమైన చర్య అని, ఓ వైపు వాతావరణ శాఖ సైతం 15 రోజుల క్రితమే అకాల వర్షాల హెచ్చరిక లు జారీ చేసిన నేపథ్యంలో, రెండు రోజుల నుండి రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు పండిన పంటను నష్టపోయే పరిస్థితి దృష్ట్యా ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు, రైతుల కోసం పోరాడుతున్న రైతు నాయకులను ఇలా ముందస్తు అరెస్ట్‌లు చేయడంలో ఉన్న శ్రద్ధ కొనుగోలు కేంద్రాలపై పెట్టాలని హెచ్చరించారు.

## కేసుల విచారణలో నాణ్యతే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలి

- సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు వివరాలను అప్‌డేట్ చేయాలి
- బాధితులకు సకాలంలో న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత
- ఎఫ్ఐఆర్ నుండి చార్జ్‌షీట్ వరకు ప్రతి అంశం స్పష్టంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 18 (జనం సాక్షి) :**
జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర స్టేషన్ రైటర్లు, సీఐలు మరియు డీఎస్పీ కార్యాలయాల రైటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కేసుల దర్యాప్తులో స్టేషన్ రైటర్ల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. వారి పనితీరులో నాణ్యత ఉన్నప్పుడే నేరస్తులకు శిక్షలు పడటంతో పాటు బాధితులకు త్వరితగతిన న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. రైటర్లు కేవలం సమాచారాన్ని నమోదు చేసే వారు మాత్రమే కాకుండా, శాస్త్రీయ ఆధారాలను సమగ్రంగా క్రోడీకరించి కేసును బలోపేతం చేసే ప్రధాన భాగస్వాములని కొనియాడారు.ముఖ్యంగా కేసుల దర్యాప్తు మరియు విచారణలో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. దర్యాప్తు పటిష్టంగా ఉంటేనే నేరస్తులకు శిక్షలు పడతాయని, తద్వారా సమాజంలో పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా సీసీటీఎన్ఎస్‌లో కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్త అవసరమని, తప్పుడు వాంగ్మూలాలు కేసు దిశను ప్రభావితం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు.
ప్రతి కేసులో సాక్ష్యాధారాలు బలంగా ఉండేలా రైటర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి అంశాన్ని సమగ్రంగా, ఎటువంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. బాధితులకు సకాలంలో న్యాయం అందించడమే పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంచే ప్రధాన అంశమని, అందుకోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల రైటర్లు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం క్షేత్రస్థాయి పరిశీలన

- జిల్లాలో 7 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు : జిల్లా కలెక్టర్
- ఫ్యాక్టరీ ఏర్పాటైతే రైతులకు భారీ లాభాలు, ఉపాధి అవకాశాలు
- ఎకరానికి రూ.2 లక్షలకు పైగా ఆదాయం సాధ్యం : ప్రభుత్వ సలహాదారు, శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి



**నిజామాబాద్ బ్యూరో, మార్చి 18 (జనంసాక్షి):**
వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును విస్తరించి రైతులకు స్థిరమైన, అధిక లాభదాయక ఆదాయ మార్గం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి, బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి నిరంతర కృషి చేస్తున్నారు. ఈ దిశగా జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని రైతులను ప్రోత్సహిస్తున్న ఫలితంగా ప్రస్తుతం జిల్లాలో సుమారు 7 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరుగుతోంది. ఇప్పుడు ఈ పంట సాగును మరింత బలోపేతం చేయడమే కాకుండా జిల్లాలోనే ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటు చేయించాలనే పట్టుదలతో సుదర్శన్ రెడ్డి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా తదితర ఉన్నతాధికారులతో కలిసి ఆయిల్ పామ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. స్థలాల వివరాలతో కూడిన పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. త్వరలో స్థల నిర్ధారణ పూర్తయ్యాక ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని వెల్లడించారు.
ఈ సందర్భంగా మాట్లాడిన ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, జిల్లాకు ఆయిల్ పామ్ పరిశ్రమ మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో ఇప్పటికే చర్చించినట్లు, ఆయన సానుకూల స్పందన తెలిపినట్లు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంత త్వరగా అనువైన స్థలాన్ని ఖరారు చేయాలని అధికారులను కోరారు. ఫ్యాక్టరీ ఏర్పడితే పెద్ద ఎత్తున రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వస్తారని, రైతులకు భారీ లాభాలతో పాటు జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగి పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.
ఆయిల్ పామ్ పంటకు వంట నూనె తయారీతో పాటు వివిధ ఉత్పత్తుల్లో భారీ డిమాండ్ ఉందని సుదర్శన్ రెడ్డి గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా 75 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరగాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 10 శాతం విస్తీర్ణంలోనే ఉందని, దీంతో విదేశాల నుండి పెద్ద ఎత్తున నూనె దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని వివరించారు. స్థానికంగా విస్తృతంగా సాగు చేస్తే రైతులకు అధిక ఆదాయం, దేశానికి నూనెలో స్వావలంబన వస్తుందన్నారు. ప్రభుత్వం రాయితీలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, మొక్కల వ్యయంలో అధిక భాగం భరిస్తూ సహకరిస్తోందని, ఆయిల్ పామ్ బోర్డు ద్వారా మద్దతు ధరకు కొనుగోలు భరోసా ఉందని తెలిపారు. ఎకరానికి సుమారు 10 టన్నుల దిగుబడి, అంతర పంటలతో అదనపు ఆదాయం సాధ్యమని, ప్రస్తుత ధరల ఆధారంగా ఎకరానికి రెండు లక్షల రూపాయలకు పైగా ఆదాయం రావచ్చని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ పరిశీలనలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, రమణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే ఎన్‌కౌంటర్ చేయండి

- పోలీసులకు సవాల్.. ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ హతం
- బీహార్ చంపారణ్‌లో ఘటన



పాట్నా, మార్చి18 (జనంసాక్షి) : తనను ఎన్‌కౌంటర్ చేసేందుకు ప్లేసు, టైం చెప్పాలంటూ ఒక గ్యాంగ్‌స్టర్ పోలీసులకు సవాల్ విసిరాడు. తర్వాత పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఈ ఘటన బిహార్‌లోని చంపారణ్ జిల్లా మోతిహరి పట్టణ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రాంతంలో కుందన్ ఠాకూర్ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ అనేక నేరాలకు పాల్పడ్డాడు. దీంతో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా ఠాకూర్, అతడి గ్యాంగ్ అజ్ఞాతంలో ఉన్నారు. ఇటీవల ఠాకూర్ పోలీసులకు సవాల్ విసిరాడు. వారిని హెచ్చరిస్తూ ఆడియో సందేశాలు పంపాడు. ముఖ్యంగా చకియా పోలీస్ స్టేషన్ ఆఫీసర్‌కు నేరుగా హెచ్చరికలు జారీ చేశాడు. తనను పట్టుకునేందుకు ఎంత మంది పోలీసులు వచ్చినా వారి అంతుచూస్తానని, దమ్ముంటే ప్లేస్, టైం చెప్పాలంటూ సవాల్ విసిరాడు. తనను ఎన్‌కౌంటర్ చేయాలనుకుంటే ఎందరో పోలీసుల ప్రాణాలు పోతాయని హెచ్చరించాడు. పోలీసులు తన కుటుంబాన్ని వేధిస్తున్నారని, వాటిని ఆపకుంటే తాను కూడా పోలీసుల కుటుంబాల అంతు చూస్తానని వార్నింగ్ ఇచ్చాడు. తాను పారిపోవడం లేదని, ఎన్‌కౌంటర్‌లో ఎంతమంది పోలీసుల్నైనా ఎదుర్కొంటానన్నాడు. ఇది హెచ్చరిక కాదని, సలహా మాత్రమే అని చెప్పుకొచ్చాడు. అయితే, అప్పటికే అతడి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులకు తగిన సమాచారం అందింది. ఠాకూర్, అతడి అనుచరులు ఉన్న ప్రదేశం గురించి సమాచారం అందుకున్న ప్రత్యేక బృందం ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టింది. ఈ క్రమంలో ఠాకూర్ గ్యాంగ్ రెచ్చగొట్టే చర్యలకు దిగింది. దీంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఇరుపక్షాల మధ్య జరిగిన కాల్పుల్లో ఒక ఎస్టీఎఫ్ జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయాడు. తమ సహచరుడు మరణించినప్పటికీ పోలీసులు ఠాకూర్ అండ్ గ్యాంగ్‌కు వ్యతిరేకంగా కాల్పులు జరిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో కుందన్ ఠాకూర్‌తోపాటు మరో ఇద్దరు క్రిమినల్స్ కూడా హతమయ్యారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు సంస్థ షాక్

- ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్ రద్దు

హైదరాబాద్, మార్చి18 (జనంసాక్షి) : ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిగ్ షాక్ ఇచ్చింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇకపై ఉద్యోగులు, వారి జీవిత భాగస్వామి.. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నా ఈ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వబోమని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీఎస్‌ఆర్టీసీ సర్క్యులర్ జారీ చేసింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద స్పెషల్ క్యాజువల్ లీవ్ మాత్రమే కొనసాగుతుందని తెలిపింది. ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. గతంలో ఈ స్కామ్ ద్వారా కుటుంబ నియంత్రణను ప్రోత్సహించేవారు.

# సింగిల్ విండో మాజీ చైర్మన్ ఆత్మహత్య



నాగర్ కర్నూల్, మార్చి18 (జనంసాక్షి) : మండలంలోని వనపట్ల గ్రామానికి చెందిన నాగర్ కర్నూల్ మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి(60) ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం భార్య, కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో తన కంకర క్రషర్ వద్ద ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన భార్య గమనించి కొల్లాపూర్ చౌరస్తాలోని గాయత్రి హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ రెడ్డి గతంలో నాగర్ కర్నూల్ వైస్ ఎంపీపీగా పనిచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సింగిల్ విండోగా బాధ్యతలు చేపట్టిన ఆయన అనంతరం పదవి ముగిసిపోయే వరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. ఆయన ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# వైష్ణవి హత్య కేసులో రిమాండ్‌కు హరిబాబు



జగిత్యాల, మార్చి 18 (జనంసాక్షి) : జగిత్యాల జిల్లాలో సంచలనం సృష్టించిన యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో తాజా పరిణామాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటూ అందరినీ అలరించిన ఓ యువతి, అదనపు కట్నం వేధింపులకు బలి కావడం అత్యంత విచారకరం. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించి నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడు హరిబాబు, వైష్ణవిని అదనపు కట్నం కోసమే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ హత్య కేవలం హరిబాబు ఒక్కడే చేశాడా..? లేదా కుటుంబ సభ్యుల ప్రోద్భలం ఏమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో లభించిన క్లూస్, ఫోరెన్సిక్ ఆధారాలు ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించనున్నాయి. వరకట్న వేధింపులు లాంటి కేసుల్లో నిందితులకు కఠినమైన శిక్ష పడితేనే, భవిష్యత్తులో ఇటువంటి అకృత్యాలను అరికట్టే అవకాశం ఉంటుందని పలువురు చెబుతున్నారు.

# అక్కను హత్య చేసిన తమ్ముడు

- పోలీస్ విచారణలో నేరం అంగీకారం

హైదరాబాద్, మార్చి18 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో దారుణం చోటుచేసుకుంది. అక్క ప్రవర్తన సరిగా లేదనే కోపంతో ఆమెను తమ్ముడు హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలు చేసి చెరువులో పడేశాడు. కొన్నాళ్ల క్రితం భర్త చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆ తర్వాత ఆమె ప్రవర్తనలో మార్పును తమ్ముడు పప్పు రామ్ గమనించాడు. తీరు మార్చుకోవాలని చెప్పినా.. వినిపించుకోకపోవడంతో ఆమెను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రెండు ముక్కలుగా చేసి మజీద్‌పూర్ చెరువులో పడేశాడు. గత నెల 28న ఆమె బాటసింగారంలోని కిరాణ దుకాణానికి వెళ్లి కనిపించకుండా పోయినట్లు పోలీస్ స్టేషన్‌లో తమ్ముడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టడంతో హత్య వ్యవహారం బయటపడింది.

# గుజరాత్ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు

గాంధీనగర్, మార్చి18 (జనంసాక్షి) : గుజరాత్ అసెంబ్లీకి బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ మెయిల్ ద్వారా బెదిరింపులు రావడంతో అసెంబ్లీ ఆవరణలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. బాంబు స్క్వాడ్‌లతో తనిఖీలు చేయించగా.. ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రవి తేజ వాసంశెట్టి మీడియాతో మాట్లాడుతూ.. 'ఈరోజు ఉదయం గుజరాత్ అసెంబ్లీ కాంప్లెక్స్‌కి ఈమెయిల్ బాంబు బెదిరింపులు వచ్చాయి. వెంటనే బాంబు నిర్వీర్యం చేసే దళాలు తనిఖీ చేశాయి. అయితే ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది' అని ఆయన అన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఉండొద్దు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- యాసంగి వరి ధాన్యం కొనుగోలుపై వివిధ శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్



హనుమకొండ ప్రతినిధి మార్చి 18 (జనం సాక్షి) :యాసంగి వరి ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులు ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో యాసంగి వరి ధాన్యం సేకరణ పై వ్యవసాయ శాఖ. సివిల్ సప్లై మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ రైతులు యాసంగి వరి ధాన్యాన్ని విక్రయించే నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో ధాన్యము డబ్బులను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో గన్నీ సంచులు కొరత లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామ సమాఖ్య సంఘాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని నేరుగా మిల్లర్ల వద్దకు గాని ఎఫ్ సి ఐ కొనుగోలు కేంద్రం వద్ద గాని సకాలంలో డంపింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సొసైటీ గ్రామ సెక్రెటరీ, సెంటర్ ఇన్చార్జిలు, నోడల్ ఆఫీసర్, స్పెషల్ ఆఫీసర్ సమన్వయంతో పనిచేసి సరియైన రీతిలో రైతుల వద్ద వివరాలు సేకరించి ఆయా రైతులు ధాన్యాన్ని ఎక్కడికి తరలించాలో టోకెన్ పద్ధతి ద్వారా ముందుగానే తెలియజేయాలని అన్నారు. రైతుల ఆధార్ నెంబర్ ఆధారంగా ధాన్యం వివరాలు, వెహికల్ నెంబర్, సాగు చేసిన విస్తీర్ణం అమ్మకానికి వచ్చిన ధాన్యం వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సక్రమంగా నమోదు చేయడం ద్వారా రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం విక్రయించడం జరుగుతుందని ఆమె తెలిపారు మిల్లర్లకు పోయే ధాన్యం తిరిగి పంపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా మొత్తంలో హమాలీలకు రేటును నిర్ధారించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణలో సంబంధిత శాఖలు సమన్వయంతో ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అనురాధ, ఇతర శాఖల అధికారులు, ఐకెపి కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

- ఎందుకు దోషులను పట్టుకునే ప్రయత్నం చేయలేదు
- కడప ఎంపి సీటు కోసమే వివేకా హత్యజరిగింది
- పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు వ్యాఖ్యలు



విశాఖపట్నం, మార్చి18 (జనంసాక్షి) : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల పాలనలో జగన్ ఎందుకు ఈ కేసును తేల్చలేక పోయారని అన్నారు. దీనికి ఎందుకు న్యాయం చేయలేదని నిలదీసారు. బుధవారం విశాఖపట్నంలో షర్మిల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి.. వివేకా కుమార్తె సునీత మీద చేసిన వ్యాఖ్యలకు తాను చాలా బాధపడ్డానని అన్నారు. వివేకాకు గుండెపోటు వచ్చిందని సునీతనే చెప్పారని.. అవినాశ్‌రెడ్డి మాట్లాడటం చాలా దారుణమని అన్నారు. అవినాశ్‌రెడ్డికి పలుకుబడి, డబ్బు ఉందని, ఎన్ని తప్పులు చేసిన తప్పించుకోవచ్చని అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాను చేతిలో పెట్టుకుని వ్యక్తిత్వ హననం చేయాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. వివేకానంద గుండెపోటుతో చనిపోయారని సాక్షి మీడియాలోనే మొదటగా ప్రచారం చేశారని షర్మిల ప్రస్తావించారు. స్థానికంగా ఉన్న అవినాశ్‌రెడ్డి, సాక్షి యజమాని భారతిరెడ్డి ఎందుకు గుండెపోటని ప్రచారం చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ హత్య ముమ్మాటికీ కడప ఎంపీ టిక్కెట్టు విషయంలోనే జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై వివేకానంద స్వయంగా తనతో చర్చించారని తెలిపారు. అవినాశ్‌రెడ్డికి టిక్కెట్టు ఇస్తే, వివేకానంద సపోర్ట్ చేశారని గుర్తుచేశారు. ఎప్పటికైనా వివేకానంద బతికి ఉంటే, తనకు ఇబ్బంది అవుతుందనే కారణంతోనే అవినాశ్‌రెడ్డి ఈ హత్య చేశారని ఆరోపించారు. వివేకా హత్య కేసులో మొదటగా సీబీఐ విచారణ కావాలని జగన్ అన్నారని, ఆ తర్వాత వద్దని కూడా ఆయనే చెప్పారని తెలిపారు. వివేకా కేసును సిట్ అధికారులతో విచారణ చేయిస్తే సరిపోతుందని జగన్ చెప్పారని అన్నారు. ఈ కేసులో సీబీఐ అన్ని ఆధారాలను సేకరించిందని, ప్రధానంగా అవినాశ్‌రెడ్డి పేరును ప్రస్తావించిందని తెలిపారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఎందుకు ఒక్క ఆధారం కూడా బయటపెట్టలేక పోయారని ప్రశ్నల వర్షం కురిపించారు. సునీతారెడ్డి చంద్రబాబు కోసం పనిచేస్తున్నారని చెబుతూ.. అవినాశ్‌రెడ్డిని కాపాడుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని షర్మిల అన్నారు. సునీతకు ప్రాణహాని ఉందని, అయినా ఆమె పోరాటం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తన తండ్రి హత్య వెనుక ఉన్న నిజాన్ని బయటకు తీసుకురావాలని సునీత పోరాటం చేస్తున్నారని అన్నారు. 'జగన్ అన్నకు కూసింతైనా కనికరం లేదా..? ఇలాంటి అన్న ఉంటే శత్రువులు అనవసరం.. అన్నా అనే పదానికే ఆయనో కళంకం. జగన్ మోహన్‌రెడ్డి బాధితులపట్ల కాకుండా నిందితులపట్ల నిలబడ్డారనే విషయం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తెలిస్తే ఎంతగానో బాధపడేవారు. వివేకా హత్య కేసులో న్యాయం కోసమే చంద్రబాబును కలిశారని.. నిరంతరం పోరాటం సాగిస్తున్నారని.. కానీ న్యాయం మాత్రం జరగట్లేదని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

# జిల్లా వ్యాప్తంగా అకాల వర్షం

- జొన్న పంటలకు భారీ నష్టం



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 18(జనంసాక్షి ): జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం రైతులను తీవ్రంగా నష్టపరిచింది. పలుచోట్ల కోత దశలో ఉన్న పంటలు నేలకొరిగి రైతుల ఆశలు నీరుగారాయి. ఆసిఫాబాద్ మండలం జనకాపూర్ శివారులో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. స్థానిక రైతు బాబురావుతో పాటు మరో రైతు కలిసి మొత్తం 4 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. పంట కోత దశకు చేరుకున్న సమయంలో అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం వారి ఆశలను చల్లచెదురు చేసింది. వర్షం తీవ్రతకు జొన్న పంట పూర్తిగా నేలకొరిగి భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులతో అప్పుల బారిన పడ్డ రైతులకు ఈ నష్టం మరింత భారంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో అనేక మంది రైతులు నష్టపోయినట్లు తెలుస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావంతో ఇటీవలి కాలంలో అకాల వర్షాలు తరచుగా కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కోత దశలో ఉన్న పంటలకు ఈ వర్షాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# అవినీతి అధికారిపై చర్యలు తీసుకోరా?

- కేఎంసీ బడ్జెట్ సమావేశాల్లో ప్రశ్నించిన కార్పొరేటర్ కర్నాటి



ఖమ్మం బ్యూరో( జనం సాక్షి) : ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ గా పని చేస్తున్న జె అనిల్ పై పత్రికల్లో వార్తలు వస్తున్నప్పటికీ ఆయనపై చర్యలు తీసుకోరా.? అని కార్పొరేటర్ కర్నాటి కృష్ణ ప్రశ్నించారు. బుధవారం రూ.196 కోట్లతో రూపొందించిన ఖమ్మం కార్పొరేషన్ బడ్జెట్ సమావేశాలను చైర్మన్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కర్నాటి కృష్ణ మాట్లాడుతూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవడంలో తాత్సారం వహిస్తున్నారని మండిపడ్డారు. అసిస్టెంట్ కమిషనర్ అనిల్ పై "జనంసాక్షి" పత్రికలో సంచలనాత్మక వరుస కథనాలు వస్తున్న విషయాన్ని ఆయన సమావేశంలో వెల్లడించారు. నగరంలోని చాలా మంది కార్పొరేటర్లు సైతం ఆయన వ్యవహార శైలిపై గుర్రుగా ఉన్నారని ప్రస్తావించారు. అయినప్పటికీ సదరు అధికారిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని కర్నాటి కృష్ణ ప్రశ్నించారు. దీంతో స్పందించిన కలెక్టర్ అనుదీప్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ అసిస్టెంట్ కమిషనర్ పై వచ్చిన వార్తా కథనాలను పరిశీలిస్తున్నామని విచారణలో నిగ్గు తేలితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ఎస్ఐ భార్య ఆత్మహత్య

కరీంనగర్, మార్చి 18 (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. కరీంనగర్ టూ టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. విషపూరితమైన గన్నేరు పప్పు తినడంతో తీవ్ర అస్వస్థతకు గురైన దివ్యను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. చంద్రశేఖర్, దివ్య దంపతులకు ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. దివ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# మదనపల్లి ఫైల్స్ దహనం కేసులో పెద్ది రామంద్రారెడ్డి పిఎ, అనుచరుడి అరెస్ట్

తిరుపతి, మార్చి 18 (జనంసాక్షి) : తిరుపతి జిల్లా మదనప్లలె ఫైల్స్ దహనం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏగా వ్యవహరించిన ముని తుకారాం, ప్రధాన అనుచరుడు మాధవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. నాయకులతో కలిసి కాఫీ తాగేందుకు వచ్చిన ఇరువురిని చంద్రగిరి మండలం పనపాకం టోల్ ఎ÷-లాజా వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తిరుపతిలోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. మదనప్లలె సబ్ కలెక్టర్ కార్యాలయంలో 2024 జులై 21న ÷ల్స్ తగులబెట్టారు. ఈ కేసులో ఏ3గా మాధవరెడ్డి, ఏ4గా ముని తుకారాం ఉన్నారు. ఈ ఇద్దరు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఇటీవల వారికి అక్కడ చుక్కెదురైంది. ఈ నేపథ్యంలో సీఐడీ పోలీసులు బుధవారం వారిని అరెస్ట్ చేశారు.

# ఏఎస్ఐ అనుమానాస్పద మృతి

విజయవాడ, మార్చి18 (జనంసాక్షి) : కృష్ణా జిల్లా యనమలకుదురులో ఏఎస్ఐ అనుమానాస్పదంగా మృతి చెందారు. పడమట పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐగా చేస్తున్న వీరవల్లి గోపి వెంకట దుర్గాప్రసాద్ (54) ఒక కేసు విషయంలో 15 రోజుల క్రితం సస్పెన్షన్ కు గురైన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైనన్నారు. ఈ క్రమంలో యనమల కుదురు కరకట్ట శివారు ఒక పాకలో శవమై తేలారు. ఘటన స్థలానికి చేరు కున్న పెనమలూరు పోలీసులు హత్య లేక ఆత్మ హత్య అన్న కోణంలో విచారణ చేస్తున్నారు.

# నగరంలో కల్తీపన్నీర్ తయారీ

హైదరాబాద్, మార్చి18 (జనంసాక్షి) : కారం, చాయపత్త, పన్నీర్ ఇలా పలు రకాల ఆహార పదార్థాలను పలు రకాల రసాయనాలను ఉపయోగించి కల్తీ ఆహారపదార్ధాలను తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు కొందరు కేటుగాళ్లు. ఈజీగా మనీ సంపాదించుకునేందుకు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తాజాగా సికింద్రాబాద్ లోని మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో వేల కిలోల్లో కల్తీ పన్నీర్ బయటపడడంతో అధికారులతో సహా అంతా షాక్ అయ్యారు. కల్తీ పన్నీర్ తయారీ కేంద్రంపై ఫుడ్ ఇన్స్పెక్టర్ తో సహా ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు వేల కిలోలకు పైగా కల్తీ పన్నీర్ ను సీజ్ చేశారు ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు. శ్రీ బాలాజీ డైరీ ప్రొడక్ట్స్, విజయ్ మిల్క్, కర్డ్ షాపు తో సహా ఆరు షాపులపై దాడులు చేశారు. శ్రీ బాలాజీ డైరీ ప్రొడక్ట్స్ లో 1600 కిలోల పన్నీర్ ను సీజ్ చేశారు. విజయ్ మిల్క్ అండ్ కర్డ్ షాప్ లో1000 కిలోల కల్తీ పన్నీర్ సీజ్ చేశారు. నిర్వాహకులు నగరంలో పలు ప్రాంతాల్లో కల్తీ పన్నీరు అమ్ముతున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

### ఘనాపూర్ ప్రాజెక్ట్ ఆయకట్టు పరిస్థితి

# అగమ్య గోచరం

**అసెంబ్లీలో ప్రస్తావించిన నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి**



**కొల్చారం, మార్చి 18, (జనంసాక్షి):** ఘనాపూర్ (వనదుర్గ) ప్రాజెక్ట్ ఆయకట్టు పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. 1905 సంవత్సరంలో కరువు రక్కసి నుండి కాపాడేందుకు మాంజీర నదిపై కొల్చారం పాపన్నపేట సరిహద్దులో ఘనాపూర్ ఆయకట్ట నిర్మాణం జరిగింది. మంజీరా నదిపై సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూరు ప్రాజెక్టు నుంచి మెదక్ జిల్లా కొల్చారం మండలంలో ఉన్న ఘనాపూర్ ఆయకట్టు వరకు సంగారెడ్డి ఆందోల్ మెదక్ నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో 100 కిలోమీటర్ల మంజీర పరివాహక ప్రాంతంలో సుమారు ఒక లక్ష ఎకరాలలో పంతులు సాగవుతున్నాయి. ఈ ప్రాంతంలో హత్తునూర్ చిలాబ్ చెడ్ కొల్చారం పాపన్నపేట కౌడిపల్లి ప్రైవేట్ ఎత్తిపోతలు కాకుండా సుమారుగా 25 ప్రభుత్వ ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలతో సింగూర్ ప్రాజెక్ట్ భారీగా నుండి 60 70 టీఎంసీల నీరు వృధాగా పోయింది. సింగూర్ ప్రాజెక్ట్ భారీ వరదలతో ప్రమాద బారిన పడింది. మరమ్మత్తు చేయాలని సెంట్రల్ వర్కింగ్ టీం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఘనాపూర్ ఆయకట్టు కింద జనవరి నెలలో రైతులు పంటలు సాగు చేశాక ఈ నిర్ణయం బయటపడడంతో రైతులకు ఇబ్బంది కరంగా మారింది. మాఘ అమావాస్య నుండి శివరాత్రి వరకు నీటి విడుదల తో రైతులు సాగు చేసిన పంటలకు 90 రోజులపాటు నీరు అందింది. పంట చేతికి మరో 30 రోజుల సమయము వచ్చేందుకు ఉండగా సింగూరు నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. మరో 30 రోజులు పంట లు చేతికి రానున్నందున పది రోజులకు ఒకసారి విడతగా 1.35 టీఎంసీల నీటిని విడుదల చేసి సుమారుగా 1లక్ష ఎకరాలలో పంటలు చేతికందనున్నాయి. ఈ విష యమై నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతలక్ష్మారెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డికి మెమోరాండం అందజేయడమే కాకుండా బుధవారం రోజున అసెం బ్లీలో ప్రస్తావించారు. వెంటనే నీటిని విడుదల చేయాలని రైతులు కోరుచున్నారు.







### వెంగళరావు నగర్‌లో 3 ఎకరాల

## ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

- రూ. 600ల కోట్ల విలువైన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్
- ఎత్తులకుపై ఎత్తులతో ఆక్రమణలకు దిగిన కబ్జాదారులు



**హైదరాబాద్, మార్చి 18:** నగరం నడిబొడ్డున ఖైరతాబాద్ మండలం వెంగళరావునగర్లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. మార్కెట్లో దీని విలువ రూ. 600ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా.. 1975 కంటే ముందే సంబంధిత వ్యక్తులకు పరిహారం ఇచ్చి 45 ఎకరాల భూమని హౌసింగ్ బోర్డు సేకరించింది. మొత్తం 660 ప్లాట్లతో లే ఔట్ వేసింది. ఇందులో పార్కులకోసం కొన్ని స్థలాలను కేటాయించింది. వెంగళరావునగర్ ప్రధాన రహదారికి ఆనుకుని ప్రజావసరాలకోసం 5 ఎకరాల స్థలాన్ని ఖాళీగా ఉంచింది. ఇందులో ఇప్పటికే 2 ఎకరాల వరకూ ఆక్రమణలు జరిగి శాశ్వత కట్టడాలు వచ్చాయి. వాటి జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 3 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా బుధవారం కాపాడింది. హౌసింగ్ బోర్డు నుంచి గతంలో పరిహారం తీసుకున్నవారితో పాటు మరో 3 గ్రూపులు ఈ భూమి తమదిగా చెబుతూ ఆక్రమణలకు పాల్పడిన వారితో హైడ్రా సమావేశం ఏర్పాటు చేసింది. ఎవరి వద్దా సరైన పత్రాలు లేవని నిర్ధారించింది. ఇదే సమయంలో ఆ ఖాళీ స్థలం తమదిగా పేర్కొంటున్న వారు హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈ విషయంలో హైకోర్టు స్టే ఇచ్చింది. స్టే కొనసాగుతున్నప్పుడు అక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదనే నిబంధనలు పట్టించుకోకుండా.. అందులో కొత్తగా షెడ్డులు వేయడం, గుడిసెలు నిర్మించడం, వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తూ రావడంపై స్థానికుల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. మీడియాలో కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణలకు సంబంధించిన కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా బుధవారం ఆక్రమణలను తొలగించింది. 3 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

# ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలి



- చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించాలి
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

**సూర్యాపేట (జనంసాక్షి):** అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై యుద్ధం ఆపాలని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విజయ్ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం నాలుగవ వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దాడులు దాని పర్యవసానాలు అనే అంశంపై జరిగిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇరాన్ పై యుద్ధం మూలంగా దేశంలో గ్యాస్ కొరత తీవ్రంగా ఏర్పడింద న్నారు. ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయి రాబోయే రోజుల్లో చమురు, డీజిల్, పెట్రోల్ దొరకకుండా పోయే ప్రమాదం ఉందన్నా రు. ఇప్పటికే కేంద్రప్రభుత్వం గ్యాస్‌పై 60 రూపాయలు పెంచింద న్నారు. పీఎం మోడీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఇరాన్ పై వెంటనే దాడులను ఆపేయాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని డిమాండ్ చేశారు. యుద్ధం వల్ల పశ్చిమాసియాలో పని చేస్తున్న కోటి మంది భారతీయులకు ఉపాధి పోయే అవకాశం ఉందని, దిగుమతులపై పెద్ద ఎత్తున ధరలు పెరిగి భారత ప్రజలపై భారం పడే అవకాశం ఉందని, అందుకే యుద్ధాన్ని నివారించడానికి భారత ప్రభుత్వం మాట్లాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజాస్వామ్య దేశాలతో కలిసి యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నం చేయాలని కోరారు. వీరనారి మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకమని, ఈ తరానికి ఆమె ఒక స్ఫూర్తి అని, ఆమె పోరాటం అందరికీ ఆదర్శమని అన్నారు. తుపాకీ పట్టి నిజాంను ఎదురించిన వీరవనిత అన్నారు. నమ్మిన ఆశయం కోసం కొట్లాడిన ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. అంతకుముందు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రజానాట్య మండలి కళాకారులు అలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370